# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 56 సంచిక : 7 జులై, 2023 పేజీలు : 24 వెల : రు. 10/-


## 1946 జులై 4

# వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట విజయాలను చరిత్ర నుండి తుడిచిపెట్టలేరు

**ఆంధ్ర** మహాసభ ప్రారంభించగా, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దన్నుతో సాగుతున్న నీచమైన నైజాం నవాబు నియంతృత్వ పాలనను చావుదెబ్బ తీసింది. నిజాం ఉక్కుపాదం క్రింద చెప్పనలవికాని అనేక నిర్బంధాలతో బాధలనుభవిస్తున్న ప్రజానీకాన్ని ఈ పోరాటం విముక్తి చేసింది.

అయితే నేడు–సత్యానంతర(పోస్ట్‌ట్రూత్), దూషిస్తూ నిరాకరించే (గ్యాస్‌లైటింగ్) యుగంలో, తెలంగాణాను నిజాం నుండి విముక్తి చేసిన ప్రతిష్టను స్వంతం చేసుకునేందుకు బడాపాలకవర్గ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఘర్షణ పడుతున్నాయి. తెలంగాణా తాడిత, పీడిత ప్రజానీకపు విముక్తి ప్రదాతలు తామే అయినట్లుగా ఈనాడు వారు భారీ,తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. నిజాం క్రూర పాలన నుండి తెలంగాణాను విముక్తిచేసిన కీర్తి ప్రతిష్టలను కబళించటం కోసం తప్పుడు కథనాలతో, ప్రకటనలతో మోసపూరితంగా చరిత్రను వారు తప్పుదోవ పట్టిస్తూ, వక్రీకరిస్తున్నారు.



అసలు వాస్తవం, 1946 జులై 4న కడివెండి అనే గ్రామంలో నిజాం సంస్థానంలో నవాబుయొక్క ఫ్యూడల్, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక ప్రతిఘటన జరిగింది. నిరంకుశ ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల చైతన్య వెల్లువను ఓడించేందుకు ఫ్యూడల్ దొరలందరూ విసునూరి రామచంద్రారెడ్డి నాయకత్వంలో ఆ రోజునే కుట్రజేశారు. వారి కుట్రను భగ్నంచేసి, తిప్పికొట్టాలని అదే రోజుననే కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. అదేరోజున పీడిత ప్రజానీకం ఫ్యూడల్ దొర గడీవైపుగా కదంతొక్కి, తమ సాంప్రదాయక ఆయుధాలతో తలపడ్డారు.

ఫ్యూడల్ దొరల కిరాయి గూండాలు కదులుతున్న ప్రజానీకంపై కాల్పులు జరిపి, ముందుభాగానవున్న దొడ్డి కొమరయ్యను కడతేర్చారు. ఈ సంఘటన ప్రజానీకంలో ఆగ్రహజ్వాలలను రగిలించింది. వారి క్రోధం లావాలా ప్రవహించింది. ఆ సమయంలో అందుబాటులో నున్న కామ్రేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మరికొందరు నాయకులు భూస్వాముల కుట్రలను ధ్వంసం చేసేందుకు ప్రజా ప్రతిఘటనకు నాయకత్వం వహించి దిశానిర్దేశం చేశారు. ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా తమ పోరాటంలో ప్రజలు కర్రలు, విల్లంబులు వంటి అందుబాటులో నున్న సాంప్రదాయక ఆయుధాలను ఉపయోగించాలని నాయకులు ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజలు గడీని చుట్టముట్టి, పొగబాంబుల నుపయోగించి, గడీని తమ అధీనంలోకి తెచ్చుకొని దానిని ధ్వంసం చేశారు; యజమానులు, ఫ్యూడల్ భూస్వాములు పలాయనం చిత్తగించారు.



## విప్లవ కమ్యూనిస్టు నాయకుడు, మార్క్సిస్టు మేథావి

## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి విప్లవ జోహార్లు

జూలై 28
కా॥ టి.ఎన్.
వర్ధంతి

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 56
సంచిక : 7

లోపలిపేజీల్లో....

చరిత్ర :
1946 జులై 4 1
రాజకీయార్థికం :
2వేల రూ॥ నోట్ల ఉపసంహరణ - ప్రొ॥ తోట జ్యోతిరాణి 3
నిండా సంక్షోభంలో సామ్రాజ్యవాద కార్పొరేషన్లు 6
స్మార్ట్ మీటర్లు -సర్దుబాటు ఛార్జీల భారాలు 11
డాక్యుమెంట్ :
దేశంలోని వ్యవసాయ వ్యవస్థ-లక్షణాలు - అలోక్‌ముఖర్జీ 13
ప్రకటన :
10 వామపక్ష పార్టీల పిలుపు 24
జోహార్లు :
కా॥ ఏసు 10
రిపోర్టులు :
అఖిలభారత ఆదివాసీ సదస్సు 22
మహారాష్ట్ర : కాంకర్ కార్మికుల ఆందోళన 23
ఢిల్లీ : రైతుల, కూలీల, శ్రామికుల ప్రదర్శన-ధర్నా 24
హర్యానా : గిట్టుబాటు ధరకోసం ఆందోళన 24

వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

ఈరోజు-తెలంగాణా పోరాటాన్ని ప్రారంభించిన రోజు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట తొట్టతొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య నేలకొరిగిన రోజు, ఈరోజు. క్రూర నిరంకుశ నైజాం నవాబు గోరీ తవ్వటం మొదలైన రోజు, ఈరోజు. ఫ్యూడల్ బంధనాలు, బానిసత్వాల నుండి విముక్తి ప్రారంభమైన రోజు, ఈరోజు. ఫ్యూడల్ భూస్వాముల పతనం ప్రారంభమైన రోజు, ఈ రోజు. గ్రామవలంటరీ దళాలు, ప్రజాగెరిల్లా దళాలు, గ్రామ ప్రజా అధికారంకోసం సంఘటిత మవటం మొదలైన రోజు. పీడిత తెలంగాణాను విముక్తి చేసేందుకు తమ సమయాన్ని, శక్తియుక్తులన్నింటినీ ధారపోసిన ఆనాటి కమ్యూనిస్టు పార్టీకే, దీనంతటి కీర్తి ప్రతిష్టలు దక్కుతాయి.

ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో తెలంగాణా ప్రజానీకం భూస్వాములనుండి 10 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. వారి గ్రామాలను వారే పరిపాలించారు. నిజాం పాలనకు దన్నుగానున్న దుష్ట ఖాసిం రజ్వీసైన్యాన్ని వారు మట్టి కరిపించారు. కమ్యూనిస్టుపార్టీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలు ఖాసిం రజ్వీ సైన్యమైన రజాకార్లకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించాయి. నిజాం పాలనను అంతమొందించేందుకోసం తెలంగాణా ప్రజానీకం అసమాన త్యాగాలతో కూడిన వీరోచిత పోరాటాలు చేశారు.

సరిగ్గా ఈ సమయంలోనే, కేంద్ర హోంమంత్రి వల్లభాయిపటేల్ సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనంచేసే 'పవిత్ర కర్తవ్యాన్ని' చేపట్టాడు. అదే సమయంలో నెహ్రూ 'పోలీస్ చర్య' పేరుతో యూనియన్ బలగాలను తెలంగాణా పైకి పంపాడు. బాధలనెదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలబడే బదులుగా, కమ్యూనిస్టుల నాయకత్వంలోని ప్రజాఉద్యమాలను అణచివేసేందుకే ఈ బలగాలు పూనుకున్నాయి. గ్రామాల నొదిలి పారిపోయిన ఫ్యూడల్ దొరలు కాంగ్రెస్ పాలకుల మద్దతుతో గ్రామాలకు తిరిగి చేరుకున్నారు. యూనియన్ పోలీసు బలగాలకు, ప్రజలకు నడుమ జరిగిన పోరాట క్రమంలో నాలుగువేల మందికి పైగా ప్రజాసైన్య నాయకులు, కార్యకర్తలు చావోరేవో తేల్చుకునే స్ఫూర్తితో తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి మరణం-ఒక వీరోచితమైనది.

విముక్తికోసం సాగిన మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్ర అంటే ఇది. మనదేశంలోని అర్ధవలస-అర్ధఫ్యూడల్ వ్యవస్థను అంతంచేసేందుకు భారత విప్లవానికి ఇదొక మార్గాన్ని చూపింది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా పాలకవర్గ పార్టీలు, నిజాం నుండి తెలంగాణాను విముక్తి చేసిన కీర్తి తమదేనని తప్పుడు పద్ధతుల్లో ప్రకటించుకుంటున్నాయి.

తెలంగాణా విముక్తికి వల్లభాయ్ పటేల్ కారణమని బిజెపి నాయకత్వం పదేపదే ప్రకటించు కుంటోంది. భావజాలపరంగా పటేల్ ఆలోచనలు, తమవీ ఒకటేనని వారు ప్రకటిస్తున్నారు. మరోవైపున కాంగ్రెస్, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటకాలంలో యూనియన్ బలగాలను పంపాడు కనుక, తెలంగాణా విముక్తి ప్రదాత నెహ్రూ అని పొగుడుతోంది.

ఈ రకమైన తప్పుడు ప్రకటనలతో, ప్రచారాలతో, ఈ రెండు పాలకవర్గ పార్టీలు తెలంగాణా విముక్తి కీర్తిప్రతిష్టలను, గౌరవాలను కాజేయటానికి మాత్రమేగాకుండా, ఈ తరహా ప్రచారంతో ప్రజలను మోసగించి ఎన్నికలలో లబ్ధి పొందాలని కూడా భావిస్తున్నాయి.

ఆనాటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, మాజీ సంస్థానాధీశుల రాచరిక హక్కుల, అధికారాల పరిరక్షణకు గ్యారంటీనిచ్చింది. ఆవిధంగా వారు సంస్థానాధీశులతో రాజీపడి, ఆనాటి తెలంగాణా ప్రజా ఆకాంక్షలకు ద్రోహం చేశారు. భూమి, భుక్తికోసం రైతాంగం సాగించిన సాయుధ పోరాటాన్ని అణచివేయటం ద్వారా, తెలంగాణా రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేశారు.

నెహ్రూ, పటేల్‌ల వంచన ఆవిధంగా సాగింది. నేడు బిజెపి పటేల్‌ను స్వంతంచేసుకుంటోంది. నేడు కాంగ్రెస్, బిజెపిలు రెండూ చారిత్రక వాస్తవాలను వక్రీకరించి, తప్పుడు పద్ధతుల్లో వ్యాఖ్యానిస్తూ, తెలంగాణా విముక్తిగా చెప్పబడే దాని కీర్తిని కొట్టేయటానికి ఘర్షణ పడుతున్నాయి.

సైనిక బలగాలతో, రాజకీయ కుటిలత్వంతో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం అణచివేయబడకుండా వుండి వుంటే, తెలంగాణా ప్రజానీకం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో కొనసాగుతున్న అర్ధవలస-అర్ధఫ్యూడల్ వ్యవస్థను కూలద్రోసి నిజమైన విముక్తిని అనుభవిస్తూ వుండి వుండేవారన్నది వాస్తవం.

తెలంగాణా విముక్తిగా చెప్పబడే దాని కీర్తిప్రతిష్టలను అనుచితంగా ప్రకటించుకోవటం, 1946-50ల నడుమ సాగిన తెలంగాణా రైతాంగ పోరాట వీరోచిత, వాస్తవిక చరిత్రను ఏవిధంగానూ తుడిచిపెట్టటం సాధ్యంకాదు; తుడిచిపెట్టలేరు కూడా. ★

# రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ - బలపడుతున్న నల్లధనం

ప్రొ॥ తోట జ్యోతీరాణి

**2000** రూపాయల నోట్ల ఉపసంహరణ గురించి మే 19, 2023న రిజర్వు బ్యాంకు ప్రకటించడంతో గత మూడు సంవత్సరాలుగా ఈ నోట్లు రద్దవుతాయని జోరుగా సాగిన ప్రచారం వాస్తవం అయింది. అయితే 2016 లో పెద్దనోట్ల రద్దును మోదీ ప్రకటించటం ప్రజాపక్షవాదులతో పాటు పార్లమెంటరీ ప్యానల్ నివేదిక - 2017 కూడా సీరియస్‌గా విమర్శించింది. అందుకే ఈసారి కేంద్ర ప్రభుత్వం ఆ పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నది. ప్రకటన రిజర్వు బ్యాంకు నుండి వచ్చింది. అయినా జనం దృష్టిలో ఇది ప్రధానమంత్రి మోదీ ప్రకటనే. నిజానికి స్వతంత్ర నిర్ణయాలు అభావమై, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల పరిధిలో మాత్రమే పనిచేస్తున్న సమస్త చట్టబద్ధ సంస్థలలో రిజర్వు బ్యాంకు ఒకటి అని ప్రజలందరికీ తెలిసిన విషయమే. నోట్ల రద్దు అనే మాట వింటేనే మెజారిటీ ప్రజలకు పెద్దనోట్ల రద్దు వల్ల తమ తమ జీవితాలలో కలిగిన సంక్షోభం, ఇంకా కొనసాగుతున్న ఆ దుర్భర పరిస్థితులు గుర్తుకొస్తాయి. అట్లాకాకుండా వుండడానికి చలామణి నుండి 2000 రూ॥ల నోట్లను రద్దుచేయటం లేదు అని, ఉపసంహరించుకుంటున్నామని రిజర్వు బ్యాంకు మాటల గారడీ చేస్తున్నది. ఈ నోట్ల ముద్రణను 2018లోనే రిజర్వు బ్యాంకు నిలిపివేసింది. అప్పటినుంచి బ్యాంకులు జారీ చేయడం లేదు. ఏటీఎంలలో కూడా లభించడం లేదు. సెప్టెంబర్ 30, 2023 తర్వాత ఈ నోట్లను బ్యాంకులలో మార్చుకోవటానికి లేదా డిపాజిట్ చేయటానికి వీలుండదు. అయినప్పటికీ ఈ నోట్లు లీగల్ టెండర్‌గా కొనసాగుతాయని రిజర్వు బ్యాంకు చెప్పటం సీరియస్ వైరుధ్యమే. అయితే గడువులోగా ఈ నోట్లను మార్చుకోవటానికి, డిపాజిట్ చేయటానికి ప్రోత్సహించాలంటుంది. ఎవరు, ఎవరిని, ఎట్లా ప్రోత్సహించాలి అన్న విషయంలో రిజర్వు బ్యాంకు మౌనంగా వుంటుంది.

పాలకవర్గం తీసుకొనే ఏ విధాన నిర్ణయానికైనా ఆర్థిక పురోగతి, సామాన్య ప్రజల ప్రయోజనం లక్ష్యాలుగా వుండాలి. నయా ఉదారవాద విధానాలలో ఈ లక్ష్యం అదృశ్యమవుతుంది. అందువల్లనే 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ విషయంలో ప్రామాణికమైన కారణాలను రిజర్వు బ్యాంకు చెప్పలేకపోతున్నది. అందువల్ల ఈ చట్టబద్ధ సంస్థ అపహాస్యం పాలవుతున్నది. ఈ చర్య గురించి సామాన్య ప్రజలను సంబోధించి ఒకే ఒక విషయం చెబుతున్నది. అదేమిటంటే పెద్ద నోట్ల రద్దును అకస్మాత్తుగా ప్రకటించటం వల్ల బ్యాంకుల ముందు సామాన్య జనం పెద్దపెద్ద క్యూలలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చిందని, ఆ సమస్య ఇప్పుడు వుండదని చెబుతున్నది. క్యూలో నిలబడే అవసరం లేకపోవడం దానంతటదే సామాన్య ప్రజలకు ప్రయోజనం ఎలా అవుతుంది? సామాన్య జనం దగ్గర 2000 రూ॥ల నోట్లు లేనే లేవని రిజర్వు బ్యాంకు చెబుతున్న నేపథ్యంలో ఇక సామాన్య జనం ఈ నోట్లను మార్చుకునే ప్రశ్న రాదు కదా!

పెద్ద నోట్ల రద్దు వెనువెంటనే అమలైన వస్తుసేవల పన్ను, కోవిడ్-19 విపత్తు, అన్నీ కలిసి సృష్టించిన అనేకానేక సమస్యలతో దుర్భరమైన జీవితాలను ఇంకా అనుభవిస్తున్న పీడితవర్గ ప్రజల బతుకులను ప్రస్తావించకుండా, పెద్దనోట్ల రద్దు సృష్టించిన ఏకైక సమస్య బ్యాంకుల ముందు క్యూలలో నిలబడటమే అంటూ మెజారిటీ ప్రజల జీవన సంక్షోభాన్ని తేలిక చేసి చెప్పటం పాలకవర్గం యొక్క క్రూరమైన దుర్మార్గమే.

2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ వల్ల మెజారిటీ ప్రజలకు ఏ ఇబ్బందీ వుండదు అని రిజర్వు బ్యాంకు చెబుతున్నది. ఇబ్బంది లేకపోవటమే ప్రయోజనమా? చలామణి నుండి 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ తప్పనిసరిగా ద్రవ్య సరఫరాని ప్రభావితంచేస్తుంది. అందువల్ల ఆర్థిక వ్యవస్థ గమనంలో మార్పులు వస్తాయి. మెజారిటీ ప్రజల మీద దీని ప్రభావం ఏ విధంగా ఉంటుందన్నది ముఖ్యమైన విషయమే. మెజారిటీ ప్రజలు ఆర్థిక వ్యవస్థ నుండి వేరుపడి వున్నారా? ఆర్థిక వ్యవస్థ గమనంతో వీళ్ళ సంబంధం తెగిపోయిందా? 2000 రూ॥ల నోట్లతో మెజారిటీ ప్రజలకు సంబంధం లేకపోవటం అన్నది బలంగా తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలను, మెజారిటీ ప్రజల దుర్భర జీవితాలను సూచిస్తుంది. 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ విషయంలో రిజర్వు బ్యాంకు సమర్థించుకుంటున్న తీరు ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నది.

గత తొమ్మిది సంవత్సరాల నుండి కార్పొరేటు శక్తులను బలోపేతం చేసే లక్ష్యంతో దూకుడుగా అమలవుతున్న నయా ఉదారవాద చట్రంలో రూపొందిన విధానం ఇది. పీడిత వర్గం మీద ఈ చర్య తప్పనిసరిగా ప్రతికూల ప్రభావాన్నే చూపిస్తుంది. అందుకే రిజర్వు బ్యాంకు ఇరకాటంలో పడింది. అసంబద్ధ కారణాలు చెబుతూ అభాసు పాలవుతున్నది.

### చలామణి నుండి 2000 రూపాయల నోట్ల ఉపసంహరణ:

2016లో 1000 రూ॥ల నోట్లు పెద్ద నోట్లని రద్దయ్యాయి. ఆ స్థానంలో ఆర్‌బిఐ చట్టం, 1934 సెక్షన్ 24(1) కింద అంతకు రెండు రెట్లు అధిక విలువ గల 2000 రూ॥ల నోట్లు వెనువెంటనే చలామణిలోకి వచ్చాయి. ఇదొక విడ్డూరం, సీరియస్ వైరుధ్యం. 500 రూ॥లు, 1000 రూ॥ల నోట్లు పెద్ద నోట్లు అంటూ రద్దు చేసిన సమయానికి 2000 రూ॥ల నోట్లు ముద్రించబడి వుండడం వైరుధ్యమే. పాత 500 రూ॥ల నోట్ల స్థానంలో కొత్త 500 రూ॥ల నోట్లు వచ్చాయి. కొత్త నోట్ల ముద్రణకు వేలకోట్లు ఖర్చయినాయి. 2016-17లో 350 కోట్ల సంఖ్యలో 2000 రూ॥ల నోట్లను ముద్రించటానికి 1,120 కోట్ల వ్యయం అయింది. వీటిని రవాణా చేయడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి 30 కోట్ల వ్యయం చేశారు. కొత్త నోట్లకు అనుగుణంగా ఎటిఎంలలో సాంకేతిక సర్దుబాటు కోసం కూడా ఖర్చు అయింది.

ఇంత భారీ స్థాయిలో ప్రజాధనం ఖర్చు చేసి ముద్రించి, చలామణిలోకి తెచ్చిన 2000 రూ॥ల నోట్ల ముద్రణను 2018లోనే నిలిపివేశారు. వీటి మన్నిక ప్రమాణం నాలుగైదు సంవత్సరాలు. అందుకే పాడైపోయిన నోట్లు ప్రజల వద్ద వుండొద్దని, 'క్లీన్ నోట్ పాలసీ'లో భాగంగానే ఈ ఉపసంహరణ అని రిజర్వు బ్యాంకు చెబుతున్నది. మెజారిటీ ప్రజలు ఉపాధులను కోల్పోయి, సంపాదన లేక, పేదరికంతో, ఆకలి సమస్యతో, విద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి రాకుండా దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్న సందర్భంలో మెజారిటీ ప్రజల బతుకులు బాగు చేయటానికి కాకుండా నోట్ల రద్దు, ముద్రణ, ఉపసంహరణ అంటూ వేలకోట్ల ప్రజాధనాన్ని వృధాగా ఖర్చు పెట్టడం దానంతటదే మెజారిటీ ప్రజల శ్రేయస్సుకు వ్యతిరేకం. అటు నోట్లు పాడైపోతే ప్రజలు వాళ్ళంతటవాళ్లే బ్యాంకులలో మార్చుకోవటానికి వస్తారు. అప్పుడే ఇతర విలువ గల నోట్లను ఇవ్వవచ్చు. చాలా సింపుల్‌గా, ఖర్చు లేకుండా

చేయగల పరిష్కారానికి 2,000 రూ॥ల నోట్ల ఉపసంహరణ ఏ విధంగా సమర్ధనీయం? అంతేకాకుండా 4 నెలలు, 2000 రూపాయల నోట్లు మార్చుకోవటానికి లేదా డిపాజిట్ చేయటానికి 36 కోట్ల (3.62 లక్షల కోట్ల విలువ గల 2000రూ॥ల నోట్లు ఉన్నాయి) లావాదేవీలు జరగాలి. ఒక్కొక్క లావాదేవీకి నాలుగు నిమిషాలు పట్టినా 144 కోట్ల నిమిషాలు అంటే 2.4 కోట్ల గంటలను అటు బ్యాంకు సిబ్బంది, ఇటు ప్రజలు కోల్పోతారు. అంటే పరిమితంగా వున్న బ్యాంకు సిబ్బంది ముఖ్యమైన పనులు పక్కకు పెట్టక తప్పదు. ఈ నాలుగు నెలల కాలంలో బ్యాంకులలో ఇతర లావాదేవీలలో సామాన్య జనం ఇబ్బంది పడతారు. ఈ చర్య సామాన్య జనానికి అక్కరలేని విషయం ఎలా అవుతుంది?

2000 రూ॥ల నోట్లు అసలు ప్రధానమైన కరెన్సీ కాదని రిజర్వు బ్యాంకు చెబుతున్న మరొక సమర్ధన. ఈ నోట్ల ముద్రణ 2018లోనే నిలిచిపోయింది. అప్పటి నుండి బ్యాంకులు ఖాతాదారులకు ఇవ్వవు. ఎటిఎంలలో పెట్టవు. మార్చి 2018లో 6.73 లక్షల కోట్ల విలువ గల 2000 రూ॥ల నోట్లు వున్నాయి. చలామణిలో వున్న నగదులో వీటి వాటా 37.3 శాతం. కాగా మార్చి 2023 నాటికి ఈ నోట్ల విలువ 3.62 లక్షల కోట్లకు పడిపోయింది. సమాంతరంగా చలామణిలో వున్న నగదులో ఈ నోట్ల వాటా 10.8 శాతానికి తగ్గింది. ఈ నోట్లన్నీ పన్ను ఎగవేతదారులు, నల్ల మార్కెట్ దిగ్గజాల వద్ద నల్లధనంగా పోగు పడిందని రిజర్వు బ్యాంకు చెబుతున్నది. దీనిని బయటకు తీసే క్రమమే 2000 రూపాయల నోట్ల ఉపసంహరణ అన్నమాట. పెద్దనోట్ల రద్దు కాలం నుండి ఇప్పటివరకు 2,000 రూ॥ల నోట్లు నల్లధనంగా రూపొందుతున్న క్రమాన్ని ప్రభుత్వం అడ్డుకోలేకపోవటం, మౌన ప్రేక్షక పాత్ర వహించడం ప్రభుత్వ అసమర్ధతకు చిహ్నమే కదా!

అయితే, పాలకవర్గం ముందున్న సమస్య ఏమిటంటే ఈ నల్లధనాన్ని తెల్లధనంగా ఎలా మార్చాలి అన్నదే. నిజానికి వర్ధమాన దేశాలలో పెట్టుబడి దారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం, నల్లధనంతో బలంగా ముడిపడి ఉంటుంది. రకరకాల రూపాలలో వున్న ఆధిపత్య వర్గం గుప్పిట్లో నల్ల ఆర్థిక వ్యవస్థ విశృంఖలంగా విస్తరిస్తుంది. ఇందుకు పాలకవర్గం అండదండ వుంటాయి. అసలు ఆధిపత్య వర్గం, పాలకవర్గం వేర్వేరు కాదు. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చడానికి పాలకవర్గ అండదండలతో హవాలా, మనీ ల్యాండరింగ్ బలంగా కొనసాగుతూనే వున్నాయి. సమాంతరంగా చట్టబద్ధ మార్గాలు రూపొందించబడి అమలు అవుతాయి. ఆ క్రమంలో రూపొందిన విధానమే 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ.

## నోట్ల ఉపసంహరణ అమలుతో నల్లధనం ఏమవుతుంది?

2000 రూ॥ల నోట్లు ఆధిపత్య, సంపన్న వర్గం వద్ద నల్లధనంగా పోగు పడిందని, అందువల్లనే ఈ నోట్లను చలామణి నుండి ఉపసంహరించుకున్నట్లు రిజర్వు బ్యాంకు స్వయంగా ప్రకటించిన విషయం మనందరికీ తెలుసు. నల్లధనానికి సంబంధించి ఈ చర్య లక్ష్యం ఏమిటో నోట్ల ఉపసంహరణ ప్రక్రియను అమలుచేసే విధానంలో స్పష్టంగా అర్థమవు తుంది. దోపిడీ శక్తుల గుప్పిట్లో వున్న నల్లధనాన్ని సులభంగా తెల్లధనంగా మార్చుకోవటానికి సమర్థవంతమైన అవకాశాలను ఈ ఉప సంహరణ కల్పించింది.

1. మే 23, 2023 నుండి సెప్టెంబర్ 30, 2023 వరకు 2000 రూ॥ల నోట్లను బ్యాంకులలో మార్చుకోవచ్చు లేదా డిపాజిట్ చేయవచ్చు. మార్చుకోవటానికి కావలసిన నగదు బ్యాంకుల్లో వున్నదని రిజర్వ్ బ్యాంకు చెబుతుంది.
2. 2000 రూ॥ల నోట్లను ఒక్కసారి పది నోట్లను అంటే 20,000 రూ॥లను మార్చు కోవచ్చు. రోజుకు ఎన్నిసార్లు మార్చుకోవాలన్న అంశంలో ఏ నిబంధనా లేదు.
3. 2000 రూ॥ల నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయవచ్చు. మిగిలిన సాధారణ డిపాజిట్ల నిబంధనలే 2000 రూ॥ల నోట్ల డిపాజిట్లకు వర్తిస్తాయి. ఎవరి అకౌంట్లోనైనా జమ చేయవచ్చు.
4. డిపాజిట్ చేసిన డబ్బు నుండి ఎప్పుడైనా, ఎంతైనా విత్ డ్రా చేసుకోవచ్చు.

ఈ విధంగా నల్ల కుబేరుల వద్ద వున్న నల్లధనాన్ని సునాయాసంగా, సౌలభ్యంగా తెల్లధనంగా మార్చుకోవటానికి వీలైనన్ని అవకాశాలను కల్పించారు. జూన్ 7, 2023 నాటికి 1.8 లక్షల కోట్ల రూ॥లు బ్యాంకుకు వాపస్ వచ్చాయని, ఇందులో 75 శాతం డిపాజిట్లేనని రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తి కాంత్ దాస్ చెప్పారు. ఇదే ధోరణి కొనసాగితే సెప్టెంబర్ 30 నాటికి 2.7 లక్షల కోట్ల రూ॥ల డిపాజిట్లు వస్తాయని అంచనా. ఈ డిపాజిట్ల ద్వారా బ్యాంకుల ద్రవ్యత్వం పెరుగుతుందని, అందువల్ల డిపాజిట్లను ఆకర్షించటానికి వడ్డీ రేట్లను పెంచాల్సిన అవసరం వుండదని చెబుతున్నారు. ఇంకా ఈ డిపాజిట్ల వలన చలామణిలో వున్న నగదు పరిణామం తగ్గుతోందని, అందువల్ల ధరల పెరుగుదల తగ్గుతుందని కూడా చెబుతున్నారు.

2000 రూ॥ల నోట్లన్నీ నల్ల కుబేరుల వద్ద నల్లధనంగా వున్నదని రిజర్వు బ్యాంకు ప్రకటించింది కదా! అంటే 2000 రూ॥ల నోట్లను మార్చుకోవడం ద్వారా డిపాజిట్ల ద్వారా అది లీగల్ ద్రవ్యంగా అంటే తెల్లధనంగా మారుతున్న విషయం నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి రిజర్వు బ్యాంకు అసంబద్ధ విషయాలను చెబుతున్నది. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే క్రమంలో బ్యాంకుల ద్రవ్యత్వం పెరుగుతున్నదన్నమాట. డిపాజిట్లను ఎప్పుడైనా విత్ డ్రా చేసుకునే సౌలభ్యం వున్నప్పుడు ఈ డిపాజిట్ల ఆధారంగా ద్రవ్యత్వం పెరగదు. 2000 రూ॥ల నోట్లు సంపన్నవర్గం దగ్గర నిల్వ చేయబడి వున్నాయని రిజర్వు బ్యాంకు చెప్పింది కదా! నోట్ల ఉపసంహరణ ప్రకటనతో దాచి పెట్టబడి వున్న ఈ నిల్వలను బయటకు తీసి బ్యాంకుల ద్వారా తెల్లధనంగా మార్చారు. దీనివల్ల చలామణిలో వున్న నగదు పరిమాణం పెరుగుతుంది. కానీ చలామణిలో వున్న నగదు పరిమాణం తగ్గిందని చెప్పటం సీరియస్ వైరుధ్యమే.

ఈ విధంగా నల్లధనాన్ని చాలా సులభంగా బ్యాంకుల ద్వారా తెల్లధనంగా మార్చుకోవటానికి ఈ స్థాయిలో సదుపాయాలను రిజర్వు బ్యాంకు కల్పించినప్పటికీ నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడగానే పెద్దపెద్ద నగరాలలో వెంటనే బంగారు, వజ్రాల ఆభరణాల విక్రయాలలో 20 శాతం పెరిగింది. 2000 రూ॥ల నోట్లను ఆమోదించడానికి 10-15 శాతం మేరకు రేట్లను పెంచినా కొనుగోళ్లు కొనసాగాయి. ఫలితంగా బంగారం రేటు ఇంకా పెరిగింది. అతి తక్కువ వస్తు సేవల పన్ను విధించినప్పటికీ బంగారాన్ని సంపన్న వర్గం మాత్రమే కొనుగోలు చేయగల పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగారం విక్రయాలను పెంచడానికి నోట్ల ఉపసంహరణ ఒక సాధనమైంది. నల్లధనం వెనువెంటనే బంగారం, వజ్రాల రూపంలోకి మారిపోయింది. బడా దిగ్గజాల ఆధిపత్యంలో ఈ వ్యాపారం వుంటుంది. అది స్మగ్లింగ్‌తో బలంగా ముడిపడి వుంటుంది. కాబట్టి ఇటువంటి వ్యాపారాలు దివాళా తీయకుండా చూడటం నయా ఉదారవాద విధానాల లక్ష్యం కదా!

అదేవిధంగా కుదేలవుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని ఉద్దీపన చేయాల్సిన అవసరం వున్నది. నోట్ల ఉపసంహరణతో పెద్ద నగరాలలో విలాస వంతమైన విల్లాలకు, ఫ్లాట్లకు గిరాకీ పెరిగింది.

భవిష్యత్తు ఉంటుందనుకున్న చిన్న పట్టణాలలో భూముల కొనుగోళ్లు పెరిగాయి.

ఇంకా హై ఎండ్ వస్త్రాలు, సూపర్ విలాస వస్తువులు, విలాసవంతమైన కార్లకు కూడా గిరాకీ పెరిగింది. వీటన్నింటి మీద వస్తు సేవల రేటు తక్కువగా వుంటుంది.

ఈ విధంగా 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణతో నల్ల కుబేరుల వద్ద వున్న నల్లధనం బ్యాంకుల ద్వారా తెల్లధనం అయింది. గుత్త పెట్టుబడుల ఆధిపత్యంలో వుండే బంగారు, వజ్రాల ఆభరణాలు, లగ్జరీ విల్లాలు, సూపర్ లగ్జరీ వస్తువులు, లగ్జరీ కార్లకు గిరాకీ పెరిగింది. ఇదే నోట్ల ఉపసంహరణ లక్ష్యం. అంతేకాకుండా నల్లధనం పోగైన వెంటనే నల్ల కుబేరులు హవాలా ద్వారా ఆ డబ్బులు విదేశాలకు తరలిస్తారు. ఇప్పుడా అవసరమే లేదు. నోట్ల ఉపసంహరణ పేరుతో నల్లధనాన్ని మన బ్యాంకుల ద్వారా తెల్లధనంగా మారుస్తున్నారు.

నగదు లావాదేవీలతో ముడిపడి వున్న వ్యవసాయ రంగం, అసంఘటిత రంగం, చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి పనులు మరింత సంక్షోభంలో పడే ప్రమాదం వున్నది. ఇప్పటికే దుర్భరమైన పరిస్థితులలో బతుకుతున్న మెజారిటీ ప్రజలకు సంపాదన పనులు లభించక, సంపాదనను కోల్పోయి జీవితాలు మరింత సంక్లిష్టంగా మారతాయి. గుత్తపెట్టుబడుల ప్రయోజనం దృష్ట్యా దూకుడుగా నయా ఉదార విధానాలను అమలు చేస్తున్న మన ప్రభుత్వానికి మెజారిటీ ప్రజల జీవన విధ్వంసం పట్టనిదే అయింది.

## నల్లధనం మనదేశంలో ఏ స్థాయిలో వున్నది?

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ మనుగడ, నల్ల ఆర్థిక వ్యవస్థతో బలంగా ముడిపడి వుంటుంది. వర్ధమాన దేశాల్లో అది మరింత తీవ్రంగా ఉంటుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ అంచనాల ప్రకారం మనదేశంలో గత దశాబ్దిలోనే ఆర్థిక వ్యవస్థలో నల్ల ఆర్థికవ్యవస్థ వాటా 75 శాతం. రాజకీయాలు – వాణిజ్యం – నేరాలు మధ్య సంబంధాలు గ్లోబలైజేషన్ తర్వాత బలోపేత మైనాయి. దానితో నల్ల ఆర్థిక వ్యవస్థ విస్తరణ వేగవంతమైంది. పన్ను ఎగవేతకే పరిమితమై నప్పటికీ సంపన్న వర్గం, బలమైన కార్పొరేట్ శక్తులు ప్రధానమైన ఎగవేతదారులు. శక్తివంతమైన రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, కార్పొరేటు శక్తులు, వాణిజ్య దిగ్గజాలతో నల్ల ఆర్థిక వ్యవస్థతోపాటు నేర వ్యవస్థ బలంగా ముడిపడి ఉంటుందన్న వాస్తవం అందరికీ తెలిసిందే. విదేశీ లావాదేవీలలో 'ఇచ్చిపుచ్చుకోవటాలు' భారీ స్థాయిలో వుంటాయి. ఇక దేశీయ ప్రాజెక్టులలో 40-60 శాతం లంచాలే వుంటాయని చాలా సంస్థలు అంచనాలు వేశాయి. దీనికి తోడు చట్టబద్ధమైన అవినీతి భారీ స్థాయిలో కొనసాగుతూ వున్నది. బడా కార్పొరేట్ శక్తులకు బ్రహ్మాండమైన స్థాయిలో రుణాల మంజూరు, భూములను చౌకగా ఇవ్వటం, పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు, భారీ స్థాయిలో వేలకోట్ల రుణాలను రద్దు చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను, విలువైన ఖనిజాలను చౌకగా విక్రయించడంతో ముడిపడి వున్న 'ఇచ్చిపుచ్చుకోవటాలు' భారీ ఎత్తున కొనసాగుతూనే వుంటాయి.

ఇక మాదక ద్రవ్యాలు, అమ్మాయిల శరీరాలతో వ్యాపారం, స్మగ్లింగ్, బెట్టింగులు, లిక్కర్ వ్యాపారాలు, మాఫియా, స్కామ్‌లు, గ్యాంబ్లింగ్ మొదలైన చట్ట వ్యతిరేక నల్ల మార్కెట్/ ఆర్థిక వ్యవస్థ రోజురోజుకీ బలోపేతం అవుతూనే వున్నది. మెజారిటీ ప్రజలను నేరమయ ప్రపంచంలో బందీలను చేస్తూనే వున్నది.

నల్లధనం ఎక్కువ స్థాయిలో వున్న దేశాల్లో భారతదేశం ర్యాంకు 8 అని గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ నివేదిక చెబుతున్నది. స్విస్ బ్యాంకు నివేదిక ప్రకారం 87 లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని మనవాళ్లు దాచుకున్నారు. అయితే సుప్రీంకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (SIT) ప్రకారం మన నల్లధనం స్విస్ బ్యాంకుకే పరిమితం కాదు. మార్చి 2018 నాటికి స్విస్ బ్యాంకు, ఇతర విదేశీ బ్యాంకులలో మన దేశ నల్లధనం 300 లక్షల కోట్ల రూపాయలు వుంటుందని అంచనా. 2017లో HSBC లీక్స్‌లో బయటపడ్డ వ్యక్తుల మీద కానీ, 2016లో పనామా లీక్స్‌లో బయటపడ్డ 500 మంది మనవాళ్ళ మీద కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు. విదేశాలకు తరలించిన మన నల్లధనం, టాక్స్ హావెన్ దేశాల ద్వారా విదేశీ పెట్టుబడిగా మనదేశంలోకి ప్రవేశిస్తుంది. పన్నురాయితీలు, ప్రోత్సాహకాలు, భూమిని చౌకగా లీజుకు పొందుతుంది. స్టాక్ మార్కెట్‌ను ఆక్రమిస్తుంది. ఇట్లా నల్ల ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ బలపడుతున్నది. నల్లధనం పరిమాణం తీవ్రం అవుతూనే వున్నది. దీనికి మద్దతుగా ప్రస్తుత 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ వల్ల నల్లధనం తెల్లధనంగా మన బ్యాంకుల ద్వారానే సునాయాసంగా మారటానికి అవకాశం ఏర్పడింది. దీనివల్ల నల్ల కుబేరులు బలోపేతం అవుతారు.

## నల్లధనాన్ని తెల్లధనంగా మార్చడం వల్ల ఏం జరుగుతుంది?

నల్ల కుబేరుల వద్ద వున్న నల్లధనం తెల్లధనంగా మారినప్పుడు ఇంకా ఎక్కువ స్థాయిలో నల్లధనాన్ని సృష్టించడానికి కావలసిన పునాది విస్తరిస్తుంది. గుత్త పెట్టుబడుల దోపిడీకి నల్లధనం తోడై సంపన్నుల సంపద తీవ్రంగా పెరుగుతుంది. ఆర్థిక అసమానతలు తీవ్ర మవుతాయి. అర్థశాస్త్ర పరిభాషలో ఈ కార్యకలాపాల ఉపాంత వినియోగ ప్రవృత్తి అధికంగా వుంటుంది. గుణక ప్రభావం తీవ్రంగా వుండి, నల్లధనం త్వరత్వరగా శిఖర స్థాయికి చేరుకుంటుంది. డబ్బులు త్వరత్వరగా సంపాదించుకొనే మాదక ద్రవ్యాలు, వ్యభిచారం, గ్యాంబ్లింగ్, స్మగ్లింగ్, బెట్టింగులు, లాటరీలు, లిక్కర్ వ్యాపారం విశృంఖలంగా వృద్ధి చెందుతాయి. మనిషి బలహీనతలను రెచ్చగొట్టే వ్యాపారం జోరుగా సాగుతుంది.

ఈ వ్యాపారంలో క్రింది స్థాయిలో పీడిత వర్గానికి చెందిన యువతనే ఉంటారు. నేరాలు చేస్తూ పట్టుబడి అరెస్టు అవుతారు. డబ్బు పెట్టుబడిగా మారకుండా త్వరత్వరగా డబ్బు సంపాదించే అనుత్పాదక కార్యకలాపాలకు మళ్ళించడం వల్ల శ్రామిక వర్గానికి ఉపాధులు దొరకవు. సంపాదన ఉండదు. వాస్తవ పరిస్థితులు ఒకవైపు, చట్టం మరొకవైపు శ్రామికుల బేరమాడే శక్తిని బలహీనం చేస్తాయి.

నేరమయ ప్రపంచంలో బందీలైన పీడిత వర్గానికి చెందిన యువతకు శ్రామిక వర్గ చైతన్యం అసలే ఉండదు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ కొనసాగడానికి నల్లధనం, నల్ల ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం తప్పనిసరి. అందువల్లనే గుత్త పెట్టుబడుల ప్రయోజనమే లక్ష్యంగా అమలవుతున్న నయా ఉదార విధానాలు, అందులో భాగంగా ప్రస్తుత 2000 రూ॥ల నోట్ల ఉపసంహరణ నల్లధనాన్ని వృద్ధి చేసే దిశగా పనిచేస్తాయి. నల్లధనం మీద దాడి అంటూ ఆర్భాటంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు కూడా నల్లధనాన్ని బాగా పెంచిందని ఇప్పటికే రుజువయింది.

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నిర్మాణాలను నిర్మూలించినప్పుడే నల్లధనం, నల్ల ఆర్థిక వ్యవస్థ అంతమవుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక వర్గ చైతన్యాన్ని బలోపేతం చేయటం అవసరం. దోపిడీ వ్యవస్థను అంతమొందించడం అంత సులభం కాదు కానీ సంఘటిత పోరాటాల ద్వారా ఇది సాధ్యమే. ✱

# నిండా సంక్షోభంలో సామ్రాజ్యవాద వ్యవసాయ-ఆహార, రసాయన కార్పొరేషన్లు

## సంక్షోభంనుండి బయటపడేందుకే 'ఆహార భద్రత' గురించి గావుకేకలు

**వేగంగా** దూసుకెళ్తోన్న, నిలకడగా కొనసాగుతూవున్న ద్రవ్యోల్బణంతో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మరోసారి తీవ్ర సంక్షోభంలోకి అడుగిడింది. ఈ సంక్షోభాన్నుండి బయటపడేందుకు పెట్టుబడిదారీ విధానానికి నిలకడైన పెరుగుదల, మార్కెట్ల విస్తరణ, తగినంత గిరాకీలు అవసరమయ్యాయి. దీనికి కార్యరూపమివ్వటానికి అంతర్జాతీయ సామ్రాజ్యవాద పెట్టుబడి-రాజకీయ, చట్టపరమైన క్షేత్రస్థాయి కృషిని సాగిస్తోంది.

ఉక్రెయిన్-రష్యా విబేధాల సందర్భాన్ని అవకాశంగా తీసుకొని అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారీ ప్రతినిధులు, వారి ఏజెంట్లు ప్రపంచస్థాయి 'వ్యవసాయ-ఆహార భద్రత' 'ప్రపంచ స్థాయిలో ఆహార భద్రత' మొదలైన అంశాల గురించి పదేపదే మాట్లాడుతున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగానే ప్రపంచ ఆహార భద్రత సమస్య గణనీయంగా పెరుగుతోందని ప్రపంచాన్ని తప్పుడు పద్ధతుల్లో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

పశ్చిమదేశాల సామ్రాజ్యవాద వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లు, తాము వ్యవసాయ ఉత్పాదకతను పెంచబోతున్నామని, తద్వారా ప్రపంచ ఆకలి సమస్యను అధిగమిస్తామని ప్రచారం చేసుకుంటున్నాయి. బ్లాక్ రాక్ వంటి అతిపెద్ద ఆస్థుల నిర్వహణా సంస్థ ప్రపంచంలో అందరికీ ఆహారం అందాలంటే 'ప్రపంచానికి ఆహారాన్ని అందించటం' 'అమోఘ సాంకేతికత' వంటి ఆలోచనలను ముందుకు తెస్తోంది. బిల్‌గేట్స్ కూడా న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ప్రపంచ వ్యవసాయం, ఆహార అభద్రత, భూమిపై నివశించే సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే సమస్యను సరిగా గుర్తించకపోవటం వంటి సమస్యలపై వ్యాఖ్యానించాడు. తాను లేవనెత్తిన సమస్యలుగా పేర్కొనబడిన వాటి పరిష్కారానికి కొన్ని నిర్దిష్ట మార్గాలను సూచించాడు.

ఆహార ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం వంటి ఆహార అభద్రత గురించి పైన పేర్కొనబడిన ఉద్బోధనలన్నీ-సామ్రాజ్యవాదుల అధునాతన వ్యవసాయ-సాంకేతిక/వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లు, 'ప్రపంచానికి ఆహారాన్నందించటానికి అవసరమైన' తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు తగిన గిరాకీని సృష్టించుకొని, తమ మార్కెట్లను విస్తరించి, సూపర్ లాభాలార్జించేందుకోసమే!

ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను ఆవరించిన ఆర్థిక సంక్షోభంతోపాటుగా, ఉక్రెయిన్-రష్యాల నడుమ కొనసాగుతున్న యుద్ధం కూడా అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి అసౌకర్యం కలిగిస్తోంది. ఇది పశ్చిమదేశాల వ్యవసాయ వాణిజ్య ప్రయోజనాలకు గణనీయమైన నష్టాన్ని కలుగజేసింది. ఇటీవల కొంతకాలంగా ఉక్రెయిన్ వ్యవసాయరంగాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని పశ్చిమదేశాల వ్యవసాయ-వాణిజ్య కంపెనీలు ఆతృతగా వున్నాయి. 1990ల మధ్యకాలంనుండి అమెరికా-ఉక్రెయిన్ వాణిజ్యమండలి, ఉక్రెయిన్ వ్యవసాయరంగంపై విదేశీ అదుపును ప్రోత్సహిస్తూ వస్తోంది. యూరప్‌లోని మొత్తం సాగుకు అనుకూలమైన భూమిలలో మూడవ వంతును ఉక్రెయిన్ కలిగి వుంది. 2013 నవంబర్‌లో ఉక్రెయిన్ వ్యవసాయ సమాఖ్య చట్టపరమైన సవరణ ముసాయిదా రూపొందించింది. ఇది ప్రపంచ వ్యవసాయ-వాణిజ్య ఉత్పత్తులకు ప్రయోజనం కల్గించే జన్యుమార్పిడి విత్తనాల విస్తృత వినియోగానికి అనుమతినిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణకు ముందు కూడా ఉక్రెయిన్‌కు 'కోవిడ్ ఉపశమన ప్యాకేజీ' క్రింద అందజేసిన 35 కోట్ల డాలర్ల 'అభివృద్ధి విధాన రుణం' సందర్భంగా విధించిన షరతులలో ఉక్రెయిన్‌లో వ్యవసాయ భూముల అమ్మకానికి సంబంధించిన ప్రమాణాలను ప్రపంచబ్యాంకు జొప్పించింది. వ్యవసాయ భూమి అమ్మకానికి వీలుగా, సమాంతరంగా ఈ భూముల వినియోగానికి 'ముందస్తు చర్య' దీనిలో మిళితమై వుంది.

పశ్చిమ దేశాలు వ్యవసాయ రంగంలో వ్యవసాయ-వాణిజ్యం సురక్షితంగా సాగించడానికి, తమ వాణిజ్యాన్ని వృద్ధిచేసుకొని సూపర్ లాభాలు గడించటానికి వీలుగా రూపొందించినవే ఈ చర్యలూ, షరతులన్నీ! అయితే సామ్రాజ్యవాద వ్యవసాయ-వాణిజ్య, వ్యసాయ-జీవసాంకేతిక దిగ్గజ కార్పొరేషన్ల, ప్రపంచ వ్యవసాయ-ఆహార పరిశ్రమల వ్యాపారాలను, ఉక్రెయిన్-రష్యా సంఘర్షణ గణనీయంగా ఆటంకపరచటం వలన, వారి ప్రయోజనాలు దెబ్బతిన్నాయి.

ఏమైనా, ఈ సామ్రాజ్యవాద వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లు, ద్రవ్య పెట్టుబడి సంస్థలు-విధ్వంసం నుండి, అదేవిధంగా పునర్నిర్మాణంగా చెప్పబడే దానినుండి కూడా లాభాల్ని పొందటానికే ఉద్దేశించబడి వున్నాయి. అందువలనే, వారు 'ప్రపంచానికి ఆహారమందించాలి', 'ఆహార భద్రతను పరిరక్షించాలి', 'ప్రపంచ జనాభాకు సరిపోయే ఆహార అవసరాల కోసం ఆహార ఉత్పత్తిని పెంచాలి' వంటి పదాడంబర నినాదాలిస్తూ, ఎడతెగకుండా వాటిని పదేపదే ప్రస్తావిస్తున్నారు.

ఈ సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి సంస్థలు, వ్యవసాయ-వాణిజ్య, వ్యవసాయ-జీవసాంకేతిక కార్పొరేషన్లు, ఫౌండేషన్లు, ధార్మిక సంస్థల ముసుగులో ఆచరణలో ఏవిధంగా

### ప్రయోగశాలలో మాంసం పంట!

కోడి స్టెమ్ సెల్స్ నుండి ఉత్పత్తి అయ్యే సెల్‌కల్చర్డ్ చికెన్‌కు అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రయోగశాలల్లో చికెన్‌ను కృత్రిమంగా తయారుచేసి, విక్రయించేందుకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డిఏ) అప్‌సైడ్ ఫుడ్స్, గుడ్‌మీట్ అనే రెండు కంపెనీలకు అనుమతినిచ్చింది. భవిష్యత్తులో మేక, గొర్రె స్టెమ్‌సెల్స్ (మూలకణాల)నుండి ఆయా మాంసాలను కూడా 'పండించే' ప్రక్రియ అందుబాటులోకి రానుంది. ఈ విధానంలో మాంసం తయారీని సెల్‌కల్చర్డ్ మీట్ అంటారు. ఈ మాంసం తినడంవల్ల ఎలాంటి దుష్పరిణామాలూ లేవని పరిశోధనల్లో వెల్లడైందని ఆహార కార్పొరేట్ పరిశ్రమలు ప్రచారం చేస్తున్నాయి. 2028 సం॥నికిగానీ మనదేశ రెస్టారెంట్లు, సూపర్‌మార్కెట్లలో ఈ మాంసం అందుబాటులోకి రాదని చెపుతున్నా, సామ్రాజ్యవాద ఆహార కంపెనీలు మనదేశంలోని కోళ్ళ పరిశ్రమను దివాలా తీయించి, తమ అమ్మకాలను త్వరితంగా విస్తరించుకోవడానికే ఆసక్తిగా వున్నాయి. దీనివలన మానవజాతి మరెన్ని విపత్తులనెదుర్కోనుందో?! సామ్రాజ్యవాద కంపెనీల లాభాపేక్షకు అంతముండదు కదా!

వ్యవహరిస్తున్నాయో క్లుప్తంగా ఒక్కసారి పరిశీలిద్దాం.

హెడ్జ్ ఫండ్స్, ప్రైవేట్ షేర్లు, పెన్షన్ నిధులతో సహా వ్యవస్థాగత మదుపుదార్లు ప్రపంచస్థాయిలో వ్యవసాయ భూములపై పెట్టుబడులు పెడుతూ పెద్దస్థాయిలో ముందుకొచ్చిన నూతన ఆస్తిపరవర్గంగా వున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి. 10-15 సం॥ల కాలానికి పరిమితమై మదుపు దార్లకు మంచి ప్రతిఫలం వస్తుందని పెట్టుబడి పెడుతున్నారు. అయితే ఈ ప్రక్రియ తరచుగా దీర్ఘకాలిక సామాజిక, పర్యావరణ విధ్వంసానికి కారణమవుతోంది. వ్యవసాయ భూములను కొనుగోలుచేసి, పారిశ్రామిక ఎగుమతి ఉద్దేశిత వ్యవసాయ నమూనాలతో అక్రమంగా ప్రవేశించి, స్థానికంగా, ప్రాంతీయంగా ఆహార భద్రతలను వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెన్షన్ నిధులు, బడ్జెట్ నిధులు, ధర్మాదాయ నిధులు, అలాగే ప్రభుత్వాలు, బ్యాంకులు, బీమాకంపెనీలు, అధిక నికరాదాయ వ్యక్తుల ద్వారా పోగుపడిన డబ్బును, ప్రైవేట్ షేర్ల నిధులను ప్రపంచ వ్యాపితంగా వ్యవసాయరంగంలోకి జొప్పిస్తున్నారు. వ్యవసాయ భూములను కారుచౌకగా లీజుకు తీసుకోవటానికో లేదా కొనుగోలు చేయటానికో ఈ డబ్బునంతా వినియోగిస్తూ ఆ భూములను అమెరికా తరహాలోని భారీస్థాయి ధాన్యం లేదా సోయాబీన్ వ్యాపార భూసముదాయాల తరహాలో మలుస్తున్నారు.

## బ్లాక్ రాక్:

ఆర్థికవ్యవస్థ నుండి లాభాలార్జిస్తూ పెరిగిన, ప్రపంచంలోనే అతిపెద్ద ఆస్థుల నిర్వహణా సంస్థ ఇది. ఈ సంస్థ వ్యవసాయం, జలవనరులలో అధికంగా పెట్టుబడులు పెడుతోంది. ఇది ప్రాథమికంగా వ్యవస్థాగతమైన, మధ్యంతరమైన, వ్యక్తిగత మదుపుదారులకు సేవలందించే ప్రజాభాగస్వామ్య పెట్టుబడుల నిర్వహణా సంస్థ.

ప్రస్తుతం బ్లాక్‌రాక్ నిర్వహణలో లక్షకోట్ల డాలర్ల ఆస్తులు వుండడంతోపాటుగా, గొప్ప ప్రభావం, పలుకుబడితో చెలామణిలో వుంది. ఒకవైపున బ్లాక్‌రాక్ సంస్థ ఆయుధాల తయారీ కంపెనీలతో 81,350 కోట్ల డాలర్లను పెట్టుబడి పెట్టింది. మరోవైపున బ్లాక్‌రాక్‌కే చెందిన 'గ్లోబల్ అగ్రికల్చర్ సంస్థ' వ్యవసాయ సంబంధిత రసాయన ఉత్పత్తులు, సాధన సామాగ్రి, మౌలిక వసతులతోపాటుగా సరుకులు, ఆహారం , జీవ ఇంధనాలు, అటవీకరణం, వ్యవసాయ విజ్ఞాన శాస్త్రాలు, సాగుకు యోగ్యమైన భూమి మొదలైన అంశాలలో పెట్టుబడులు పెట్టటాన్ని లక్ష్యంగా చేసుకుంది.

బ్లాక్‌రాక్‌కు చెందిన 'గ్లోబల్ కన్స్యూమర్ స్టేపుల్స్ ఎక్స్ఛేంజ్ ఫండ్స్', ప్రపంచంలోని అతిపెద్ద ఆహార పరిశ్రమలలో వాటాలను కలిగివుంది. ఇందులో దాదాపు 75 శాతం నిధులను వ్యవసాయ-ఆహార నిల్వలలో పెట్టుబడి పెట్టింది. నెస్లే, కోకోకోలా, పెప్సికో, వాల్‌మార్ట్, అన్‌హే యూజర్-బుష్ ఇన్‌బేవ్, మోండెలెజ్, డేనాన్, క్రాఫ్ట్ హెయింజ్ మొదలైన దిగ్గజ వ్యవసాయ ఆహార కంపెనీలన్నీ ఈ నిధికి రూపకల్పన చేశాయి.

పామ్‌ఆయిల్ కంపెనీలకు నిధులు అందించే అపఖ్యాతి పాలైన బ్యాంకులలో పెట్టుబడులు పెట్టడంద్వారా బ్లాక్‌రాక్ సంస్థ పరోక్షంగా మానవహక్కుల, పర్యావరణపరమైన తప్పిదాలు చేస్తూనే లాభాలను పిండుకుంటోంది.

బ్లాక్‌రాక్‌కు చెందిన'I షేర్స్‌కోర్ ఎస్ అండ్ పి500 ఇండెక్స్ ఇటిఎఫ్' నిర్వహణలో 15,000 కోట్ల డాలర్ల అంతర్గత ఆస్తులు వున్నాయి. 'ఎస్ అండ్ పి 500 ఇండెక్స్'లో భాగమైన ప్రచార వాణిజ్యంలో అగ్రస్థానాన వున్న అత్యధిక ఆహార, వ్యవసాయ పరిశ్రమలలో బ్లాక్‌రాక్ గణనీయమైన వాటాలను కలిగివుంది.

బ్లాక్‌రాక్‌కు చెందిన సివోడబ్ల్యు ప్రపంచ వ్యవసాయ సూచీ ఇటిఎఫ్ 23 కోట్ల 10 లక్షల డాలర్ల అంతర్గత ఆస్తులు కలిగివుండి విత్తనాలు, రసాయనాలు, ఎరువులు మొదలైన వ్యవసాయ ఉత్పాదకాల పరిశ్రమలపై, వ్యవసాయ యంత్రాల, వ్యవసాయ వాణిజ్య కంపెనీలపై దృష్టి కేంద్రీకరించింది.

బ్లాక్‌రాక్, వ్యాన్‌గార్డ్, స్టేట్ స్ట్రీట్, ఫైడిలిటి, క్యాపిటల్ గ్రూప్ వంటి ఆస్థుల నిర్వహణా దిగ్గజ సంస్థలన్నీ సంయుక్తంగా గణనీయ నిష్పత్తిలో పరిశ్రమలను స్వంతంగా కలిగివుంటూ వ్యవసాయ ఆహార సరఫరా గొలుసులోని వివిధ స్థానాలలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

ప్రస్తుతం ఉనికిలో కొనసాగుతున్న ఆహార, వ్యవసాయ ప్రపంచీకరణ వ్యవస్థ విజయానికి బ్లాక్‌రాక్ భారీగా పెట్టుబడులు పెట్టింది.

ఆరోగ్య రక్షణ విభాగాన్ని ఒక దీర్ఘకాలిక పణంగా బ్లాక్‌రాక్ సంస్థ పరిగణిస్తోంది. ఆరోగ్య క్షీణతే దానికి మంచి వ్యాపారం. అమెరికన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అధ్యయనం- బ్రెజిల్‌లో నివారించదగిన, ముందస్తు మరణాలలో 10శాతం పైగా అత్యంత శుద్ధిచేసిన ఆహారాల (అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్-యుపిఎఫ్) వినియోగపు పెరుగుదలతో ముడిపడి వున్నాయని తెలిపింది.

ఈ నిర్ధారణ బ్రెజిల్‌కు మాత్రమేగాక, అమెరికా, కెనడా, యు.కె., ఆస్ట్రేలియా వంటి దేశాలకు కూడా ప్రాధాన్యత కలిగివుంది. ఈ దేశాలలో మొత్తం వినియోగించుకునే క్యాలరీలలో సగానికిపైగా యుపిఎఫ్‌ల ద్వారా లభిస్తున్నాయి.

వాణిజ్య ఒప్పందాలపై కార్పొరేట్ల ప్రభావం కారణంగా, బహుళజాతి ఆహార పదార్థాల చిల్లర దుకాణాల కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు -ప్రపంచ నలుమూలలా మార్కెట్లు నెల కొల్పేందుకు ప్రభుత్వాలు, ప్రపంచవాణిజ్య సంస్థ కృషిచేస్తూ, యుపిఎఫ్‌ల (అత్యంత శుద్ధి చేసిన ఆహార పదార్థాల) అమ్మకాలను ముందుకు నెడుతున్నాయి. మెక్సికోలో ప్రపంచ వ్యవసాయ -ఆహార కంపెనీలు ఆహార పంపిణీ గొలుసును తమ చేజిక్కించుకొని, స్థానిక ఆహార పదార్థాల స్థానంలో శుద్ధిచేసిన చౌకబారు వస్తువులను తెచ్చి పెడుతున్నాయి. యూరప్‌లో, యూరోపియన్ యూనియన్‌ల జనాభాలో సగానికిపైగా ప్రజలు అధికబరువు, ఊబకాయం కలిగివున్నారు. ప్రత్యేకించి పేదలు తక్కువ పోషక విలువలు, ఎక్కువ క్యాలరీలు కలిగిన ఆహార పదార్థాలపై ఆధారపడి వున్నారు. ఈ కారణంగానే బ్లాక్‌రాక్ ఆరోగ్య రక్షణ, బడా ఔషధ రంగాలలో భారీగా పెట్టుబడులు పెట్టి, దానినుండి కూడా లాభాలార్జించాలని భావిస్తోంది.

కేవలం వ్యవసాయ-ఆహార రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టటంద్వారానే బ్లాక్‌రాక్ సూపర్ లాభాలు ఆర్జించింది. అదే సమయంలో ఆయా ప్రాంతాల స్థానిక వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలను నాశనం చేయటం, ప్రపంచ వ్యాపితంగా రైతాంగాన్ని పేదరికంలో ముంచెత్తటం, గ్రామీణ జనసమూహాలను, వారి సంస్కృతిని ధ్వంసం చేయటం, నాసిరకపు ఆహారం, అనారోగ్యం, తక్కువ వైవిధ్యంగల ఆహారాలు, పర్యావరణ వినాశనం, స్వతంత్ర ఉత్పత్తులు కార్మికవర్గీకరణ కావటానికి నిస్సందేహంగా బ్లాక్‌రాక్ బాధ్యత వహించాలి.

బ్లాక్‌రాక్, దాని కౌంటర్ పార్ట్ అయిన వ్యాన్‌గార్డ్‌లు ప్రభుత్వాలపైన, యూరోపియన్ సెంట్రల్‌బ్యాంక్, యుఎస్ ఫెడరల్ రిజర్వ్ వంటి ప్రధాన వ్యవస్థలపైన అదుపు కలిగి వున్నాయి.

బ్లాక్‌రాక్‌కు చెందిన ల్యారీఫింక్ ప్రపంచ ఆర్థిక వేదికలోను; చాలా పరపతి గల, శక్తివంతమైన విదేశీ సంబంధాల మండలి సమావేశంలోనూ వుంటూ, తరచూ అమెరికా యొక్క షాడో ప్రభుత్వంలాగా వ్యవహరిస్తూ వుంటాడు.

1988 నుండి ఫెడరల్ రిజర్వ్‌ను, గోల్డ్‌మాన్ సాష్‌తో సహా అత్యధిక వాల్‌స్ట్రీట్ బ్యాంకులను, ప్రపంచ ఆర్థికవేదిక గ్రేట్ రీసెటన్‌ను, ప్రస్తుతం జోబైడెన్ పాలనా యంత్రాంగాన్ని కూడా

వాస్తవిక అర్థంలో అదుపుజేసే స్థితికి బ్లాక్‌రాక్ చేరుకుంది. బ్లాక్‌రాక్‌కు చెందిన ఉన్నతస్థాయి మాజీ వ్యక్తులు, ఈనాడు బైడెన్ పాలనా యంత్రాంగంలో ఆర్థిక విధానాన్ని నడిపే కీలక ప్రభుత్వ స్థానాల్లో వున్నారు.

అందువలనే, 'గొప్ప పునఃస్థాపితం' (గ్రేట్ రీసెట్) ప్రపంచస్థాయి 'హరిత' ఎజెండాను ముందుకు తెస్తూ, భవిష్య ఆహార ప్రశంసలపై గానంచేస్తూ మొక్కకు కావలసిన ఎరువును అందులోనే తయారు చేసుకునే విధంగా రూపొందించిన 'కోడెడ్' విత్తనాలపై ఊదరగొట్టే తప్పుడు వాగ్దానాలతో బ్లాక్‌రాక్ ముందుకు సాగుతోంది. పెట్టుబడి పోగుబడేందుకు హామీనిస్తూ మార్కెట్లను విస్తరించుకోవటం చేస్తుంది. లేదా నూతన మార్కెట్‌లను సృష్టించుకుంటూ సాధారణ లాభశాతాల ధోరణిలో కాకుండా మరింత లాభాలు పెంచుకుంటూ, దానిని తిరిగి పెట్టుబడులుగా పోగేసుకుని, మరింత లాభాలార్జించనుంది.

## బిల్‌గేట్స్ మరియు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్

గొప్ప ధార్మిక స్వభావం కలవాడుగా పేరెన్నికగన్న, ప్రపంచంలోనే అత్యంత సంపన్నులలో ఒకడైన బిల్‌గేట్స్ కూడా ఇటీవలి న్యూయార్క్ టైమ్స్ పత్రికలోను, అసోసియేటెడ్ ప్రెస్‌కు రాసిన ఓ వ్యాసంలోనూ ప్రపంచ వ్యవసాయ పరిస్థితిపైన, ఆహారభద్రతపైన వ్యాఖ్యానం చేశాడు. భూమిపై నివసించే ప్రజానీకానికంతటికీ సరిపోయే ఆహారధాన్యాలను ప్రపంచ దేశాలు ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్నాయని ఆమోదిస్తున్నప్పటికీ, తక్కువ ఉత్పాదకతతో పోలుస్తూ సమస్యకు పరిష్కారాన్ని ప్రాథమికంగా తప్పుగా నిర్ధారణ చేయటానికే పూనుకున్నాడు. వాస్తవానికి ఈనాడు ఉత్పత్తిని పెంచవలసిన అవసరంలేదు. అయితే ప్రపంచ ప్రజానీకాని కందరికీ ఆహారం అందేందుకు మరింత న్యాయమైన పూచీయొక్క తక్షణ ఆవశ్యకత అయితే వుంది.

బిల్‌గేట్స్ స్థాపించిన బిల్‌గేట్స్ మరియు మెలిండా ఫౌండేషన్ ఒక ధార్మిక సంస్థకాదు. 'అలయెన్స్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఇన్ ఆఫ్రికా' (ఏజిఆర్ఏ-'ఆగ్రా') పేరుతో నిధులు కేటాయిస్తూ ఇది-అనేక ప్రాంతాల్లో సంస్థలను ఏర్పరుస్తోంది. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా పండించి, వినియోగించుకునే పోషక విలువలు కలిగిన జొన్న వంటి పంటలకు బదులుగా ఎంతో వ్యత్యాసంతో మొక్కజొన్న, వరి వంటి పంటలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. ఈ 'ఆగ్రా' ద్వారా 'విత్తన నిరోధక చట్టాన్ని' ముందుకు తెచ్చారు. ఈ చట్టం నూతన వంగడాల అభివృద్ధిని సుసంపన్నమైన, వనరులు కలిగిన ప్రయోగశాలలకు, కంపెనీలకు కట్టబెట్టింది. విత్తనాల అభివృద్ధి, వాని మార్కెట్లను ప్రైవేటు సంస్థలకు సమర్పించటంతోపాటు, గుత్తసంస్థలు సంఘటితంకావటానికి కూడా తోడ్పడింది. ముఖ్యంగా ఆకలి సమస్యను సృష్టించటంలో వాస్తవానికి బిల్‌గేట్స్ ఫౌండేషన్ కూడా భాగస్వామి అనేది నిజం.

ప్రపంచ ఆహార భద్రతా పరిరక్షణగా చెప్పబడే దానికోసం, ఆహార ఉత్పత్తి పెంపుదల కోసం బిల్‌గేట్స్ నాలుగు పరిష్కార మార్గాల్ని సూచిస్తున్నాడు: 1. 'ఎరువుల కొరకు అరువు' అవసరానికి, చౌక ఎరువుద్వారా వ్యవసాయ ఉత్పాదకతకు హామీఇవ్వటం. 2. ఆకలి సమస్యను ఎదుర్కొనేందుకు 20వ శతాబ్ది మధ్యకాలంనాటి హరిత విప్లవ ఆలోచనను తిరిగి తెచ్చుకోవటం. 3. 'మెరుగైన' విత్తనాల ఆలోచనను తీసుకొని తరచుగా బడా కార్పొరేషన్లు విత్తనాలను ఉత్పత్తిచేయటం. 4. అర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధిచేయటం.

పైన పేర్కొన్న సూచనలన్నీ వ్యవసాయ-ఆహార వ్యాపారం, వ్యవసాయ-వాణిజ్యం, వ్యవసాయ-జీవసాంకేతిక వాణిజ్యాల ద్వారా ప్రపంచస్థాయి సామ్రాజ్యవాద వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లతోపాటు సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థల, ద్రవ్య నిర్వహణా సంస్థల పెట్టుబడులతోనున్న దిగ్గజ కార్పొరేషన్లు మరింత లాభాలార్జించటానికి ఉద్దేశించినవేననేది స్పష్టం.

మొత్తంమీద కృత్రిమ ఎరువుల తయారీ కర్బన ఉద్గారాలకు తోడ్పడటంతోపాటు నైట్రెడ్ ఆక్సైడ్ ఉద్గారాలకు ప్రాథమిక ఆధార వనరుగా వున్నది. నైట్రోజన్ ఎరువుల తయారీకి ప్రపంచంలో లభ్యమయ్యే వాయువులో 3.5 శాతం అవసరమౌతుంది. ఇది - అస్థిరమైన అంతర్జాతీయ మార్కెట్‌లపై ఆధారపడేవిధంగా దిగుమతి చేసుకునే దేశాలను, రైతులను నెడుతుంది. ప్రపంచవ్యాపితంగా ఆహార ధరల పెరుగుదలకు ఒక ప్రధాన కారణమౌతుంది. విషపూరితమైన, ప్రమాదకరమైన కృత్రిమ ఎరువులతో పురోగమనం సాధ్యంకాదు. అయినప్పటికీ, ఆకలి సమస్య పరిష్కారానికి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచటానికి బిల్‌గేట్స్ ఈ మార్గాన్నే సూచిస్తున్నాడు.

అమెరికన్ సామ్రాజ్యవాదులు భారతదేశం పైన, ఇతర అభివృద్ధిచెందుతున్న దేశాలపైన రుద్దుతున్న హరితవిప్లవ దోపిడీ స్వభావాన్ని 1970లలోనే తన ప్రసిద్ధ కోర్టు ప్రకటన ద్వారా కా॥తరిమెల నాగిరెడ్డి స్పష్టంగా వెల్లడిచేయటమే గాక, దాని దుష్ఫలితాలను గురించి కూడా హెచ్చరించారు. ప్రపంచంలో ఆకలిగొన్న ప్రజల సంఖ్యను తగ్గించటానికిగానీ లేదా అందరికీ న్యాయబద్ధంగా, తగినంత ఆహారం అందించ టానికిగానీ, హరితవిప్లవం ఒరగబెట్టిందేమీలేదు. కాకపోగా, మరిన్ని సమస్యలను-దీర్ఘకాలంలో భూసార క్షీణత వంటి పర్యావరణ సమస్యల నుండి అసమానతలు, రుణగ్రస్తత (మనదేశంలో రైతాంగ ఆత్మహత్యలు అనంతంగా సాగటానికి ప్రధాన కారణమిదే) తీవ్రమవటం వంటి సామాజికార్థిక సమస్యల వరకు-హరిత విప్లవం సృష్టించింది. హరిత విప్లవం-విత్తన, వ్యవసాయ-రసాయన దిగ్గజ కంపెనీలు ప్రపంచ వ్యవసాయంలో పాదుకొనేందుకు, వారి యాజమాన్యంలోని ప్రపంచ వ్యాపిత గొలుసు వ్యవస్థలపై ఆధారపడేవారిగా రైతాంగాన్ని మలిచేందుకు తోడ్పడింది. అయినా, ఇప్పటికీ 'హరిత విప్లవ' నకలునే అమలుచేయాలని బిల్‌గేట్స్ సూచిస్తున్నాడు.

వాతావరణ పరిస్థితులకు తట్టుకోగలిగే విత్తనాలు ఇప్పటికే ఉనికిలో వుండటమేగాక, రైతాంగం వీటిని అభివృద్ధిచేసి లాంఛనప్రాయ విత్తన మార్కెట్ల ద్వారా వ్యాపారం సాగిస్తున్నారు. అయితే, ఈ రకమైన పద్ధతులను, పరిస్థితులను ప్రోత్సహించటానికి బదులుగా, 'మెరుగైన విత్తనాలు'గా చెప్పబడే ఆలోచనను బిల్‌గేట్స్ సూచిస్తున్నాడు. తద్వారా 'మెరుగైన విత్తనాలు', 'సాంకేతికత' పేరుతో దిగ్గజ జన్యుమార్పిడి విత్తన కార్పొరేషన్లను, ప్రపంచవ్యాపిత విత్తన వ్యాపారంలో వారి లూటీని ప్రోత్సహిస్తున్నాడు.

జీవ సంబంధ ఎరువులు, జీవసంబంధ పురుగుమందుల తయారీ సదుపాయాల నుండి వ్యవసాయ-పర్యావరణ రైతుశిక్షణా కార్యక్రమాల వరకు; నూతన భూ-యాజమాన్య ప్రయోగం, నీటి వినియోగ మెళకువలు, తక్కువ ఉత్పాదకాలతో వ్యవసాయ విధానాలు, చీడపీడలను నిరోధించే మొక్కల రకాలను వ్యాప్తి చేయటం వరకు-వాస్తవికంగా ఆహారోత్పత్తిని పెంపుజేసి, ఆహార భద్రతను కల్పించగల, ప్రస్తుతం కొనసాగుతున్న అనేక ప్రతిపాదనలు, పథకాలు మనముందున్నాయి. కానీ, ఈ ప్రయత్నాలను ప్రోత్సహించటానికి బదులుగా, వీటిని బిల్‌గేట్స్ ఎగతాళిచేస్తూ, జన్యుమార్పిడి సాంకేతికత, నూతనంగా పెరుగుతున్న సాంకేతికతలు, డిజిటల్ వ్యవసాయం వంటి వాటిని తన ప్రాధామ్యాలుగా ముందుంచు తున్నాడు. వాస్తవానికి ఇవేవీ హామీ ఇచ్చిన విధంగా ఆకలిగొన్న వారి సంఖ్యను తగ్గించేందుకో, ఆహారాన్ని అభివృద్ధిచేసేందుకో తోడ్పడేవి కాదు.

## వ్యవసాయ-జీవసాంకేతిక రంగం, వ్యవసాయ కంపెనీలు-గుత్తాధిపత్యం

ఈనాడు మనం ఆహార ధరలన్నీ పెరిగి పోవటాన్ని గమనిస్తున్నాం. ఆర్థిక నిధుల సంస్థలు, మదుపు బ్యాంకులతో పాటుగా ప్రపంచస్థాయి ధాన్య వ్యాపార బహుళజాతి కంపెనీలైన కార్గిల్, లూయిస్, డ్రేఫస్, ఏడిఎమ్, బంగీ వంటివన్నీ ఆహార సంక్షోభాన్ని సృష్టించి, దానినుండి వారు లాభాలు గడిస్తున్నారు.

బేయర్, సింజెంటా(కెమ్‌షినా), కోర్టెవా వంటి వ్యవసాయ కంపెనీలు తమ ఎజెండాను ముందుకు తేవటానికి ప్రస్తుత పరిస్థితులను అవకాశంగా తీసుకొని, అనియంత్రిత, అసంపూర్ణ ప్రయోగాలు మాత్రమే నిర్వహించిన జన్యుమార్పిడి సాంకేతికతలను(జి.ఇ.) వ్యాపారీ కరించుకుంటున్నాయి. తమ వ్యవసాయ రసాయనాలతోపాటు సంకరజాతి విత్తనాలు, జి.ఇ.విత్తనాలు-పెరుగుతున్న ప్రపంచజనాభా ఆహార అవసరాన్ని అందుకోవటానికి అత్యావశ్యక మనే అబద్ధపు కథనాలతో, ఈ కంపెనీలు తమ వ్యాపారాలను పెంచుకుంటున్నాయి. స్వార్థపర శక్తులు, వృత్తిశాస్త్రవేత్తలు, లాబీగ్రూపులు, అనేకమంది రాజకీయ నాయకులు, జర్నలిస్టులు -ఈ ఎజెండాకు రూపకల్పన చేశారు. గేట్స్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న 'కార్నెల్ అలయెన్స్ ఫర్ సైన్స్'కు చెందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైకేల్ హడ్సన్ వంటివారు, నిరాధారమైన, అర్థరహితమైన ప్రకటనలతో జన్యుమార్పిడి విత్తనాలకు, రసాయనాలకు అనుకూలంగా వాదిస్తున్నాడు. యాజమాన్య ఉత్పత్తులు లేకుండా వుంటేనే వాస్తవికమైన, నిజాయితీతో కూడిన ఆహార భద్రత, ఆహార సార్వభౌమత్వం సాధించబడతాయని గుర్తించ టానికి వారు నిరాకరిస్తున్నారు. ఆహార అభద్రతకు సంబంధించిన వాస్తవిక స్థితిని, సామ్రాజ్యవాద వ్యవసాయ-జీవసాంకేతిక పరిశ్రమల ఎజెండాకు సేవజేయటానికి కనుగుణంగా మలిచారు. ప్రజాప్రయోజనాలు పరిరక్షించేందుకోసమంటూ ఏర్పాటు చేయబడిన నియంత్రణా విభాగాలు, వ్యవస్థలు, తీవ్రమైన వత్తిడికి లోనవటమో లేదా వారికి లోబడటమో జరిగే స్థితిలో వుంచారు.

బేయర్, కార్టెవా వంటి బడా జీవసాంకేతిక కార్పొరేషన్లు ప్రపంచ విత్తన వాణిజ్యంలో ఇప్పటికే 40శాతం పైగా అదుపు కలిగి వుండటంతోపాటు, తమ ఆధిపత్యాన్ని స్థిరీకరించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఒక నూతన తరహా జన్యుమార్పిడి జీవరాశిని (జీఎంఓ) అభివృద్ధిచేయటం, విస్తృతంగా మొక్కలపై హక్కులను స్వంతం చేసుకోవటంల ద్వారా ఈ కంపెనీలు ఆహారం, వ్యవసాయాల భవితవ్యంపై తమ అదుపును పెంచుకోవటానికి చూస్తున్నాయి. సహజసిద్ధంగా సంక్రమించే మొక్కల జన్యుపరమైన సమాచారంతో హక్కులను స్వంతం చేసుకునే వైపుగా ఇవి సాగుతున్నాయి. మొక్కలు వాటివాటి జన్యుపరమైన ప్రత్యేకతలను కలిగివుండటాన్ని తమ 'ఆవిష్కరణ'గా వారు ప్రకటిస్తున్నారు. మొక్కలపై ప్రకటిస్తున్న వీరి పేటెంట్ హక్కులు, రైతులను విత్తనాల తయారీ నుండి నిరోధిస్తుంది. నూతన మొక్కల పెంపకం నుండి ఇది సాగుదార్లను ఆటంకపరచటంతో పాటుగా రైతులు ముందస్తుగా తమ అనుమతి పొందాలని, బయో సాంకేతిక కంపెనీలకు రుసుము చెల్లించాలని ఆదేశిస్తున్నారు.

నూతన జన్యుమార్పిడి జీవరాశులపై 1,430 పేటెంట్లు (హక్కులు) కావాలని కార్టెవా కంపెనీ దరఖాస్తుచేసుకోగా, 119 పేటెంట్లను బేయర్ కోరుతోంది. వారు రూపకల్పన చేసిన జీఎంఓలను పోలిన, అదే ప్రత్యేక లక్షణాలు కల సహజమైన మొక్కలకు కూడా ఈ పేటెంటు హక్కులు వర్తిస్తాయి. ఈవిధంగా రైతులు, మొక్కల సాగుదార్లనుండి కూడా వారు లాభం గడిస్తారు. ఉదాహరణకు-'క్రిస్పర్' సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఒక కణంలోని జినోమ్‌ను మార్పుచేసే క్రమానికి కార్టెవా పేటెంట్ పొంది, మేధోపరహక్కులను ప్రకటించుకుంటే, అదే తరహా జన్యుసమాచారమున్న ఏ కణాలైనా, విత్తనాలైనా, మొక్కలైనా, అవి బ్రకోలి, జొన్న, సోయా, వరి, గోధుమ, ప్రత్తి, బార్లీ, పొద్దుతిరుగుడు అయినా - వీటన్నిటిపై కార్టెవా కంపెనీకి హక్కులు వర్తిస్తాయి.

భారతదేశ ప్రభుత్వం ప్రపంచ వ్యవసాయ వాణిజ్య సంస్థలతో కుమ్మక్కు అయి ఈ తరహా విత్తనాలు అనవసరం, అవాంఛితం, అరక్షితం అనే పలు అభ్యంతరాలని ప్రక్కనబెట్టి జన్యుమార్పిడి ఆవాలను అనుమతించింది. జన్యుమార్పిడి విత్తనాల నియంత్రణా సంస్థ (జిఇఏసి) ఈ పంట వాణిజ్య సాగుకు అంగీకరించింది.

1990ల మధ్యకాలం దాకా, వాస్తవానికి మనదేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా వున్నప్పటికీ, తదనంతర కాలంలో వంటనూనెలపై దిగుమతి సుంకాలను తగ్గించటంతో, చౌకగా సబ్సిడీలతో కూడిన వంటనూనెల దిగుమతులు మనదేశ మార్కెట్లను ముంచెత్తాయి. దీనితో దేశీయ రైతాంగం పోటీకి తట్టుకోలేకపోయారు. దేశంలో పెంపొందించుకునే అవకాశమున్న వంటనూనెల విభాగాన్ని, ఈ చర్య తీవ్రంగా ప్రభావితంచేసి, నాశనంచేసింది. మరోవైపున పామ్ ఆయిల్ పెంపకందారులైన, అమెరికాకు చెందిన ధాన్య, వ్యవసాయ సరుకుల కంపెనీ కార్గిల్‌యొక్క ప్రయోజనాలకు ఇది బాగా తోడ్పడింది. జన్యుమార్పిడి ఆవాల సాగుతో, ఉత్పత్తి పెరిగి, వంటనూనెల దిగుమతి తగ్గనుందనే వాదనలతో ప్రస్తుతం జన్యుమార్పిడి ఆవాల వాణిజ్య సాగుకు ఆమోదం పొందారు. ఇది మన వంటనూనెల రంగంద్వారా సామ్రాజ్యవాద వ్యవసాయ-జీవసాంకేతిక, వ్యవసాయ-వాణిజ్య దిగ్గజ కార్పొరేషన్లకు మేలు చేకూర్చటంకోసమే.

కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, భారతదేశంలో భారీ పెట్టుబడులు పెట్టే అవకాశాలను అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి కల్పించాయి. సామ్రాజ్యవాద వ్యవసాయ-వాణిజ్య కంపెనీలకు, భారత దేశంలోని సాగుభూములను కబళించేందుకు కాచుకునివున్న ఆస్తుల నిర్వహణాసంస్థలకు లొంగుబాటును ప్రదర్శించినవే ఈ చట్టాలు అనేది నిస్సందేహం. ఈ చట్టాలు భారీస్థాయి జూదతరహా ఆహార దొంగ నిల్వలను ఆహ్వానిస్తున్నాయి.భారతదేశంలోని సాంప్రదాయ వ్యాపార సమాహారాలను, ఆహార అంగళ్ళను, చిన్నరైతులను అణగద్రొక్కి వ్యవసాయ వాణిజ్య కార్పొరేషన్లను భారీగా పెంచివేస్తాయి.

భారీ కార్పొరేట్ సంస్థలు తమ కార్య కాలాపాలను-ఆహార శుద్ధిరంగం, రవాణా, నిల్వ, పంపిణీలలోకి మళ్ళించాయి. భారత పారిశ్రామిక గుత్తసంస్థలలో ప్రధానమైనవన్నీ 2000ల మధ్యకాలం నుండి తాజా ఆహార సరఫరా గొలుసులోకి ప్రవేశించాయి. రిలయన్స్ ఫ్రెష్, ఆదానీ అగ్రిఫ్రెష్, భారతీస్ ఫీల్డ్ ఫ్రెష్ మొదలైనవన్నీ ఈ కోవలోవే.

కేంద్రప్రభుత్వ ఎఫ్‌సిఐకోసం 'ఆదాని అగ్రిలాజిస్టిక్స్' ధాన్యాగారాలను, భారీ గాదెలను నిర్మించి నిర్వహిస్తోంది. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఆహార వ్యాపారంకోసం భారత దేశ వ్యాపితంగా దాదాపు 900 భారీ గిడ్డంగులు ఆదానీ అదుపులో వున్నాయి.

అమెజాన్, వాల్‌మార్ట్ వంటి సామ్రాజ్యవాద దిగ్గజ వాణిజ్య కార్పొరేషన్లు భారతదేశంలో ఆహార వ్యాపారంలో ప్రవేశించి, అనేక మార్గాలలో వినియోగదార్లను ప్రలోభపెడుతున్నాయి. పెప్సీ కంపెనీ ఇప్పటికే మనదేశంలోని బంగాళదుంప పంటపైనా, దానిని శుద్ధిచేసి వివిధ రకాల ఆహార పదార్థాలుగా మార్చే క్రమంపైనా తన అదుపును కలిగివుంది.

ఇప్పుడు ఉన్నత సాంకేతిక వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లు దేశంలోని ➡

# నిర్విరామ ప్రజాఆందోళనాకారుడు, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమనేత
# కామ్రేడ్ కుక్కల ఏసుగార్కి జోహార్లు



**నిర్విరామ** ప్రజాఆందోళనాకారుడు, ఇరు తెలుగు రాష్ట్రాల ఓపిడిఆర్ అధ్యక్షులు కామ్రేడ్ ఏసు (73 సం॥లు) 15-6-2023న విజయవాడలో అనారోగ్యంతో కనుమూశారు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి కామ్రేడ్ ఏసుకు జోహార్లుఅర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియ జేస్తోంది.

ఐదున్నర దశాబ్దాల ఉద్యమ జీవితంలో కా॥ఏసు నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొని వున్నారు. పేద దళితవర్గంలో జన్మించిన కా॥ఏసు, శ్రామికవర్గ ఉద్యమాలలో పాల్గొని, హక్కుల కోసం తోటి శ్రామికులతో కలసి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. కా॥ఏసు పీడిత ప్రజా ఉద్యమనాయకుడు. తొలినాళ్ళలోనే కమ్యూనిస్టు రాజకీయాలవైపు మళ్ళిన కా॥ఏసు, కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అనేక ఒడిదుడుకులు, విభజనల సందర్భంగా కా॥తరిమెల నాగిరెడ్డి రాజకీయ విధానాలవైపు నిలిచారు. కమ్యూనిస్టు ఉద్యమంపై, మార్క్సిస్టు సిద్ధాంతంపై జరిగే దాడులను నిరసిస్తూ, కమ్యూనిస్టు సిద్ధాంత అవగాహనకు కట్టుబడి కడదాకా కృషిచేశారు.

విజయవాడ నగరంలో గిరిపురం, అరుల్ నగర్, క్రీస్తురాజపురం మొదలైన ప్రాంతాలలో గుడిశెవాసుల స్థలాల ఆక్రమణ ఉద్యమానికి కామ్రేడ్స్ కోటయ్య, పూర్ణ, మదార్ తదితరులతో కలిసి మిలిటెంట్‌గా సాగిన పోరాటాల్లో కా॥ఏసు క్రియాశీలకంగా కృషి చేశారు. చెప్పుల తయారీ కంపెనీ కార్మికుల పోరాటం, రైల్వే కార్మికుల ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. దళితుల శ్మశానస్థలంకోసం పట్టు విడవకుండా అందరినీ కలుపుకొని పోరాడి విజయం సాధించారు. హక్కుల ఉద్యమంలో పెడధోరణు లెదుర్కోవటంలో, నిక్కచ్చిగా నిలవటంతోపాటు, దానిని ఐక్యంగా కొనసాగించటానికి తపన చెందారు.

హక్కుల ఉద్యమనేతగా అసంఖ్యాక నిజనిర్ధారణ కమిటీలలో భాగస్వామిగా, నాయకునిగా వ్యవహరించి అనేక వాస్తవాలని వెలుగులోకి తెచ్చారు. ప్రజాఉద్యమ క్రమంలో అనేక కేసులు, నిర్బంధాలను ఎదుర్కొన్నారు.

ప్రజలపట్ల, నమ్మిన సిద్ధాంతంపట్ల, అంకిత భావంతో, ఆచరణయుతంగా కడదాకా సాగిన కా॥ఏసుకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి జోహార్లర్పిస్తోంది.

**విజయవాడ** — **రాష్ట్రకమిటి**
**16-6-23** — **సిపిఐ(ఎం-ఎల్)**

---

→ వ్యవసాయ కార్యకలాపాలన్నింటిని డిజిటలీకరించి, భారీ- సమాచార వ్యాపారాన్ని సృష్టించటానికి పూనుకుంటున్నాయి. మానవ శ్రమ స్థానంలో డ్రోన్లు, సెన్సర్లు, రోబోల ప్రవేశం, డిజిటలీకరణ, స్వయంచాలక యాంత్రీకరణ (ఆటోమేషన్)లకు మార్గాన్ని సుగమంచేస్తున్నాయి. భారతదేశ చిన్న కుటుంబాలలోని సభ్యుల ఆహార సార్వ భౌమత్వం, ఈ విధమైన భారీ, ఉన్నత-సాంకేతిక కంపెనీల ప్రవేశంతో తుడిచిపెట్టబడుతుంది. ఈ వ్యవసాయ ఆహార గొలుసులన్నీ తమ గుత్తశక్తిని సంఘటితం చేసుకుంటున్నాయి. కార్గిల్ వంటి సామ్రాజ్యవాద అంతర్జాతీయ వ్యవసాయ-వాణిజ్య అస్తిత్వాలు, దేశీయంగా వ్యవసాయ-వాణిజ్య కంపెనీలైన ఆదానీ, అంబానీలతో చేతులు కలపటంవంటి నిదర్శనాలు పెరుగుతున్నాయి.

ఈవిధమైన భారీ కార్పొరేషన్ల అపరిమిత శక్తి, చిన్నరైతుల ఆదాయ దుర్బలత్వాన్ని పెంచటంతోపాటు, గ్రామీణ-పట్టణ వినియోగ దారులకు ఆహార అభద్రతను పెంచుతుంది.

బిటి పత్తి విత్తనాల వినియోగం కారణంగా రైతులపై మరింతగా రసాయన పురుగు మందుల, ఎరువుల, అధిక ధరలతోకూడిన విత్తనాల భారాలు మోపబడి, దీర్ఘకాలంలో అధిక ఇబ్బందులు, నష్టాలను భరించలేని స్థితిలో అనేకమంది చిన్నరైతులు కుప్పకూలిపోయి, రుణగ్రస్తులై తమ భూములను కూడా కోల్పోయి ఆత్మహత్యల పాలైన మహారాష్ట్ర, ఏ.పి.లకు చెందిన బిటి పత్తిరైతుల విషాద అనుభవాలు మన ముందున్నాయి.కాగా, అత్యంత కొద్దిమంది విత్తనాల, పురుగుమందుల ఏజెంట్లుగా, వడ్డీ వ్యాపారులుగా, భూకబ్జాదారులుగా ప్రయోజనం పొందగలిగారు.

ఈ నూతన 'అద్భుత సాంకేతికత'తోనూ; ప్రపంచానికి ఆహారాన్ని అందించే పేరిట, ఆహార భద్రతకు సర్వరోగ నివారిణిగా గొప్పగా పేర్కొంటున్న ప్రపంచీకరించిన ఆహార వ్యవస్థ తోనూ-అదేరకమైన పరిణామాలే పునరావృతం అవుతాయి. వ్యవసాయం నుండి రైతాంగం బలవంతంగా గెంటివేయబడతారు. లేదా యాజమాన్య ఉత్పత్తి (ట్రేడ్‌మిల్స్ వలలో చిక్కుకొని కార్పొరేటు సరఫరా గొలుసుకట్టులో, మరింతగా శుద్ధిచేయబడిన ఉత్పత్తులను, ప్రయోగశాలల్లో ఆహార పదార్ధాలను తయారుచేసే జన్యుమార్పిడి విత్తనసంస్థలకు చాకిరీచేసేవారుగా మిగిలి పోతారు.

సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు, మదుపు సంస్థలు, ప్రపంచ వ్యవసాయ-వాణిజ్య, వ్యవసాయ-సాంకేతిక కార్పొరేషన్లు - యావత్ ప్రపంచ వ్యవసాయ రంగాన్ని, ఆహార రంగాన్ని కబళించేందుకు, ప్రపంచ సాగుభూములన్నింటినీ కబ్జాచేసేందుకు, ఆచరణలో ఎలా వ్యవహరిస్తాయనేదానికి ఇదొక రేఖామాత్ర వివరణమాత్రమే.

'ఆహారభద్రత', 'ప్రపంచ ప్రజానీకానికందరికీ ఆహారం' పేరిట ప్రపంచాన్ని దోచుకునేందుకు సామ్రాజ్యవాద సంస్థలు, కార్పొరేషన్లు అనుసరించే మరెన్నో పద్ధతులను, కుటిల విధానాలను ఇంకా అధ్యయనం చేయవలసి వుంది. యావత్ మానవజాతి పాలిట పెనుశాపంగా పరిణమించిన సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసేందుకు; కమ్యూనిస్టు విప్లవకారులు, సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులు తమ కార్యకలాపాల రూపకల్పన, నిర్వహణలకు ఈవిధమైన జ్ఞానం మరింత స్పష్టతను కలిగించి సుసంపన్నం చేస్తుంది.

**(కోలిన్‌టాడ్ హంటర్, సోమ ఎస్.మర్ల, భరత్ దోగ్రా, ప్రీతమ్‌సింగ్‌లు వ్రాసిన వ్యాసాలు, 'అలయెన్స్ ఫర్ ఫుడ్ సావరినిటీ ఇన్ ఆఫ్రికా' నుండి 50 మంది సంతకాలతో బిల్‌గేట్స్‌కు వ్రాసిన బహిరంగలేఖ ఆధారంగా...)** ★

# వ్యవసాయ, గృహవిద్యుత్‌లకు స్మార్ట్‌మీటర్లు-సర్దుబాటు ఛార్జీలు

# రైతులపై, వినియోగదారులపై మోపుతున్న హెచ్చింపు భారాలు

**నిత్యావసర** వస్తువుల ధరలు నానాటికీ పెరిగిపోతూ, పెట్రోల్ - డీజిల్ - వంటగ్యాస్ ధరలు అనూహ్యంగా పెరిగిపోయి, విద్య-వైద్యం అందుబాటులో లేకుండాపోతూ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తరిగిపోతూ నానాటికీ పేద, మధ్యతరగతి జీవితాలు మరింత సంక్షుభితంగా తయారయ్యాయి. వీటన్నిటికి తోడు రాష్ట్రప్రభుత్వం రైతాంగంతో సహా ప్రజానీక మంతటిపై విద్యుత్ ఛార్జీల పెనుభారాలతో విరుచుకుపడుతోంది.

నేటి మానవ మనుగడలో విద్యుత్తుకు ఎంతో ప్రాధాన్యత వుంది. వివిధ రకాల విద్యుత్ ఉపకరణాల తయారీదారులతో కుమ్మక్కైన పాలకులు రోజువారీ జీవనంలో విద్యుత్తు వాడకంయొక్క అవసరాన్ని మరింతగా పెంచు తున్నారు. కీలకంగా మారిన విద్యుదుత్పత్తిని, విద్యుదుత్పత్తికి అవసరమైన ఇంధన వనరులను తమ గుప్పెటలో నుంచుకోవటంద్వారా సామ్రాజ్యవాదులు దేశ ఆర్థిక, సామాజిక రంగాల నడుపులో వుంచాలనే కుటిల పథకం దీనివెనుక వుంది. రెండవది-ఈ వనరులపై గుత్తాధిపత్యం ద్వారా విద్యుత్ గిరాకీని పెంచి సూపర్‌లాభాలు ఆర్జించాలనేది కూడా వారి విధానం.

దీనికనుగుణంగానే సామ్రాజ్యవాదుల పనుపున ప్రపంచబ్యాంకు ఆదేశం మేరకు విద్యుత్ రంగంలో 'సంస్కరణ'లకు 1998 నుండే పూనుకున్నారు. రాష్ట్ర విద్యుత్తు బోర్డును మూడు ముక్కలుచేసి జెన్‌కో, ట్రాన్స్‌కోలలో ఇప్పటికే ప్రైవేటు పెట్టుబడిదారులను, కార్పొరేట్లను చొరబెట్టారు. విద్యుత్ పంపిణీ విభాగాలైన 'డిస్కం'లను కూడా ప్రైవేటుకు అప్పగించటంలో భాగంగా పావులు కదుపుతూ తీవ్ర నష్టాల పాల్జేస్తున్నారు. ప్రస్తుతం మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 56వేల కోట్ల అప్పులో వున్నామని ప్రకటిస్తున్నాయి.

## ప్రమాదకరమైన విద్యుత్ (సవరణ) బిల్లు-2020

విద్యుత్ రంగంపై రాష్ట్రాల అధికారాన్ని కూడా తన చేతుల్లోకి తీసుకున్న కేంద్రప్రభుత్వం, దేశవ్యాపితంగా విద్యుత్తు రంగాన్ని సంపూర్ణంగా ప్రైవేటీకరించేందుకు ఉద్దేశించిన 'విద్యుత్తు (సవరణ)బిల్లు-2020'ని ముందుకు తెచ్చింది. 2020 నవంబర్ నుండి 2021 డిసెంబర్ వరకు ఢిల్లీ సరిహద్దులనే నివాసంగా చేసుకొని మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ రైతాంగం సాగించిన సుదీర్ఘకాల ఆందోళనలో విద్యుత్తు (సవరణ)బిల్లు-2020ని వెనక్కు తీసుకోవాలనేది ఒక ప్రముఖమైన డిమాండ్. మూడు చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లు నాటకీయంగా ప్రకటించిన తీరులోనే, విద్యుత్(సవరణ)బిల్లుపై రైతాంగంతో చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామనే మాటకు కట్టుబడకుండా విద్యుత్ బిల్లును కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల ఆందోళనతో దానిని స్టాండింగ్ కమిటీకి పంపింది. ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టకముందే రాష్ట్రాల రుణపరిమితి పెంపును ఎరగావేసి, ఈ బిల్లులోని ప్రతిపాదనలను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం త్వరితం చేసింది. దీనికి తలొగ్గిన రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటర్లకు మీటర్లు అమర్చే రైతాంగ వ్యతిరేక చర్యలకు ముందుకొచ్చింది.

## వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు

సాంకేతిక, వాణిజ్య నష్టాలు 15 శాతానికి మించిన రాష్ట్రాలలో 'రీవాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్'ను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. విద్యుత్తు పంపిణీ ప్రసార నష్టాలను తగ్గించేందుకు ఈ పథకం ప్రవేశ పెడుతున్నట్లుగా పేర్కొంది. ఏ.పి.లో 2021-22 నాటికే విద్యుత్ ప్రసార నష్టాలు 11.21 శాతంగా వున్నా, రాష్ట్రప్రభుత్వం కేంద్ర పథకాన్ని అమలుచేసేందుకు ముందుకొచ్చింది. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు కార్యక్రమం అమలుచేస్తోంది. పలు రాష్ట్రాలు సాగు విద్యుత్ మోటర్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలన్న కేంద్రప్రభుత్వ ఈ విధానాన్ని వ్యతిరేకించి, అమలుచేయ నిరాకరించాయి. అదనపు రుణ సేకరణకోసం రోజువారీ వెంపర్లాడుతున్న ఏపిలోని జగన్ ప్రభుత్వం, దీనికి లోబడి రైతాంగ వ్యతిరేకతలను బేఖాతరు చేస్తూ కేంద్రప్రభుత్వ పథకాన్ని అమలుచేస్తోంది.

ప్రభుత్వం రైతాంగానికి అందించే ఉచిత వ్యవసాయ విద్యుత్తు పథకంలో ఎన్ని పరిమితులున్నా, ఏదోమేరకు రైతాంగానికి అది ఉపశమనంగా వున్నమాట వాస్తవం. 2020 సం॥లో రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ విద్యుత్తు బిల్లులు ఆయా రైతులే చెల్లించుకోవాలంటూ జీవో నెం.22 విడుదల చేసింది. రైతాంగం నుండి వస్తున్న తీవ్ర వ్యతిరేకతనుండి తప్పుకోవడానికి విద్యుత్తు బిల్లుల మొత్తాన్ని నగదు బదిలీద్వారా ప్రభుత్వమే రైతుల ఖాతాల్లో జమచేస్తుందని, రైతులపై భారం మోపబోమని చెబుతూ వెనక్కు తగ్గింది.

వ్యవసాయ విద్యుత్ మోటర్లకు గతంలో మీటర్లు లేవు గనుక ఎవరెవరు ఎంత విద్యుత్తు వాడుకున్నారో నిర్దిష్టంగా తెలియదు. ప్రసార నష్టాలు పోనూ వ్యవసాయ విద్యుత్తు వినియోగం ఎంతో మొత్తంమీద లెక్కిస్తూ వస్తున్నారు. ఇప్పుడు మీటర్లు పెట్టి విడివిడిగా ఒక్కొక్కరు వాడే విద్యుత్తును లెక్కగడుతూ, ఇదంతా కేవలం అంచనాకోసమని, విద్యుత్తు ఆదాకోసమని, నాణ్యమైన విద్యుత్తు కోసమని పొంతనలేని విధంగా మాట్లాడుతున్నారు. ఎవరు ఎంత వ్యవసాయ విద్యుత్తు వాడుకున్నారో లెక్కతేలినా, ఆయా రైతులు ఆ బిల్లు చెల్లించనవసరంలేదని, ప్రభుత్వమే దానిని చెల్లిస్తుందంటూ మభ్య పరుస్తున్నారు. రైతాంగం నుండి ఒకేసారిగా తీవ్ర వ్యతిరేకత రాకుండా వుండేందుకు రైతులపై అంచెలవారీగా భారాలు పెంచే తమ కుటిల పథకాలను అమలుచేస్తున్నారు.

రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు 18 లక్షల 58 వేలు వున్నాయి. ఒక్కో వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు రు.4650 వెచ్చించి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తూ, రైతులపై ఈ భారం మోపబోమంటూనే, రాష్ట్ర ఖజానాపై అనవసరమైన ఈ భారాన్ని మోపుతున్నది. కేంద్రం చెల్లించే సబ్సిడీ మినహాయించినా దాదాపు నాలుగువేల కోట్ల రూ॥ల భారాన్ని ప్రభుత్వం రాష్ట్రప్రజలపై మోపుతూ మరోవైపున స్మార్ట్‌మీటర్ల బిగింపు టెండర్లలో, కేటాయింపులో పెద్దస్థాయిలో అవినీతి, అవకతవకలకు పాల్పడుతోంది.

ఈ నాలుగువేల కోట్ల నిధులను రైతాంగానికి కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకోసమూ, విద్యుత్ లైన్ల మెరుగుదలకోసమూ, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వెచ్చిస్తే రైతులకూ, వ్యవసాయానికీ ఎంతో మేలు జరుగుతుందని తెలిసినా, రైతాంగ ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు ఆ చర్యలు చేపడతా యనుకోవటం అత్యాశే అవుతుంది. డిస్కంలకు ప్రభుత్వ కార్యాలయాల, స్థానిక సంస్థల విద్యుత్ బకాయిలు కోట్ల రూ॥లలో వున్నాయి. ఉచిత

విద్యుత్ సబ్సిడీ భారాన్ని రాష్ట్రప్రభుత్వం డిస్కంలకు చెల్లించకుండా వేల కోట్ల రూ॥లు బకాయి పడింది. బడాబాబులు విద్యుత్ చౌర్యం చేస్తూ బిల్లులు కాకుండాను, వేసిన బిల్లులు చెల్లించకుండానూ బకాయిలు పెరిగిపోతూ డిస్కంలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్‌కు స్మార్ట్‌మీటర్ల కోసం వడ్డీలపై అప్పులు తెచ్చి మరీ 'డిస్కం'లు ఈ పథకాన్ని అమలుచేస్తున్నాయి.

## గృహ విద్యుత్తుకు స్మార్ట్‌మీటర్లు

ఇళ్ళలో వాడుకునే విద్యుత్తును, మీటర్ల ద్వారా మాన్యువల్‌గా గతంలో లెక్కించేవారు. ఆ మీటర్లను తొలగించి అధునాతన డిజిటల్ పరికరాలతో స్కాన్‌చేసి, విద్యుత్తు వినియోగాన్ని లెక్కించేవిధంగా నూతన మీటర్లను ఇటీవలే అమర్చారు. ఈ ఏర్పాట్ల భారం వినియోగదారుల పైనే మోపారు.

వీటి స్థానంలో-వ్యవసాయ విద్యుత్‌తో పాటు, గృహ, వాణిజ్య విద్యుత్‌లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించటానికి రాష్ట్రప్రభుత్వం పూనుకుంటోంది. రాష్ట్రంలో వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లు కోటీ 50 లక్షలు వున్నాయి. తొలి దశలో నెలవారీగా 300 యూనిట్లు, ఆపైన వినియోగించే వారికి స్మార్ట్‌మీటర్లు అమరుస్తారు. 2025 డిసెంబర్ నాటికి 200 యూనిట్లు నెలవారీ వినియోగం దాటిన వారందరికీ దీనిని తప్పనిసరి చేయనున్నారు. ఈ కొత్త స్మార్ట్‌మీటర్లు పెట్టటానికి అయ్యే వేల కోట్ల భారాన్ని వినియోగదారులపైనే మోపనున్నారు.

గతంలో విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కంలు) వినియోగదారులపై మోపదలుచుకున్న భారాన్ని విద్యుత్తు నియంత్రణామండలి (ఏపిఆర్ఇసి) ముందుంచి, లాంఛనంగా అయినా దాని ఆమోదాన్ని పొందేవి. నేరుగా డిస్కమ్‌లు వినియోగదారులపై భారాలు మోప వచ్చుననే కేంద్రప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ప్రజలపై భారాలను తీవ్రం చేస్తోంది. గత ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సార్లుగా విద్యుత్ ఛార్జీలను పెంచింది.

మనం వినియోగించిన విద్యుత్‌కు స్లాబు కనుగుణంగా చెల్లించే ఛార్జీతోపాటు 6 రకాల అదనపు ఛార్జీలను చెల్లిస్తున్నాము. 1.ఫిక్స్‌డ్ ఛార్జీలు(మన ఇంటికి విద్యుత్ కనెక్షన్ తీసుకునే టప్పుడు ఎన్ని కిలోవాట్ల లోడ్ అనేది పేర్కొంటాము. కిలోవాట్‌కు 10 రూ॥ చొప్పున జీవితకాలం దీనిని వసూలు చేస్తున్నారు) 2. కస్టమర్ ఛార్జీలు(మన ఇంటికి విద్యుత్ సరఫరా చేసినందుకు వసూలుచేసే ఛార్జీలు) 3. విద్యుత్ సుంకం(విద్యుత్ వాడుకున్నందుకు ప్రభుత్వానికి కట్టే పన్ను. ఇళ్ళకు యూనిట్‌కు 6 పైసల చొప్పున, షాపులకు అయితే యూనిట్‌కు రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారు) 4. ట్రూ అప్ ఛార్జీలు(2014-19 మధ్యకాలంలో వాడిన విద్యుత్ తాలూకూ 3,083 కోట్ల రూ॥లను విభజించి 36 నెలలపాటు వినియోగదారులనుండి వసూలు చేస్తున్నారు) 5. ఇంధన సర్దుబాటు ఛార్జీలు(2021-22 సం॥లో వాడిన విద్యుత్తుకు తక్కువగా వసూలు చేశామంటూ యూనిట్‌కు 20 పై॥ నుండి 66 పై॥ వరకు ఏప్రిల్ 2023 నుండి 2024 మార్చి వరకు వసూలు చేస్తారు) 6. ఇంధన సర్దుబాటు ఛార్జీలు-II (2023-24లో వినియోగించిన విద్యుత్తుకు మరుసటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారు)

ఇవన్నీ కలిపినపుడు వినియోగించిన విద్యుత్తుకు అయిన మొత్తంకన్నా పైన పేర్కొన్న ఆరు రకాల ఛార్జీల మొత్తమే ఎక్కువగా వుంటున్నదంటే, ప్రజలపై మోపుతున్న భారాల తీవ్రత అర్ధమౌతోంది. ఈ భారాలతో గృహవిద్యుత్తు వినియోగదారులే కాకుండా చిన్న వ్యాపారులు, దుకాణదారులు, చిన్న ఉత్పత్తిదారులు, చిన్న పరిశ్రమదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ స్మార్ట్‌మీటర్లు పని ప్రారంభించిన తర్వాత, ప్రత్యేకించి ప్రతి మీటర్ వద్దకు వచ్చి స్కాన్‌చేసి, రీడింగ్ నమోదు చేయాల్సిన అవసరం లేకుండా ముందుస్తుగా చెల్లింపు చేసే పద్ధతి(ప్రీపెయిడ్)ని ప్రవేశ పెడతారు. చెల్లించిన మేరకు విద్యుత్తును అందిస్తారు. చెల్లించిన డబ్బు మేర విద్యుత్తు వాడకం పూర్తవగానే, విద్యుత్ నిలిచిపోతుంది. ప్రజానీకాన్ని చీకటిలో ముంచబోతున్నారు.

## బలమైన ఐక్య ఆందోళనోద్యమం అవసరం

విద్యుత్ (సవరణ) బిల్లు లాంఛనంగా పార్లమెంటులో ఆమోదం పొందనవసరం లేకుండానే విద్యుత్ రంగం మొత్తాన్ని ప్రైవేటీకరించి, కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పాలకులు ముందుకెళ్తున్నారు. ప్రజానీకం నుండి ముఖ్యంగా రైతాంగం నుండి ముక్కుపిండి మరీ పెంచిన ఛార్జీలను రాబట్టుకొని సూపర్ లాభాలు గడించేందుకు సిద్ధమయ్యారు. సామ్రాజ్యవాదులు ఆదేశించిన విధంగా ఇంధన వనరులను ఉపయోగించి ప్రజలపై ఛార్జీల పెనుభారాన్ని మోపి, సామ్రాజ్యవాద, బడాకార్పొరేట్ కంపెనీలకు లాభాలార్జించిపెడుతున్నారు.

రైతాంగంతోసహా విద్యుత్‌పై ఆధారపడిన సమస్త చేతివృత్తులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను సైతం చావుదెబ్బతీస్తున్నారు. తద్వారా దేశ ఆర్థిక సామాజిక రంగాలపై తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, గృహవిద్యుత్తుకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమించాలి. రైతాంగానికి బేషరతుగా ఉచిత విద్యుత్తునందించాలని, ప్రజలపై మోపుతున్న పలు రూపాలలోని విద్యుత్ భారాలను ఉపసంహరించాలని, చేతివృత్తులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సరసమైన ధరకే నాణ్యమైన విద్యుత్తునందించాలని, విద్యుత్తు రంగాన్ని సంపూర్ణంగా ప్రైవేటీకరించే విద్యుత్తు(సవరణ) బిల్లు-2020ని పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్‌చేస్తూ బలమైన ఐక్య ఆందోళనద్యోమం నిర్మించాలి. దేశంలోని ఇంధన వనరులపై సామ్రాజ్యవాదుల పెత్తనానికి, వారికి ఊడిగంచేసే పాలకుల దళారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాట మొనను ఎక్కుపెట్టాలి. ★





వెలువడింది!
రైతుకూలీసంఘం
(ఆంధ్రప్రదేశ్)
వార్షిక సంచిక-2022

కాపీలకు :
**మైత్రీ బుక్‌హౌస్**
జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

# భారతదేశంలోని వ్యవసాయిక వ్యవస్థ - దాని లక్షణాలు

అలోక్ ముఖర్జీ

**ఉపోద్ఘాతం:**

గత కొన్ని దశాబ్దాలుగా మార్క్సిస్టు-లెనినిస్టు కార్యకర్తలలోనూ, విద్యావేత్తలోనూ భారతదేశం యొక్క వ్యవసాయిక వ్యవస్థను గురించి, దాని పరిణామాల గురించీ, ఆ వ్యవస్థలో జరిగిన మార్పుల గురించీ, ఆసక్తికరమైన సజీవ చర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలలో మన దేశంలోని వ్యవసాయ ఉత్పత్తి విధానంలో జరిగిన మార్పులకు సంబంధించిన ప్రశ్న తలెత్తింది. ఇది ఆచరణలో అంతపెద్ద ప్రాముఖ్యత లేని సిద్ధాంతపరమైన చర్చ. ఎందుకంటే ఉత్పత్తి విధానంలోని మార్పు సమాజం యొక్క లక్షణ-స్వభావాలను అర్థం చేసుకోవటంపై, వర్గాల యొక్క మైత్రిని అర్థం చేసుకోవటంపై, వీటన్నిటికన్నా పైన విప్లవం యొక్క వ్యూహం, ఎత్తుగడలపైనా యీ చర్చ ప్రభావాన్ని కలుగజేస్తుంది. అందువలన యీ విషయం కమ్యూనిస్టు విప్లవకారులకు ప్రాధాన్యత కలిగిన, కీలకమైన అంశంగా మారింది.

గత శతాబ్దపు అరవయ్యవ దశాబ్దపుకాలం నుండీ, భారతదేశపు వ్యవసాయంలో ఎన్నో మార్పులు జరుగుతున్నది వాస్తవమే. అయితే యిక్కడ మనం పట్టించుకోవలసిన విషయం ఏమిటంటే, ఆ మార్పులు ఉత్పత్తి విధానాన్నే మార్చివేశాయా? అన్నది. ఈ సమస్యపై మన చర్చ మార్క్సిస్టు సిద్ధాంతంపై ఆధారపడి వుంటుంది. ఇటువంటి చర్చను జరుపుతున్న సందర్భంలో తప్పనిసరిగా అవసరమైతే తప్ప గణాంకాలనూ, గణాంకాల పట్టికలనూ విస్తారంగా పేర్కొనటాన్ని తప్పించటానికి ప్రయత్నిద్దాం.

కొందరు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని గురించి నిర్వచించటానికి బదులు, దీనిని ఒక పరిణామ దశగా పరిగణిస్తూ ఆలోచిస్తున్నారు. ఈ రకంగా ఆలోచిస్తున్న రెండు సెక్షన్ల వారు కూడా అనుభవం గల, చురుకుగా పనిచేస్తున్న మార్క్సిస్టు-లెనినిస్టులు. అందువలన వారి వాదనలలోని మౌలిక అంశాలను-ఆధారాలను మార్క్సిజంపై ఆధారపడి విశ్లేషించి, పరీక్షిద్దాం. అదేవిధంగా, 1960ల నుండీ ఏవిధమైన మార్పులూ సంభవించలేదు అని వాదిస్తున్న సాంప్రదాయకవాదులు తీసుకొన్న వైఖరిని గురించి కూడా మనం చర్చిద్దాం.

## పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సమర్ధిస్తూ తేబడ్డ ప్రధాన వాదనలు:

ఫ్యూడల్ మరియు పెట్టుబడిదారీ విధానాలకు ముందున్న నిర్మాణాలు పురాతనమైనవనీ, పతనావస్థలో వున్నాయనీ, పెట్టుబడిదారీ విధానం అన్నది కొత్తగా పెరుగుతున్న ధోరణి అని తరచుగా వాదింపబడుతోంది. అందువలన వ్యవసాయంలో పెరుగుతున్న కొన్ని మౌలిక పెట్టుబడిదారీ అంశాలపై ఆధారపడి, మార్క్సిస్టులుగా మనం భారతదేశంలోని వ్యవసాయం పెట్టుబడిదారీ వ్యవసాయంగా మలుపు చెందిందనీ, లేదా ఫ్యూడలిజం నుండి పెట్టుబడిదారీ విధానం వైపుకు పరిణామం చెందుతున్న ప్రక్రియలో వుందని నిర్ధారించాలని వాదనలు చేయబడు తున్నాయి.

కానీ వారు తమ వాదన, ఒక స్వతంత్ర సామాజిక పరిస్థితుల్లో పెట్టుబడి అభివృద్ధి చెందుతున్నప్పుడు మాత్రమే నిలబడుతుందన్న విషయాన్ని మరిచిపోయారు. సామ్రాజ్యవాద దశకంలో, ఒక దేశంలో స్వాతంత్ర్యం అన్నది సామాజిక విప్లవం ద్వారా సామ్రాజ్యవాదాన్ని కూల్చివేయకుండా సాధించనప్పుడు, కేవలం సామ్రాజ్యవాదంతో ఒక ఏర్పాటు ద్వారా స్వాతంత్రాన్ని పొందినప్పుడు వ్యవసాయ రంగంతో సహా అన్ని ఆర్థిక రంగాలలోని పెట్టుబడిదారీ పరిణామ అభివృద్ధి అన్నది, ఒక ఉపశమనంగా, తక్కువ స్థాయి అభివృద్ధిగా లభించినదే తప్ప, సామ్రాజ్యవాదం చేత ఆటంక పరచబడలేదు అన్న విషయాన్నీ వారు మరిచి పోతున్నారు. భారతదేశంలో జరిగే ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాలను, భారతదేశం సామ్రాజ్యవాదశక్తులతో నెరిపే అంతస్సంబంధాల, కలయికల పట్ల దృష్టి పెట్టకుండా అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. భారతదేశంలో బ్రిటిష్ పాలన జరిగిన కాలం నాటి నుండీ ఫ్యూడలిజం అనేకమైన మార్పులకు గురయింది. భారతదేశంలోని బడాపెట్టుబడి విషయంలో జరిగింది కూడా అదే! కానీ యివేవీ, సమాజంలో ఒక విప్లవకరమైన మార్పు జరగనంత వరకూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా అభివృద్ధి చెందలేవు.

బ్రిటిష్‌వారి పరిపాలనా కాలం నుండీ భారతదేశపు వ్యవసాయంలో ఏం జరిగింది? అన్న విషయాన్ని తర్వాత సంక్షిప్తంగా చర్చించుకొందాం. కానీ అలా చర్చించుకోవటానికి ముందుగా, మన కమ్యూనిస్టు విప్లవకారుల మిత్రుల కళ్ళకు భారతదేశంలోని వ్యవసాయంలో పెట్టుబడిదారీ పరిణామం సంభవించినట్లుగా కనబడిన ఎండమావులను సృష్టించిన వివిధ రకాల అంశాలను మనం పరిశీలిద్దాం.

**అ) వ్యవసాయిక ఉత్పత్తులను అమ్మకపు సరకులుగా మార్చటం:**

మన కమ్యూనిస్టు విప్లవకార మిత్రులు భారతదేశంలోని వ్యవసాయంలో పెట్టుబడిదారీ పరిణామం సంభవించిందని చెప్పటానికి మద్దతుగా చేసే అతి ముఖ్యమైన వాదనలలో, వ్యవసాయిక ఉత్పత్తులను అమ్మకపు (మార్కెట్టు) సరుకులుగా మార్చివేయటమన్న అంశం అన్నది ఒకటి. నిజమే! గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ఆహారధాన్యాలనూ, తృణధాన్యాలనూ, నూనె విత్తనాలను లేదా బంగాళాదుంపలు, ఉల్లిపాయలు మొదలైన పంటలను, ఆఖరికి వాణిజ్య పంటలైన పత్తి, జనుము మొదలైన పంటలను సహితం వాటి ఉత్పత్తిదారులు మార్కెటింగ్‌నైనా చేస్తున్నారు. లేదా భవిష్యత్తులో మార్కెటింగ్ చేయటం కోసం గిడ్డంగుల్లో నిల్వ వుంచుతున్నారు.

కానీ ముందుగా మనం గుర్తు పెట్టుకోవల్సిన విషయం ఏమిటంటే, అమ్మకపు సరుకులను లేదా దినుసులను ఉత్పత్తి చేయటమన్నది దానికదే పెట్టుబడిదారీ విధానంగా చేయదు. అనాది కాలం నుండీ వస్తువుల ఉత్పత్తి జరుగుతూనే వుంది. ఈ విషయాన్ని గురించి మార్క్స్ అభిప్రాయాన్ని గురించి తెలుసుకోవటానికి ముందుగా, జాన్ మాసెఫీల్డ్ వ్రాసిన, అత్యంత ప్రాచుర్యం పొందిన, అందరికీ తెలిసిన "రవాణా సరుకు (కార్గో)" అన్న మూడు పద్యాల మాలను చూద్దాం:

ఎంతో దూరంలో వున్న ఒఫీర్ నుండి,
పాలస్తీనాలోని తన స్వంత రేవుకు,
నినెవాకు చెందిన క్విన్‌క్విరెమ్ నౌక,
ఏనుగు దంతాల రవాణా సరకుతోనూ,
కోతులతోనూ, నెమళ్ళతోనూ,
గంధపు చెక్కతోనూ, దేవదారు చెక్కతోనూ,
తీయటి తెల్ల ద్రాక్ష సారాయితోనూ
తిరిగివస్తోంది!.

ఇస్తమస్ నుంచి రాజసం ఉట్టిపడుతూ
వస్తున్న స్పెయిన్ దేశపు వర్తకపు నౌక,
కొబ్బరి - తాటి చెట్లతో పచ్చగా
విరాజిల్లుతున్న ఉష్ణ మండలపు తీరాల నుండి,
వజ్రాలు, మరకతాలు, పచ్చలు,
గోమేధికాలు, జాతిరాళ్ళు,

దాల్చిన చెక్క, బంగారు వస్తువులతో కూడిన రవాణా సరుకుతో!.

ఉప్పుపట్టి, మసిబారిన పొగగొట్టంతో మురికిగా వున్న బ్రిటిష్ తీరనౌక,

పిచ్చెత్తించే మార్చి నెలరోజుల్లో, ఛానెల్ గుండా రవాణా సరుకులైన

రాక్షసిబొగ్గు, రైలుపట్టాలు, తగరపు దుక్కలు,

వంటచెరకు, ఇనుప పాత్రలు, తగరపు పళ్ళేలు మోస్తూ సాగుతోంది!

పై మూడు పద్యాలు వేటికవే మూడు విభిన్న నాగరికతలకు చెందిన, మూడు విభిన్న సామాజిక పరిణామాలకు చెందిన, మూడు వేరు, వేరు రకాలకు చెందిన రవాణా సరుకులను మోసుకువెళ్తున్న వివరాలను వివరించాయి. ఎటువంటి సందేహం లేకుండా అప్పుడు వాణిజ్య సరుకులున్నాయని రూఢీ అవుతోంది. భారత దేశంలో దేశంలో అంతర్గతంగానూ, బయటి మార్కెట్ల కోసం చేనేత నూలు వస్త్రాలు ఉత్పత్తి చేయబడేవి. అందువలన ఆ ఉత్పత్తి, చేనేత దారులను పెట్టుబడిదారులను చేయలేదు.

కేవలం అమ్మకపు సరుకుల ఉత్పత్తి అన్న దాని అర్థం పెట్టుబడిదారీ విధానం కాదు అని మార్క్స్ ఎత్తి చూపించాడు. ఆయన యీ విధంగా చెప్పాడు : "ఆదిమకాలపు ఆసియాటిక్ తదితర ఉత్పత్తి విధానాలలో, ఉత్పత్తులను అమ్మకపు సరుకుగా మార్చటాన్ని మనం గమనిస్తాం. ఆ రకంగా మనుషులు అమ్మకపు సరుకుల ఉత్పత్తిదారులుగా మారటమన్నది ద్వితీయ స్థానాన్ని పొందుతుంది. అయితే ఆదిమ సమాజాలు రద్దుకావటం వైపుకు దగ్గర, దగ్గరగా సమీపిస్తున్న కొద్దీ, యీ మారటం అన్నది ప్రాముఖ్యతలో పెరిగిపోతుంది". (పెట్టుబడి, వాల్యూం-1, పేజీ.83, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో 1986).

కొందరు తామూ అదే విషయం మాట్లాడు తున్నాము, "పాతవ్యవస్థ రద్దు కావటం అన్న వైపుకు దగ్గర దగ్గరగా సమీపిస్తోంది" అని చెప్తున్నాము అంటూ వాదించవచ్చును. వీరి వాదన వాస్తవికవాదం యొక్క ఊహాపూర్వక వివరణే తప్ప మరేమీకాదు. మార్క్సిజం వెలుగులో యీ వాస్తవిక - నిష్పాక్షికతావాదం గురించి తర్వాత చర్చించుకొందాము. ఇక్కడ, మార్క్స్ పైన పేర్కొన్న వాక్యాలకు ముందూ, ఆ తర్వాత ఏం చెప్పాడో అన్నదాని పట్ల వారు దృష్టి పెట్టాలని కోరుతున్నాం.

"ఈ సమాజంలో (మధ్యయుగాల నాటి యూరోపియన్ సమాజంలో) వివిధ వర్గాలు పోషించిన పాత్రలను గురించి మనం ఏమనుకొంటున్నామన్న దానితో సంబంధం లేదు. కానీ, తమ శ్రమను వినియోగించటంలో జరిపిన ఆచరణలో వ్యక్తుల మధ్య గల సామాజిక సంబంధాలే అన్నింటికన్నా ఎక్కువగా వారి పరస్పర సంబంధాలలో కనబడుతుంది. ఆ సంబంధాలు, శ్రమ ఉత్పత్తి చేసిన ఉత్పత్తుల మధ్యగల సామాజిక సంబంధాల రూపాలుగా మారువేషం వేసుకోలేదు. అవి వారి స్వంత సంబంధాలు" (అదే గ్రంథం, పేజీ-82).

గ్రామీణ భారతదేశంతోనూ, వ్యవసాయిక ఉత్పత్తి ప్రక్రియతోనూ పరిచయం వున్న వారెవరికైనా, యించుమించుగా వ్యవసాయ కార్మికులందరూ భూయజమానులతో "తమ యొక్క వ్యక్తిగత సంబంధాలను" కలిగి వుంటారని తెలుసును. ఇతర ప్రాంతాల నుండి సీజనల్ పనులకు వచ్చే వలస వ్యవసాయ కూలీలు అదే భూయజమాని దగ్గరికి విత్తులు నాటే, పంటకోతల సమయాల్లో పనులకు సంవత్సరం తర్వాత సంవత్సరం వస్తారు. అంతేకాక భారతదేశంలో సాగుతున్న కులవ్యవస్థ సామాజిక సంబంధాలలోనూ, కార్మికులు వ్యక్తిగతంగా పని చేసే విధానంలోనూ ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

మార్క్స్ చెప్పిన యీ మాటలను గుర్తు తెచ్చుకొందాం: "వస్తువుల ఉత్పత్తి యొక్క ప్రక్రియపై ఆధారపడిన సమాజం యొక్క జీవిత ప్రక్రియ, ఆ ఉత్పత్తిని స్వేచ్ఛగా కూడుకొన్న ప్రజలు జరిపేటట్టుగా వ్యవహరించనంత వరకూ, ఆ ఉత్పత్తి వారి చేత ఒక నిర్ణయించబడ్డ పథకం ప్రకారం జాగరూకతతో వారిచేత నియంత్రించబడనంత వరకూ, అది దాని యొక్క మాయా ముసుగును చించివేయదు. అలా జరగాలంటే, సమాజం కోసం ఒక విధానమైన పాదార్థిక పునాది లేదా ఒక స్థిరమైన అస్థిత్వ (మనుగడ) పరిస్థితులను అది డిమాండు చేస్తుంది. ఆ పరిస్థితుల పునాది తిరిగి ఒక దీర్ఘకాలపు, బాధాకర కష్టంతో కూడిన పరిణామ ప్రక్రియ యొక్క యాదృచ్ఛికమైన ఉత్పత్తి ఫలాలు అవుతాయి". అదే గ్రంథం, పేజీ-84)

మరి 'పాదార్థిక పునాది' లేదా 'దీర్ఘకాలం పాటు కష్టంతో కూడిన పరిణామ ప్రక్రియ యొక్క యాదృచ్ఛికమైన ఉత్పత్తి ఫలాలు ఎక్కడున్నాయి? రాజ్యం బలవంతంగా అమలు జరిపిన మార్పులు, భూయజమానుల లేదా వ్యవసాయ కూలీల ప్రయోజనాల కోసం కాదు.

అందువల్ల మన కమ్యూనిస్టు విప్లవకర మిత్రులు, తమ అవగాహనలో ఎక్కడ తప్పు చేసినట్లు? అమ్మకపు సరుకుల ఉత్పత్తి అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఒక అంశంగా పనిచేయవచ్చును. ఇది ఒక "అతి సూక్ష్మమైన గర్భస్థ పిండరూపం" (మార్క్స్). కానీ యిది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సూచించదు. గణాంకశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే, వాటిలో ఒకదానికీ, మరొకదానికీ అనుగుణ్యత లేదు. ఈ విషయాన్ని తర్వాత చర్చించుదాం. ఇప్పుడు వారి వాదనలు ఆధారపడిన మరొక అంశాన్ని గురించి చర్చించుదాం. అదే! యంత్రాల వినియోగాన్ని గురించి.

## యంత్రాల వినియోగం:

తమ వాదనను బలపరచుకోవటం కోసం వారిలో కొందరు అమ్మకపు సరుకుల ఉత్పత్తితో పాటు యంత్రాలను ప్రవేశపెట్టడం అన్నది, వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం స్థాపించటాన్ని రుజువు చేస్తున్నదని వాదిస్తారు. ఇది ఒక వింతైన వాదన. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యంత్రాలను ప్రవేశపెట్టలేదు. కానీ యంత్రాల ఉత్పత్తి ప్రక్రియను పెట్టుబడిదారీగా చేశాయి. కొంచెం తర్వాత యంత్రాలను గురించిన మార్క్స్ అభిప్రాయం ఏమిటో చూద్దాం. అంతకు ముందుగా మనం యీ దృగ్విషయాన్ని అనుభవపూర్వకంగా, తెరచిన కళ్ళతో చూద్దాం!

ఈ యంత్రాలు ఒక పెట్టుబడిదారీ పద్ధతిలో వుపయోగింపబడటలేదని మనకు స్పష్టమవు తుంది. ఎందుకంటే అది ఒక యాదృచ్ఛిక పరిణామంగా ప్రవేశపెట్టబడలేదు. కానీ విదేశీ, స్వదేశీ బడాపెట్టుబడి ప్రయోజనాల కోసం పై నుంచి ప్రవేశపెట్టబడ్డాయి కనుక! బిజినెస్ స్టాండర్డు పత్రిక అధ్యయనంలో "వ్యవసాయేతర మైన ప్రయోజనాల కోసం వాడకం (యంత్రాల) గత కొద్ది సంవత్సరాలుగా పెరిగిపోతోంది. ప్రస్తుతం యిది 40% దరిదాపుకు పెరిగింది" అని తెలియజేసింది. (బిజినెస్ స్టాండర్డ్, జనవరి 20, 2013)

పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లను ఇసుక గనుల్లోనూ, ఇటుక బట్టీల్లోనూ, రోడ్డు నిర్మాణం లోనూ, ప్యాసింజర్లను దాటించటంలోనూ మొదలైన పనుల్లో ఉపయోగిస్తున్నారు. యోగి రాజ్యంలో (యు.పిలో) ట్రాక్టర్లను శిధిలాలను తొలగించే బుల్‌డోజర్లకు సహాయకరంగా వాడుతున్నారు. చాలా మున్సిపాలిటీలు చెత్తను మోసుకుపోవటానికి ట్రాక్టర్లను వాడుతున్నాయి.

అదేవిధంగా ఎక్కువ మంది ట్రాక్టరు స్వంతదారులు తమ ట్రాక్టర్లను, గంటల ప్రకారం అద్దెకు యిస్తున్న విషయం మనం ఎరిగున్నదే!. ప్యాసింజర్లను (కూలీలను) తోలటం కోసం కూడా వారు ట్రాక్టర్లను అద్దెకు యిస్తున్నారు. ట్రాక్టర్లను

అద్దెకు యిచ్చే ఒక సంస్థ స్థాపించబడనంత వరకూ, యంత్రాలను అద్దెకు యివ్వటం అనేది ఏరకంగాను పెట్టుబడిదారీ కార్యకలాపం కాదు. పంపుసెట్లు, హార్వెస్టింగ్ (పంటకోతల) యంత్రాల విషయంలో కూడా యిదే వాస్తవం. ఆఖరికి పెట్టుబడిదారీ అర్థంలో, ట్రాక్టర్లను కూలీలు నడపరు. ఆనంద బజారు పత్రికలో వచ్చిన, దుస్థితిలో వున్న ఒక బాలుడి విజయ గాథను నమ్మదలుచుకొంటే, యించుమించుగా యీ ట్రాక్టరు డ్రైవర్లుగా పనిచేయించుకొనే కూలీలందరకీ, వారిని నెలకు అతితక్కువ వేతనం మూడు వందల రూపాయలు యిచ్చి నియమించుకొంటున్నారు.

ఎన్నో సంవత్సరాల క్రితం మార్క్స్, పి.వి. అన్నెన్‌కోవ్‌కు వ్రాసిన ప్రఖ్యాతమైన లేఖలో ఏం వ్రాశాడో, ఆ విషయాన్ని మనం లక్ష్యపెడదాం (పట్టించుకొందాం)! "నాగలిని లాగే ఎద్దు కన్నా, యంత్రమన్నది ఒక ఆర్థిక తరగతికి (కేటగిరీకి) చెందినది కాదు. నేటి రోజుల్లో యంత్రాలను అనువర్తించటం (వాడటం) అన్నది, మన యొక్క ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలోని సంబంధాలలో ఒక సంబంధం. అయితే యీ యంత్రాలు ఏవిధంగా ఉప యోగించబడుతున్నాయన్న పద్ధతి అన్నది పూర్తిగా ఆ యంత్రం నుండి ప్రత్యేక లక్షణం గలది. పొడి (పౌడర్) అన్నది పొడే! కానీ ఆ పౌడర్‌ను తుపాకీ పౌడర్‌గా ఒక మనిషిని గాయపరచటానికి వాడుతారా? లేక ఆ మనిషి యొక్క గాయానికి కట్టుకట్టడానికి వాడుతారా? అన్నదే అసలు విషయం. (డిసెంబరు, 28, 1846న పి.పి. అన్నెన్‌కోవ్‌కు రాసిన లేఖ, ఏరిన రచనలు, మార్క్స్ మరియు ఎంగెల్సు ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో 1986, పేజీ. 663)

ఇప్పుడు మార్క్స్ ప్రకారం యంత్రాలను ఉపయోగించటంలో భిన్నమైన ప్రత్యేక లక్షణం అంటే ఏమిటో తెల్సుకొందాం:

"శ్రమ యొక్క పనిముట్టు, యంత్రం యొక్క రూపం ఎప్పుడైతే తీసుకొంటుందో, తక్షణమే అది పని వాని యొక్క (శ్రామికుని యొక్క) పోటీదారు అయిపోతుంది. పెట్టుబడి యొక్క స్వయం విస్తరణ యంత్రాల ద్వారా జరిగినప్పటి నుండీ అది ఆ యంత్రాల వలన జీవనాధారం నాశనమయిన కార్మిక జనుల సంఖ్యకు సూటైన దామాషాలో వుంటుంది. మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ అంతా, కార్మికుడు తన శ్రమశక్తిని ఒక అమ్మకపు సరుకుగా అమ్ముతున్న దానిపై ఆధారపడి వుంది. శ్రమ విభజన యీ శ్రమశక్తిని దాని యొక్క నైపుణ్యతను, ఒక ప్రత్యేకమైన పనిముట్టును ఉపకరించే విధంగా తగ్గించి వేస్తుంది. అందువలన పనిముట్టును ఉపకరించేటట్లు చేసే పని యంత్రానిదిగా మారిన వెంటనే అప్పుడు కార్మికుని శ్రమశక్తి యొక్క ఉపయోగపు విలువ మారకపు విలువతో సహా అంతర్ధానమై పోతుంది. కార్మికుడు యిక అమ్మడు బోని వాడిగా - చట్టం ద్వారా కాగితపు డబ్బును కరెన్సీ నోట్ల నుండి బయటకు త్రోసిపడేసినట్లుగా- (చెల్లనివానిగా) మారిపోతాడు. ఆవిధంగా కార్మికవర్గంలోని భాగం యంత్రం ద్వారా అనవసరం (అనావశ్యకం) చేయబడతుంది. అంటే యింకెంత మాత్రమూ పెట్టుబడి యొక్క స్వయం విస్తరణకు తక్షణమే అవసరం లేకుండా పోతుంది. పాతకాలపు చేతివృత్తులు, యంత్రాలతో జరిగే తయారీకి జరిగే అసమాన పోటీలో కార్మికవర్గంలోని భాగం పూర్తిగా ఓడిపోయి నాశనమైనా అవుతుంది లేదా సులభంగా ప్రవేశించటానికి వీలున్న పరిశ్రమ శాఖల్లోకైనా వెల్లువగా ముంచెత్తుతుంది. లేబర్ మార్కెట్టును బురదతో ముంచుతుంది. శ్రమశక్తి యొక్క ధరను దాని విలువకన్నా తక్కువ స్థాయికి దింపివేస్తుంది". (పెట్టుబడి, వాల్యూం. 1, 405-406)

అందువలన యంత్రమే తనకుతనుగాకాక, దాన్ని 'పెట్టుబడి యొక్క స్వయం విస్తరణకు' ఉపయోగింపబడిందా లేదా అన్నది అసలు విషయంగా వుంటుంది. పెట్టుబడిదారీ విధానం యొక్క ప్రధాన లక్షణం అది. అలా కానప్పుడు యంత్రాలను ప్రవేశపెట్టడంలోని ఉద్దేశం, ఆచరణలో మరింతగా ప్రవేశించవీలున్న పరిశ్రమశాఖలలోకి వెల్లువెత్తించటం కోసం లేబరు - మార్కెట్టును బురదతో నింపి, శ్రామికశక్తిని దాని విలువకన్నా తక్కువ స్థాయిలోకి దించటంకోసం ఉపయోగపెట్ట బడుతుంది. సరీగ్గా అదే జరుగుతోంది యిప్పుడు.

భూయజమానులు (స్వంతదారులు) తమ దగ్గరున్న అదనపు విలువను భూమిపైనగానీ యితర ఉత్పాదక వ్యాపార కంపెనీల్లో కానీ పెట్టుబడిగా పెట్టే సమర్థతను కలిగివున్నారా లేదా? అన్న అంశంపై ఆధారపడి వ్యవసాయంలో పెట్టుబడి యొక్క స్వయం విస్తరణను గురించిన ప్రశ్న తలెత్తుతుంది. ఈ సందర్భంగా భూకేంద్రీకరణలోని మార్పులు, కౌలుదారీ విధానంలోని మార్పులు ముఖ్యమైనవి.

### భూకేంద్రీకరణలోనూ, కౌలుదారీ విధానం తత్సంబంధిత అంశాలలోని మార్పులు:

ఇక్కడ మనం గణాంకాల డేటా నుండి కొంత సహాయం తీసుకొందాం. మనం వ్యవసాయ మంత్రిత్వశాఖ 2012లో ప్రచురించిన 2010-11 వ్యవసాయిక లెక్కలు (సెన్సస్) పైనా, 59వ విడత జాతీయ శాంపిల్ సర్వే లెక్కలపైనా ఆధారపడుతున్నాం. గత 40 సంవత్సరాలుగా జరిగిన మార్పులను చూద్దాం. అంతకుముందుగా భూమిపై పట్టు యొక్క నమూనాలో బేధాలను ఎలా గుర్తిస్తామో చూద్దాం!

| | |
|---|---|
| నామమాత్రం | - ఒక హెక్టార్ కన్నా తక్కువ |
| చిన్న | - 1.01 నుండి 2 హెక్టార్లు |
| చిన్న-మధ్యతరగతి | - 2 నుండి 4 హెక్టార్లు |
| మధ్యరకం | - 4 నుండి 10 హెక్టార్లు |
| పెద్దవి | - 10 హెక్టార్లకన్నా ఎక్కువ. |

**16వ పేజీలో పట్టికల** ప్రకారం గతకొన్ని సంవత్సరాలుగా నామమాత్రపు కమతాల శాతం పెరిగింది, కానీ పెద్ద కమతాల శాతం సంఖ్య 3.9% నుండి 0.7% వరకూ తగ్గింది. అదేరకంగా సాగులో వున్న నామమాత్రపు రైతుల సంఖ్య 9.0% నుండి 22.2% వరకూ పెరిగింది. చిన్న రైతుల సంఖ్య కూడా 11.91% నుండి 22.1% శాతానికి పెరిగింది. చిన్న- మధ్యతరగతి రైతుల సంఖ్య 18.5% నుండి 23.6%నికి పెరిగిందని తెలుస్తోంది. కానీ మధ్యతరగతి, పెద్ద రైతుల సంఖ్య శాతం 29.71% నుండి 21.2% శాతానికీ, పెద్ద రైతుల సంఖ్య శాతం 30.9% నుండి 10.9%నికి పడిపోయినట్లు కనుగొనబడింది.

అందువలన సంస్కరణల పేరుతోటి వ్యవసాయంపై ఏరకమైన ప్రభావం పడిందను కొన్నప్పటికీ సంస్కరణలు నామమాత్రపు రైతుల సంఖ్యను గణనీయమైన స్థాయికి పెంచాయి. వీళ్ళు పెట్టుబడిదారీ వ్యవసాయదారులు ఏ రకంగాను కాలేరు.

మరోవైపు సాగులో వున్న కమతాల వైశాల్యపు శాతం, మధ్యతరగతి-పెద్ద రైతులను కలిపి చాలా ఎక్కువ మేరకు 60.6% నుండి 32.1%కు తగ్గిపోయింది. ఈ స్థితి కూడా పెట్టుబడిదారీ అభివృద్ధికి అనుకూలమైనది కాదు. కానీ, తప్పనిసరిగా కొందరు వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ విధానంలో అభివృద్ధిపరచటానికి సాహసం చేసి వుండవచ్చును.

చిన్న, పెద్ద కమతాలలోని కౌలు రైతుల కమతాలను యిది వివరిస్తుంది. మధ్యతరగతి కమతాల వరకూ కౌలు కమతాలు తగ్గిపోయాయి, అదే సమయంలో పెద్ద కమతాలలో, కౌలుదారు కమతాలు పెరిగిపోయాయి. అయినప్పటికీ పెద్ద కమతాల వారి కౌలు కమతాల వైశాల్యం తగ్గిపోయింది.

వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొన్నప్పుడు భారతదేశంలో సాగు వినియోగానికి వున్న

| సంవత్సరం | మొత్తం | | సరాసరి పరిమాణం | కమతాల పంపిణీ (%) | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1000 కమతాలు | వైశాల్యం (హె) | | నామమాత్రం | చిన్న | మధ్యరకం | మధ్య | పెద్ద |
| 1970-71 | 71,011 | 162,178 | 2.3 | 51.0 | 18.9 | 15.0 | 11.2 | 3.9 |
| 1980-81 | 88,883 | 163,787 | 1.8 | 56.9 | 18.1 | 14.0 | 9.1 | 2.4 |
| 1990-91 | 106,638 | 165,507 | 1.6 | 59.4 | 18.8 | 13.1 | 7.1 | 1.6 |
| 2000-01 | 119,931 | 159,435 | 1.3 | 62.9 | 18.9 | 11.7 | 5.5 | 1.0 |
| 2005-05 | 129,222 | 158,323 | 1.2 | 64.8 | 18.5 | 10.9 | 4.9 | 0.8 |
| 2010-11 | 137,757 | 159,181 | 1.2 | 67.0 | 17.9 | 10.0 | 4.3 | 0.7 |

| సంవత్సరం | వినియోగంలో ఉన్న కమతాల వైశాల్యం పంపిణీ (%) | | | | |
|---|---|---|---|---|---|
| | నామ మాత్రం | చిన్న | చిన్న-మధ్యరకం | మధ్యరకం | పెద్ద |
| 1970-71 | 9.0 | 11.9 | 18.5 | 29.7 | 30.9 |
| 1980-81 | 12.0 | 14.1 | 21.2 | 29.6 | 23.0 |
| 1990-91 | 15.0 | 17.4 | 23.2 | 27.0 | 17.3 |
| 2000-01 | 18.7 | 20.2 | 24.0 | 24.0 | 13.2 |
| 2005-05 | 20.2 | 20.9 | 23.9 | 23.1 | 11.8 |
| 2010-11 | 22.2 | 22.1 | 23.6 | 21.2 | 10.9 |

**పట్టిక-2**

| సంవత్సరం | 1960-61 | 1970-71 | 1980-81 | 1991-92 | 2002-03 |
|---|---|---|---|---|---|
| వివరాలు | మొత్తంలో కౌలు చేసే కమతాల శాతం | | | | |
| నామమాత్రం | 24.1 | 27.0 | 14.4 | 9.3 | 9.8 |
| చిన్న | 25.1 | 27.8 | 17.9 | 14.9 | 10.7 |
| చిన్న-మధ్య రకం | 23.6 | 24.8 | 15.9 | 12.2 | 10.3 |
| మధ్య రకం | 20.5 | 20.0 | 14.5 | 13.1 | 7.8 |
| పెద్ద | 9.5 | 15.9 | 11.5 | 16.7 | 13.8 |
| అన్నీ కలిపి | 23.5 | 25.7 | 15.2 | 11.0 | 9.9 |
| వివరాలు | కౌలుదారుల చేతిలో గల కమతాల వైశాల్యం యొక్క శాతం | | | | |
| నామమాత్రం | 16.6 | 18.9 | 9.7 | 8.7 | 8.6 |
| చిన్న | 14.0 | 14.6 | 8.5 | 8.5 | 6.8 |
| చిన్న-మధ్యరకం | 11.7 | 11.7 | 7.3 | 7.4 | 6.3 |
| మధ్య రకం | 9.6 | 8.7 | 6.6 | 6.9 | 9.2 |
| పెద్ద | 8.3 | 5.9 | 5.3 | 11.4 | 6.1 |
| మొత్తం | 10.7 | 10.6 | 7.2 | 8.3 | 6.5 |

కమతాల పరిస్థితి, వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ పద్ధతిలో అభివృద్ధి చేయటానికి సహాయకర సాధనంగా లేదని స్పష్టమవుతోంది.

పెద్దగా శాస్త్రీయ సర్వేలు జరపనప్పటికీ గ్రామాలలో పనిచేస్తున్న మన కామ్రేడ్లు పెద్దగా పొందుతున్న అనుభవమేమంటే, పెద్ద కమతాల వారూ, వారి యొక్క సాగు భూమి వైశాల్యం చాలా మేరకు తగ్గిపోయినట్లు కనుగొంటున్నారు. సమస్య ఏమిటంటే, యీ వివరాల నుండి, ఫ్యూడల్ భూస్వామ్యం నశించి తొలగిపోయిందనీ, పెట్టుబడిదారీ విధానానికి దారి యిచ్చిందనీ, చాలా మంది నిర్దిష్టమైన పరిస్థితి యొక్క సంక్లిష్టతను అర్థం చేసుకోకుండా, నిర్ధారణలు చేస్తున్నారు. మనదేశపు వ్యవసాయ ప్రక్రియలోకి, భారీ ఎత్తున సామ్రాజ్యవాద బడా బూర్జువా పెట్టుబడిని చొరబాటు చేయటం వలన యీ సంక్లిష్టత తలెత్తింది. వ్యవసాయక రంగంలో వాస్తవంగా ఏం జరుగుతోందో? చర్చించి అర్థం చేసుకోవటానికి ముందు మనం పరిస్థితిని అర్థం చేసుకోకుండా తరచుగా గందరగోళపరుస్తున్న కొన్ని తప్పుడు అవగాహనలను గురించిన స్పష్టతను ఏర్పరచుకుందాం.

**పెట్టుబడిదారీ మూలకాలకూ, పెట్టుబడిదారీ వ్యవసాయానికీ మధ్య వేర్పాటును (తేడాను విభజించటం) చేయటం:**

ఉత్పత్తులను అమ్మకపు సరుకుగా మార్చటం, యంత్రాలను ఉపయోగించటం, కౌలుదారీ శాతాన్ని, వైశాల్యపు రేట్లను తగ్గించటం, ఆఖరికి వ్యవసాయ కూలీల సంఖ్య పెరగటంలాంటి పెట్టుబడిదారీ మూలకాలు ఒక్కసారిగా ప్రస్తుతం భారీ ఎత్తున ప్రవేశించాయన్న దానిలో సందేహం లేదు. అయినప్పటికీ కేవలం కొద్ది అంశాల్లో (కేసుల్లో) తప్ప (వీటిని గురించి కూడా మనం చర్చించాల్సి వుంది.) ఉత్పత్తి విధానం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కాదు. ఒకదాని తర్వాత ఒక దానిని తీసుకొందాం!

ఎవరో ఒకరు వేరుశెనగలాంటి అమ్మకపు సరుకును ఉత్పత్తి చేసి, మార్కెట్టుల్లో అమ్మి కొంత డబ్బును పొందుతాడు. సాధారణంగా యిలా చేయటాన్నే మనం చూస్తున్నాం. అతడు అమ్మగా వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని, ముందుగా కుటుంబపు ఖర్చుల కోసం, వచ్చే ఏడాది సాగు ఖర్చుల కోసం వుంచుకొంటాడు. తర్వాత ఒక పథకం ప్రకారం, వివేకంతో డబ్బును మొబైల్ ఫోన్, ఎల్ఇడి టి.వి, మోటార్ బైక్, ఆభరణాలను, ఎయిర్ కండిషన్ లాంటి వాటిని కొనుక్కోవటానికి ఖర్చుపెడతాడు. ఇంకా అదనంగా డబ్బు మిగిలి వుంటే, ఆనక పిల్లల చదువు, తదితర అవసరాల కోసం దానిని బ్యాంకులో దాచుకొంటాడు. అంటే ఉత్పత్తి చేయబడ్డ అమ్మకపు సరుకు, మరొక లేదా మరికొన్ని అమ్మకపు సరుకులతో మార్పిడి చేసుకోవటం కోసం ఉత్పత్తి చేయబడిందే తప్ప, పెట్టుబడిని విస్తరింపచేయటానికి కాదు.

మార్క్స్ చాలా వివరాలతో “అమ్మకపు సరుకుల యొక్క పూర్ణపరివర్తన” (మెటా మార్ఫోసిస్) అన్న విషయాన్ని గురించి పెట్టుబడి గ్రంథంలో వివరించాడు. ఆ వివరణను గురించి తెలుసుకొందాం:

మనం ఇప్పుడు ఒక అమ్మకపు సరుకు యజమాని ఉదాహరణకు లినెన్ బట్టలను మార్కెట్టుకు తీసుకువెడ్తున్న నేతగాని వెనకవెళ్దాం. అతడి 20 గజాల లినెన్‌కు ఖచ్చితమైన ధర వుంది. అది 2 పౌండ్లు. అతడు ఆ లినెన్ బట్టను రెండు పౌండ్లకు మార్పిడి చేస్తాడు. అతడు పాతకాలపు బుద్ధిమంతుడులా ఆ రెండు పౌండ్లను అదే ధరగల ఒక బైబిల్‌ను కొనుక్కోవటం ద్వారా యిచ్చివేస్తాడు. అతడి దృష్టిలో కేవలం ఒక అమ్మకపు సరుకుగా వున్న లినెన్ బట్ట-నిల్వ చేసే విలువగల సరుకును అతడు బంగారంతో మార్పిడికోసం పరాధీనం చేస్తాడు. ఆ బంగారం (రెండు పౌండ్లు) లినెన్ బట్ట యొక్క విలువ రూపంలో వుంది. తిరిగి అతడు ఆ విలువ రూపంతో మరొక సరుకును కొనుగోలుచేసి విడిపోతాడు. బైబిల్‌ను కొనుక్కొంటాడు. ఆ బైబిలు అతడికి ఒక ఉపయోగకరమైన వస్తువుగా అతడితో అతడి యింటిలో ప్రవేశించి, ఆ యింటిలోని వారికి ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుంది. మార్పిడి అన్నది రెండు పూర్ణపరివర్తనల అనంతరం సాధించబడిన ఒక వాస్తవం. రెండు విరుద్ధమయిన, అయినా ఒకదానికి ఒకటి పూర్వకపూరమయిన లక్షణాలు గలిగి వుండిన రెండు పూర్ణ పరివర్తనలతో, వస్తువు డబ్బుగా మార్పుచెంది, తిరిగి ఆ డబ్బు మరొక సరుకుగా మార్పు చెందింది. పూర్ణ పరివర్తనల యొక్క రెండు దశలూ, రెండు భిన్నమైన లావాదేవీలు-అంటే బట్టను నేయటం-అమ్మకం లేదా ఒక సరుకు కోసం డబ్బును మార్పిడి చేయటం, కొనటం, లేదా డబ్బును ఒక సరుకు కోసం మార్పిడి చేయటం, యీ రెండు చర్యల ఏకత్వం - కొనుగోలు చేయటం కోసం - అమ్మటం.

ఈ మొత్తం లావాదేవీ యొక్క ఫలితం- నేతగాని వైపు నుంచి చూస్తే- అతడు తన అధీనంలో లినెన్ బట్టను వుంచుకోవటానికి బదులు బైబిల్‌ను కలిగి వున్నాడు. అసలైన సరకు బదులు అతడు ఇప్పుడు అదే సమాన విలువగల, వేరొక ఉపయోగం గల సరకును కలిగి వున్నాడు”. (పెట్టుబడి గ్రంథం, వాల్యూం-1, పేజీ 107).

తన వేరుశెనగకు బదులుగా అతడు మరొక ఉత్పత్తి సాధనాన్ని కొనుగోలు చేయవచ్చు కదా? అని కొందరు వాదించవచ్చును. అందుకు మార్క్స్, జవాబును సిద్ధం చేసి వుంచాడు:

“అదే విధంగా అతడు తన యితర జీవనోపాధి, ఉత్పత్తి సాధనాన్ని సేకరించుకో వచ్చును. అతడి దృష్టి ప్రకారం, యీ మొత్తం ప్రక్రియ అంతా తాను తన శ్రమతో ఉత్పత్తి చేసిన సరుకును, మరొకరి శ్రమతో ఉత్పత్తి చేయబడ్డ సరుకుతో మార్చుకోవటం తప్ప, మరి అంతకన్నా ఏమీలేదు. అది ఉత్పత్తులను మార్పిడి చేసుకోవటం తప్ప అతడికి మరేమీ కాదు” (పెట్టుబడి గ్రంథం, వాల్యూం-1, పేజీ-107).

ఇప్పుడు కూడా కొందరు, పై ఉదాహరణలో అమ్మకందారుడు, సరుకు ఉత్పత్తి దారుడే, కానీ మేము మాట్లాడుతున్నది భూమి యొక్క స్వంతదారుడు గురించి అని వాదించవచ్చును. కానీ చాలా తక్కువ సంఖ్యలో వున్న ప్రత్యేకమైన భూ స్వంతదారులు తప్ప అమ్మకపు సరుకు, యితర సరుకులతో మార్పిడి చేసుకోవటానికి ఉపయోగింపబడుతుంది; ఆఖరుకు ఉత్పత్తి సాధనాల విషయంలో సహా.

అమ్మకపు సరుకుల ఉత్పత్తి, ఒక పెట్టుబడిదారీ మూలకమే అయినా, దానికదే పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రాతినిధ్యం వహించదు.

ఇప్పుడు యంత్రాలను ఉపయోగించటం అనే అంశం తలెత్తుతుంది. పెట్టుబడిదారీ అమ్మకపు సరకుల ఉత్పత్తి అన్నదానికి అర్థం, సృష్టింపబడ్డ అదనపు విలువను పెట్టుబడి విస్తరణ కోసం ఉపయోగించటం. కానీ భారత దేశపు దృశ్య నేపథ్యంలో, ఒకవేళ భూ స్వంతదారుడు, అదనపు విలువను ఉపయోగించి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా ఒక పెట్టుబడిదారీ భూస్వామిగా మారిపోదామను కొన్నప్పటికీ అతడు గందరగోళం- అయోమయ పరిస్థితిలోకి పడిపోతాడు. యంత్రాలను ఉపయోగించాలంటే అతడు తన భూమిని విస్తరించు కోవాలి. అదేవిధంగా కూలీలను మరింతగా దోపిడీ చేసుకోవాలి. కానీ యిది సాధ్యంగాదు. అందువలన అతడి యంత్రాలు అదనపు విలువను పూర్తిగా మరెంత మాత్రమూ దోపిడీ చేయలేవు. కానీ వాటిని సంపదగా ఉపయోగిస్తూ, అద్దెకు యిస్తూ మరింత డబ్బును సంపాదించటానికి ఉపయోగించబడతాయి.

కానీ గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు లాంటి ఉత్పాదకాలను అమ్మటం, పంపుసెట్లను, ట్రాక్టర్లను, పంటకోత యంత్రాలను అద్దెకు యివ్వటం, వ్యవసాయిక

**పట్టిక-3**

| సంవత్సరం | 1951 | 1961 | 1971 | 1981 | 1991 | 2001 | 2011 |
|---|---|---|---|---|---|---|---|
| మొత్తం జనాభా (కోట్లలో) | 36.11 | 43.92 | 54.82 | 68.33 | 84.34 | 102.87 | 121.06 |
| రైతులు (కోట్లలో) (మొత్తం వ్యవసాయం జనాభాలో శాతం) | 6.99 (71.9) | 9.96 (75.9) | 7.82 (62.2) | 9.25 (62.5) | 11.07 (59.7) | 12.73 (54.4) | 11.87 (45.1) |
| వ్యవసాయ కూలీలు (కోట్లలో) (వ్యవసాయ జనాభాలో వారి శాతం) | 2.73 (28) | 3.15 (24) | 4.75 (37.7) | 5.55 (37.5) | 7.46 (40.2) | 10.68 (45.6) | 14.43 (54.8) |
| వ్యవసాయంలో జీవనోపాధి పొందుతున్న వారు (కోట్లలో) | 9.72 | 13.11 | 12.57 | 14.80 | 18.53 | 23.41 | 26.30 |
| మొత్తం జనాభాలో వ్యవసాయంలో ఉపాధి పొందుతున్న వారి నిష్పత్తి | 26.90 | 29.80 | 22.90 | 21.60 | 21.90 | 22.70 | 21.70 |

**మూలం :** జనాభా లెక్కలు -2011, భారత ప్రభుత్వం

ఉత్పత్తులను కొనుగోలు చేయటం లాంటి వ్యాపారం చేసే ఒక తరగతి ప్రత్యక్షమయింది. ఈ తరగతి నిజంగానే సామ్రాజ్యవాద బడా పెట్టుబడికి మధ్యవర్తిగా (దళారులు) సమర్థవంతమైన సేవలు అందించగల వర్గం.

అయితే ఇప్పుడు వేధించే మరో ప్రశ్న తలెత్తుతుంది. అదే పెరుగుతున్న వ్యవసాయ కూలీల సంఖ్యను గురించి.

**పై పట్టిక** నుండి రెండు ముఖ్యమైన పరిశీలనలను గమనించవచ్చును.

మొదటిది: కొంచెం హెచ్చుతగ్గుల తేడాతో రైతుల శాతం తగ్గిపోయింది. 1951లో 6.99 కోట్ల నుండి 2011 నాటికి రైతుల సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగినా, మొత్తం వ్యవసాయిక జనాభాలో వారి శాతం 71.9% నుండి 45%కు (అదే కాలంతో) తగ్గిపోయింది. దీనర్థం వ్యవసాయేతరమైన పరిశ్రమలు, సర్వీసు (సేవా) ఉద్యోగాలు, పట్టణాల్లో - నగరాల్లో తక్కువ వేతనం యిచ్చే ఉద్యోగాలకు, యీ తగ్గిన శాతం మళ్ళింది.

రెండవది: వ్యవసాయ కూలీల సంఖ్య శాతం మొత్తం వ్యవసాయిక జనాభా, వాస్తవ జనాభాలో కూడా మొత్తం జనాభా పెరుగుదల కన్నా కొంచెం ఎక్కువ నిష్పత్తిలో పెరిగింది. దీన్ని బట్టి, మొత్తం వ్యవసాయిక జనాభా కన్నా వ్యవసాయ కూలీల శాతం పెరిగినప్పటికీ దీన్నిబట్టి, వ్యవసాయంలో పెట్టుబడిదారీ ప్రక్రియ అన్నదానికి నేరుగా జోడించకూడదు.

ఈ సందర్భంలో మరో విషయాన్ని కూడా గమనించగలం: 1971 నుండి 1991 కాలం మధ్య పెట్టుబడిదారీ మూలకాలు భారీ ఎత్తున వ్యవసాయంలో చొరబడిన కాలంలో నిష్పత్తి తక్కువపాలులో పెరిగింది. తర్వాతి రెండు దశాబ్దాలలో నిష్పత్తి ఎక్కువ పాలుకు (స్కేల్‌కు) పెరిగింది. దీన్ని ఒకకాలంలో అదనంగా సంభవించిన రెండు కారణాలు వివరించ వచ్చును. మొదటి కారణం, ఇదే ప్రధానమైన కారణం కూడా. నిర్ధనులు-నిరాస్తి పరులు-దరిద్రులుగా చేయబడ్డ పేదరైతులు వ్యవసాయ కూలీలుగా మార్చబడటం. కాలక్రమేణా తక్కువ భూములు, భూములు లేని పేద రైతు కుటుంబాలు పెరగటంతోపాటు ఆ కుటుంబాల లోని యువ జనాభా పెరగటం వలన వ్యవసాయ కూలీల సంఖ్య కూడా పెరగటం అన్నది రెండవ కారణం. అంతే కాక ఉద్యోగ అవకాశాలు లేనందువలన దళిత ముస్లిం కుటుంబాల యువకుల, వ్యవసాయ కూలీల సంఖ్య పెరగటానికి మరో కారణం. దీనికి తోడు ట్రాక్టర్లు, కోత యంత్రాలు లాంటి యంత్రాలను ప్రవేశపెట్టడం అన్నది ఉద్యోగ అవకాశాలు లేకుండా వుండటానికి కారణమయ్యాయి. ఇది ఖచ్చితంగా తల్లక్రిందుల అభివృద్ధే! అంతేకాక వ్యవసాయ కూలీలు, పెట్టుబడిదారీ విధాన కార్మికుల మాదిరిగా పనిచేయట్లేదు. చాలా సందర్భాలలో వారు, జీవన స్థాయికన్నా అతి తక్కువ కూలీతో సీజనల్ కార్మికులుగా నియమించబడుతున్నారు.

## అసలు వాస్తవంగా ఏం జరుగుతోంది:

ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి, బ్రిటిష్ పరిపాలనా కాలం నుండే చరిత్రను సంక్షిప్తంగా చూడాల్సి వుంది.

బ్రిటిష్ వలసవాదులు, యితర వలస దేశాలను పరిగణించిన మాదిరిగానే, భారత దేశాన్ని ముడిపదార్థాల, చౌక కార్మికుల వనరులుగా పరిగణించారు. వాళ్ళు భారతదేశం లాంటి మరికొన్ని దేశాలను తాము పూర్తిగా తయారుచేసిన వస్తువుకు మార్కెట్టులుగా కూడా వాడుకొన్నారు. ప్రత్యేకించి భారతదేశం విషయంలో వలస పాలకులు, బలవంతులైన శక్తివంతమైన అగ్రవర్ణ శ్రేణుల ఆస్తుల యొక్క మూలాలను బ్రిటిష్ రాజుకు దగ్గరగా తీసుకురాగలిగితే, తాము భారతదేశంలోని కుల-ఆధారిత సమాజాన్ని సునాయాసంగా పాలించగలమని కనుగొన్నారు. అంతే కాకుండా వాళ్ళు ఒక పథకంతో, భారతదేశంలో గల రెండు పెద్ద మత సమాజాల మధ్య వైరం లేవనెత్తారు. తమ పాలనావిధానంలో భాగంగా వారు శాశ్వత పరిష్కారం, రైత్వారీ- మహల్వారీ విధానాల ద్వారా ఒక కొత్త తరహా ఫ్యూడల్ దొరలను అభివృద్ధి చేశారు. దీనిని మార్క్స్ యీ విధంగా వివరించారు.

"బెంగాల్‌లో వాళ్ళు పెద్ద ఇంగ్లీషు భూఎస్టేట్ల యొక్క వికృత రూపం లాంటి ఎస్టేట్లు సాగించారు. ఆగ్నేయ భారతదేశంలో వికృత రూపంలో చిన్న భాగాలుగా విభజించి బంగీగా

కట్టిన ఆస్తులను సాగించారు. నైరుతి ప్రాంతంలో భారత ఆర్థిక సమాజాన్ని భూమి అంతటిపై సమిష్టి యాజమాన్యం వుండే దాన్ని వికృత రూపంగా వుంచేందుకు చేయగలిగినదంతా చేశారు. (పెట్టుబడి, వాల్యూం-111, పేజీ-334లోని ఫుట్‌నోట్).

ఇటువంటి ఏర్పాటు చేయటం ద్వారా బ్రిటిష్ వారు రాజకీయంగానూ, ఆర్థికంగానూ కూడా భారీ ఎత్తున డివిడెండ్లను పెంచుకొన్నారు.

ఇందువలన వారు పెద్ద మొత్తాల్లో రెవెన్యూను ప్రోగు చేసుకోవటంతోపాటు, ముడిసరుకు యొక్క చౌకపాటి వనరులను, చౌక కార్మిక వనరులను తమ అధీనంలోకి తెచ్చుకొన్నారు. రాజకీయంగా అగ్రకులాల భూస్వాములు, బ్రిటిష్ పాలనకు వ్యక్తం అయ్యే ఏ రకమైన వ్యతిరేకతనైనా అణచిపెట్టడానికి బ్రిటిష్‌వారి పక్షం తీసుకొన్నారు. బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన, అణగద్రొక్కబడిన ప్రజానీకపు తిరుగుబాట్లను అణిచివేయటంలో బ్రిటిష్‌వారి వైపున నిలిచారు. ఉదాహరణకు బీర్భూమ్‌లోని హేతాంపూర్ జమీందార్ అయిన- శాశ్వత పరిష్కారపు భూస్వామికి తన ప్రాంతంలోని సంతాల్ తిరుగుబాటును చితక కొట్టి నలిపివేయటానికి అవసరమైన సైన్యాన్ని తయారుచేసి యిచ్చినందుకుగాను రాజు అనే బిరుదును బ్రిటిష్ వారు ప్రదానం చేశారు. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆ సైన్యంలోని సైనికులలో ఎక్కువ మంది క్షత్రియుల్లో క్రింది స్థాయి శాఖకు చెందిన బీహార్‌కు చెందిన ఛేత్రి కులస్థులు. వారికి ఆ జమీందారు యొక్క ఎస్టేట్ల (ప్రస్తుతం జార్ఖండ్‌లో వున్నాయి) సరిహద్దుల్లో భూములను బహుమతిగా (ఈనాం) యిచ్చారు. అగ్రకులాలకు చెందిన మేధావులు సంతాల్ తిరుగుబాటు విషయంలో మౌనం గానూ, మొదటి స్వాతంత్ర్య యుద్ధాన్ని (సిపాయిల తిరుగుబాటుగా పేర్కొనబడటం) వ్యతిరేకించారు అన్నది ఆసక్తికరమైన విషయం. నీలి మందు తోటల్లో జరిగిన తిరుగుబాటు, రైతులకు, మధ్యవర్తులకు మధ్య జరిగిన తిరుగుబాటు. ఈ సందర్భంలో జమీందారులు ఉదాసీనంగా వున్నారు.

ఈరకంగా కొల్లగొట్టుకోవడాలు, ఇంగ్లండు లోని పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాద దశకు అభివృద్ధి చేసేందుకు బ్రిటిష్ వారికి దోహదపడ్డాయి. సామ్రాజ్యవాద దశ ఎంతగా అభివృద్ధి చెందితే, పూర్తిచేసిన వస్తువులను (తయారైన వస్తువులను) ద్రవ్యపెట్టుబడిని అంత ఎక్కువ మేరకు ఎగుమతి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ పరిస్థితిలో బ్రిటిష్‌వారు ఒకసారి రెండు చర్యలను తీసుకొన్నారు. ముందుగా (మొదటిగా) వారు నేరుగా భారతదేశంలో పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. అంతకు ముందు కాలంలో వారి పెట్టుబడులు ఎక్కువ మేరకు ట్రేడింగ్ ఏజెన్సీలలో పెట్టుబడిగా వుండేది. రెండవది, భారతదేశంలో వలస పాలకులతో తమ వ్యాపారాన్ని విస్తరించు కోవటం కోసం, కుమ్మక్కై సయోధ్యలో వున్న భారతీయ వాణిజ్య వ్యాపారస్తులను, వలస పాలకులు పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టడానికి అనుమతించారు. బ్రిటిష్ వారు వారికి నిధులను బ్యాంకుల నుండి యిప్పించడటమేకాక, సాంకేతికతను, తాము విడిచిపెట్టిన పరిశ్రమలను భారతదేశపు వ్యాపారస్తులకు అమ్మటంలోనూ సహాయపడ్డారు. ఉదాహరణకు, టాటాలు బ్రిటిష్ వారికి, చైనాతో జరిపే నల్లమందు వ్యాపారంలో ఏజెంట్లు. వారు బొంబాయిలో జౌళి పరిశ్రమను ప్రారంభించారు. భారతదేశంలో 1947 పూర్వం నుండి 1947 అనంతరం కాలంలో చిరిగిన బట్టల్లో వున్న వారు, సంపన్నులుగా మారారని చెప్పే బడా పెట్టుబడి యొక్క విజయ గాథలన్నింటి వెనుక వున్న వాస్తవం యిదే! ఇదీ బడా పెట్టుబడి యొక్క పుట్టుకకు మూలం. ఇంకా అదే దళారీ (పెట్టుబడి) లక్షణాలతో యిప్పుడూ కొనసాగుతోంది.

సమాజం యొక్క ఫ్యూడల్ స్వభావం, ముడిపదార్థాలపైనా, చౌక శ్రమశక్తి పైనా సామ్రాజ్యవాదం అదుపును పొందటానికి దోహదపడటమే కాకుండా విభిన్న కులాల, సమాజాల మధ్య వైరాన్ని లేవదీసి (అడ్డుపుల్లలు చేయటం ద్వారా) తన యొక్క విభజించు - పాలించు అనే సామ్రాజ్యవాద విధానంతో పరిపాలన సాగించటానికి కూడా దోహదపడింది. అది దేశీయ పెట్టుబడి అభివృద్ధి చెందకుండాను, స్వతంత్రమైన జ్ఞానం (దేశీయ) అభివృద్ధి చెందకుండానూ ధ్వంసం చేసింది. బ్రిటిష్ వారి చేత సృష్టింపబడిన భారతీయ ఫ్యూడలిజం ఆరకంగా సామ్రాజ్యవాదం యొక్క ముఖ్యమైన ప్రధాన ఆధారంగా, భారతదేశపు సమాజాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా సామ్రాజ్యవాదపు ఉక్కుపాదాల క్రింద అణచిపెట్టి వుంచడానికి అనువుగా అభివృద్ధి చేయబడింది.

కాలక్రమంలో గ్రామీణ ప్రజాబాహుళ్యం ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లను ప్రారంభించారు. సామ్రాజ్యవాదం ఎల్లప్పుడూ ఫ్యూడల్ వర్గానికి సహాయంగా వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత, ప్రత్యేకించి 1930ల కాలంలో బ్రిటిష్‌వారు భారతదేశంలో కొన్ని ప్రాథమిక పరిశ్రమలను సామ్రాజ్యవాదుల పర్యవేక్షణ క్రిందనే అభివృద్ధి పరచాల్సిన అవసరాన్ని భావించారు. అయితే ఫ్యూడల్ బంధనం (బానిసత్వం) అందుకు ఆటంకంగా (అవరోధంగా)వుంది. అందువలన సామ్రాజ్య వాదానికి ఫ్యూడలిజంలో కొన్ని సంస్కరణలు జరపాల్సిన అవసరం ఏర్పడింది. ఫ్లడ్ కమీషన్ నివేదిక, జమీందారీ వ్యవస్థలో కొన్ని జరపాల్సిన మార్పులను గురించి సలహా యిచ్చింది. కానీ ఆ సలహాలను చట్టం చేయటానికి ముందుగా రెండవ ప్రపంచ యుద్ధం రావటంతో, సామ్రాజ్యవాదం తన యొక్క విధానాన్ని మార్చుకోవలసి వచ్చింది. అందువలన 15 ఆగస్టు 1947 అనంతరం, సామ్రాజ్యవాదం తన యొక్క పరిపాలన రూపాన్ని మార్చివేసింది. ప్రత్యక్ష, వలసపాలనకు బదులుగా వారు పరోక్ష పద్ధతిలో నయావలస పద్ధతిలో పరిపాలన సాగించేందుకు ఎంచుకొన్నారు. పరిస్థితిని తమకు అనుకూలంగా తీసుకొన్న అమెరికా లాంటి యితర సామ్రాజ్యవాదశక్తులు యీ దోపిడీ సొమ్ములో వాటాను పొందటం కోసం ప్రయత్నించటం ప్రారంభించారు. అది ప్రాముఖ్యంగల, మహత్తరమైన రైతాంగ ఉద్యమాలు సాగుతున్న (దేశంలో) కాలం. పున్నప్ర వయలార్ రైతులు ఫ్యూడలిజంతో పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారు. తూర్పున తె.భా.గా. ఉద్యమం భూస్వాముల గుండెల్లో భయాన్ని నింపుతోంది. కయ్యూరు వీరులు ధైర్యంగా ఉరికంబాలను ఎదుర్కొంటున్నారు. వీటన్నింటికీ పైగా మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం, పాలకుల పునాదులనే కుదిపివేస్తోంది. అందువలన 1947 తర్వాత పాలకుల యొక్క అతి ముఖ్యమైన కర్తవ్యం రైతాంగ పోరాటాలను అణచివేయటం అయింది. కానీ వారు తమ పాలనను కొనసాగించటం కోసం జమీందారీ వ్యవస్థను రద్దు చేస్తున్న చట్టం చేశారు.

మరణావస్థలో వున్న పెట్టుబడిదారీ విధానంగా వున్న సామ్రాజ్యవాదం, ఒక సంక్షోభం తర్వాత మరొక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1960ల జమీందారీ రద్దు, సీలింగ్ చట్టాలు చేయటానికి ముందు, "తుడిచివేత-నిలుపుదల" అనే విధానాన్ని కొనసాగించవలసి వచ్చింది. కానీ, సామ్రాజ్య వాదులకు యిప్పుడు తమ సంక్షోభం నుండి బయటపడటానికి వ్యవసాయ రంగంలోని విధానాలను మార్పు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇంత వరకు వారు వ్యవసాయ రంగాన్ని ముడిపదార్థాలను, కార్మికులను యిచ్చే చౌకైన వనరుగా వాడుకొన్నారు. అయితే పెట్రో రసాయనాల పరిశ్రమ అభివృద్ధి చెందటంతో వారు, అగ్రి-బిజినెస్‌లోని ఉత్పత్తిపై ఒక సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. వారికి వారి

ఎరువులు, పురుగుల మందులు, పంపుసెట్లు, అధిక పంటలనిచ్చే విత్తనాలు తదితరాలకు మార్కెట్టు అవసరమైంది. అటువంటి మార్కెట్టును సృష్టించటం కోసం వారు కొన్ని "సాంద్ర ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు (ఐ.ఎ.డి.పి)లనే పైలట్ ప్రాజెక్టులను పశ్చిమబెంగాల్ బర్ధమాన్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా - గోదావరి బేసిన్ తమిళనాడులోని కావేరీ బేసిన్ మొదలైన కొన్ని ప్రాంతాలలో ప్రారంభించారు. కానీ ఫ్యూడల్ లక్షణాలున్న భూస్వంతదారులు పంట దిగుబడిని పెంచటం పట్ల పెద్దగా ఆసక్తిని చూపించలేదు. 1965,1966లలో పంటలు విఫలమయ్యాయి (తగ్గిపోయాయి). ప్రభుత్వానికి పంటల అధిక దిగుబడి అవసరమయింది. అందువలన వారు మరొకసారి సీలింగ్ చట్టాలు, బార్గదారీ హక్కుల చట్టాలు లాంటివి చేశారు. ఇది సామ్రాజ్యవాద చిల్లర వర్తకులు (కాలినడక బేరగాళ్ళు) ఒకవైపు ఫ్యూడలిజాన్ని బలహీనపరుస్తూనే మరొకవైపు ఫ్యూడలిజాన్ని శాశ్వతంగా నిలబెట్టేందుకు అవలంబించిన "తుడిచివేత - నిలుపుదల విధానం". భూస్వామి ఎటువంటి శ్రమ చేయకుండా ఎటువంటి ఖర్చు పెట్టకుండా ఉత్పత్తిలో గణనీయమైన వాటాను పొందుతాడు, అదేసమయంలో అతడు బార్గదార్ (కౌలురైతు)ను తన యిష్టానుసారం, భూమినుండి తొలగించ లేడు. బార్గదారీ తాను పండించిన (కౌలు దారులు) చిన్న రైతులు తమ దిగుబడులను, అధిక దిగుబడి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల, సాగునీటిని ఉపయోగించటం ద్వారా పెంచుకోవటానికి ప్రయత్నిస్తారు. ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు మినీకిట్ల రూపంలో పంపకం చేయబడ్డాయి. తర్వాత కాలంలో వాటిని కొనుగోలు చేసుకోవటానికి, పంపుసెట్లు కొనుక్కోవటానికి బ్యాంకులోన్లు, భూమిని హామీ పెట్టడం ద్వారా యిచ్చే విధంగా ఏర్పాటు చేయబడింది. ఇప్పుడు భూమిని హామీ పెట్టడం ద్వారా ఆఖరుకు ట్రాక్టర్లు కొనుక్కోవటానికి కూడా అప్పు యిచ్చే ఏర్పాటు చేయబడింది. వింతగా దీనినే, భూసంస్కరణల వైపు వేసిన ముందడుగుగా అభివర్ణిస్తున్నారు. కానీ ప్రధానంగా సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, వ్యవసాయరంగంలో పంపుసెట్లకు, ఎరువులకు, పురుగుల మందులకు మార్కెట్టులను యిది (ఈ విధానం) విస్తరింపజేసింది.

ఈ విధానం, మొదటి రోజుల్లో, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో పంపుసెట్లు ద్వారా రెండు పంటల పద్ధతి విస్తరించటం వలన, ఉపాధి అవకాశాలు కొంత పెరిగాయి. కానీ పవర్ టిల్లర్లు (పవర్ నాగళ్ళు), ట్రాక్టర్లు, కోత యంత్రాలు ప్రవేశపెట్టబడంతో పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు నిరుద్యోగులై, లేబరు మార్కెట్టును ముంచెత్తి, శ్రమశక్తి యొక్క ధరను, మార్పిడి విలువ కన్నా తక్కువకు దింపివేశారు. ఉత్పత్తి విధానంలో పెద్దగా మార్పు జరుగకుండానే యిది జరిగింది. ఇలా అదనంగా తయారైన కూలీలే వలస కార్మికులుగా మారి దేశమంతటా అడ్డదిడ్డంగా తిరుగుతున్నారు. మోడీ విధించిన లాక్‌డౌన్ కాలంలో వీరి దుస్థితి మరింతగా మారి మనకు గోచరించింది.

సామ్రాజ్యవాద విధానం ఏమిటంటే, భూమిని పెట్టుబడిగా వాడుకోలేనంత మేరకు ఫ్యూడలిజాన్ని శాశ్వతం చేయటం. సీలింగ్ విధానం ద్వారా యిది చాలా మేరకు జరిగింది. అలాగని ఏ మార్పూ జరగలేనదనటం కొంటెతన మవుతుంది. అధిక దిగుబడి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, పంపుసెట్లు, ట్రాక్టర్లు మొదలైనవి ప్రవేశపెట్టడం ద్వారా, భారీఎత్తున వ్యవసాయక అదనపు విలువను పిండుకోవటానికి పూచీ చేకూర్చబడింది. అంతేకాక ఎప్పుడైతే భూస్వంతదారుడు వ్యవసాయాన్ని ఒక పెట్టుబడిదారీ పద్ధతిలో విస్తరింపజేయలేక పోతాడో, అప్పుడు అతడు మార్పిడి (పంటను)చేసుకోవటంకోసం మార్కెట్టుకు వెళ్తాడు. తన పెట్టుబడిని విస్తరించటానికి నిర్దిష్టమయిన, గట్టి విధానం లేకపోవటంతో తన పెట్టుబడిని కొన్ని అనుత్పాదక రంగాల్లో అద్దెకు తిప్పటం కోసం ట్రాక్టరు కొనుగోలు చేయటం కోసమో లేదా ఒక షాపును తెరవటం లాంటి వాటికోసమో వెచ్చిస్తాడు. కొంత మొత్తాన్ని బ్యాంకుల్లో గానీ తదితర సాధనాల్లో గానీ మదుపుపెడ్తాడు. ఆ రకంగా పెట్టుబడి విస్తరణ కోసం కాక, పెట్టిన పెట్టుబడులను వ్యాపార పెట్టుబడి, వడ్డీకోసం పెట్టుబడి అని పిలుస్తారు. సామ్రాజ్యవాద యుగంలో యీ రకమైన పెట్టుబడులు సామ్రాజ్యవాద పెట్టుబడికి, దానియొక్క వస్తువులు మార్కెట్టులో విస్తరించటానికి, లేదా బ్యాంకుల్లో నిధులను పెంచటం ద్వారా సామ్రాజ్యవాదులూ, బడా బూర్జువాలు తమ పెట్టుబడి పునాదిని బ్యాంకు లోన్ల ద్వారా పెంచుకోవటానికి లేదా షేర్లను బ్యాంకుల ద్వారా అమ్మకోవటానికి దోహదం చేస్తాయి.

భారతదేశపు వ్యవసాయం పెట్టుబడిదారీ వ్యవసాయమా? కాదా? అన్న విషయాన్ని ముగించటానికి ముందు మార్క్స్ చెప్పిన యీ మాటలను మెదడులో పెట్టుకొందాం: "అసలు విలువపై పొందిన ప్రోత్సాహం లేదా అదనంగా పొందిన దానిని నేను 'అదనపు విలువ' అని పిలుస్తాను. అందువలన ముందుకు తీసుకు పోబడ్డ అసలు విలువ, చెలామణిలో కదలకుండా అక్కడే వుంటుంది. కానీ దానికి అదనపు విలువను కలుపుతుంది లేదా మనకు తాను విస్తరిస్తుంది. ఈ చలనమే దానిని పెట్టుబడిలోకి మార్చివేస్తుంది" (పెట్టుబడి వాల్యూం - 1 పేజీ.149)

ఇదీ 'పెట్టుబడి యొక్క స్వయం విస్తరణ' అని మార్క్స్ అన్నదాని యొక్క అర్థం. ఇది ఒక నిర్దిష్ట పద్ధతిలో పచ్చని చెట్లు పెరిగిన అడవి, అంతేకాని కొన్ని చెట్ల గుంపుతో కూడిన ఒకతోట కాదు.

**ముగింపు:**

అప్పుడు భారతదేశపు వ్యవసాయాన్ని ఏరకమైన లక్షణాలు గల దానిగా నిర్వచించాలి? మొదటిగా కేవలం ఒక కపటి మాత్రమే భారతదేశ వ్యవసాయంలో 1960ల నుండీ ఎటువంటి మార్పూ జరగలేదని చెప్పాడు. గ్రామీణ భారతదేశంలోని చిత్రం కేవలం రైతులను బలాత్కార పద్ధతుల్లో దోపిడీ చేసుకొంటున్న ఫ్యూడల్ భూస్వామ్య విధానంగా మాత్రమే లేదు. "తుడిచివేత - నిలిపివేత" ప్రక్రియను సీలింగ్ చట్టాలు, తదితర చర్యల ద్వారా సాగించటం వలన భారతదేశపు చిత్రం ఎక్కువ మేరకు మారిపోయింది. భూ యజమానులే, అదనపు విలువనంతటినీ తమ కోసం కాజేసుకోలేరు. అదే సమయంలో చాలా పెట్టుబడిదారీ మూలాలు మన వ్యవసాయిక వ్యవస్థలోకి చొప్పించబడ్డాయి. ఇందువలన భారీ మొత్తాల అదనపువిలువ సామ్రాజ్యవాదులు, బడా పెట్టుబడులకు పారుదల అవుతుంది.

ఆ రకంగా వ్యవసాయిక రంగంలో సృష్టింపబడిన అదనపు విలువను సామ్రాజ్య వాదం బడాపెట్టుబడి - భూయజమానుల కూటమి యొక్క కలయిక దోపిడీ చేసుకొంటుంది. చాలా తరచుగా ఎల్లప్పుడూ కాకుండా భూమి యొక్క స్వంత దారులు వ్యవసాయిక యంత్రాలైన పంపుసెట్లు, ట్రాక్టర్లు, కోత మిషన్లు మొదలైన వాటికి యజమానులవుతారు. సాధారణంగా ఆ యంత్ర పరికరాల స్వంతదారుల నుండి, భూమి స్వంతదారులు వాటిని అద్దెకు తెచ్చు కొంటారు. ఆ రకంగా అద్దెకు తీసుకొనప్పుడు అధిక విలువలో కొంత భాగం అద్దెకు యిచ్చినపుడు అధిక విలువలో కొంత భాగం లోపలకు వస్తుంది. భారతదేశ వ్యవసాయం యొక్క లక్షణాలను నిర్వచించే టప్పుడు యీ మౌలిక విషయాలను గుర్తుపెట్టుకోవాలి.

రెండవది: వ్యవసాయిక ఉత్పత్తి డబ్బుతో మార్పిడి చేయటంకోసం మార్కెట్టు చేయబడు తుంది. ఆ డబ్బు సాధారణంగా పెట్టుబడిని విస్తరించటం కోసం ఉపయోగించబడదు. కానీ

మార్పిడితో వస్తువులు కొనుగోలు చేయటానికి ఉపయోగించబడుతుంది. ఒకవేళ ఏదైనా కొంత భాగం కొన్ని ఉత్పత్తి సాధనాల కొనుగోలు కోసం ఉపయోగించబడినా, అది పెట్టుబడి విస్తరణకన్నా ఎలా భిన్నమైనదో యింతకు ముందే వివరించాము. కొత్త డబ్బు బ్యాంకుల్లో కానీ, ఫైనాన్సు సంస్థలో కానీ వడ్డీ కోసం మదుపు (డిపాజిట్)చేయబడివుండవచ్చును. పెట్టుబడిపై వచ్చే యీ వడ్డీ, పెట్టుబడిదారీతో పెట్టిన పెట్టుబడికి (ఇన్వెస్టమెంట్)కు పూర్తిగా భిన్నమైనది. బ్యాంకుల్లోనో లేదా యితర ఫైనాన్సు పథకాల్లోనో పెట్టేకంటే, డబ్బును సామ్రాజ్యవాదం, బడా పెట్టుబడులు తమ పెట్టుబడిని పెరుగుదల అయేందుకు ఉపయోగిస్తారు. ఈరకంగా ప్రధానంగా వారిచేత వ్యవసాయిక అదనపువిలువ కొల్లగొట్ట బడుతోంది.

మూడవది: వ్యవసాయక ఉత్పత్తి యొక్క ఉత్పత్తినీ, మార్కెటింగ్‌నూ అదుపు చేసేందుకు సామ్రాజ్యవాదం, బడా పెట్టుబడి చేసిన ప్రయత్నం యిప్పటికే పెరిగిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు విశాలమైన ప్రాంతాలను బడా పెట్టుబడికి కాంట్రాక్టు వ్యవసాయం చేసుకోవటం కోసం తమ యిష్టమైన పంటలు పండించుకోవటం కోసం, వారు ఎంచుకున్న బడా పెట్టుబడి అయిన పెప్సీకంపెనీ లాంటి వానికి అందజేశాయి. పెప్సీలాంటి ఈ బడాపెట్టుబడి కంపెనీలు, నీలిమందు తోటల యజమానుల్లా వ్యవహరిస్తున్నాయి. అది కొన్ని ఉత్పాదకాలను (పంట అవసరాలను) అందించి, ఉత్పత్తి ప్రక్రియపై ఎటువంటి ప్రభావం లేకుండా మొత్తం ఉత్పత్తినంతా తీసేసుకొంటున్నాయి. ఆ రకంగా పెట్టుబడిదారుల ప్రధానమైన కానీ పరోక్షమైన అదనపు విలువ యొక్క దోపిడీదారులుగా వున్నారు. కానీ అటువంటి ఒప్పందాల (లావాదేవీల) నుండి లాభాలను సంపాదించటం కోసం భూమి స్వంతదారులు కూలీలను వీలైనంత మేరకు పిండుకొంటారు. ఈరకంగా అదనపు ఆర్థిక బలవంతంపై ఆధారపడ్డ ఉత్పత్తి ప్రక్రియలో భూమి యొక్క స్వంత దారునికి స్వయంగా విస్తరించటానికి సాధ్యత లేదు కాబట్టి దీన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అని దాని లక్షణాలను నిర్వచించ కూడదు. ఎందుకంటే యిక్కడ వలసపాలకుల వలె బడాపెట్టుబడి ఫ్యూడల్ విధానాన్ని ఉపయోగించుకొంటున్నది కనుక!.

నాల్గవది: అక్కడక్కడ కొందరు భూమి స్వంతదారులు తప్పక భూమిని కౌలుకు తీసుకొని యంత్రాలను ఉపయోగించి, పెట్టుబడిదారీ పద్ధతిలో లెఖ్ఖలు వ్రాయటం తదితరాలు చేస్తూ పొలాల్లో పెట్టుబడిదారి వ్యవసాయాన్ని ప్రవేశపెడుతూ, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ తరచుగా వారు అధికారంలో వున్న శక్తుల నుండి కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారు తమ ఉత్పత్తులను తమ యిష్టానుసారం అమ్మలేరు. వాళ్ళ యొక్క ప్రయోజనాలకు విరుద్ధంగా ధరలు నియంత్రించబడుతున్నాయి. కరెంటుకు (విద్యుత్‌కు) ఇంధనం తదితరాలకు అపరిమిత ధరలు చెల్లించుతున్నారు. బడా పెట్టుబడిదారీ బేరగాళ్ళు ప్రభుత్వ యంత్రాంగపు కుమ్మక్కుతో తాము నిర్ణయించిన ధరలకే అమ్మాలని, మారకపు భూస్వంతదారులపైవత్తిడి చేస్తున్నారు. ఆరకంగా మార్కెట్టు ధరలు ఈ వ్యవసాయ పెట్టుబడిదారుల కోసమే కాకుండా సంపన్న, మధ్యతరగతి, పేదరైతుల కోసం కూడా తగ్గిస్తున్నారు. అందువల్లనే వ్యవసాయంపై సామ్రాజ్యవాద, బడా పెట్టుబడికిగల ఉడుం పట్టును వ్యతిరేకిస్తూ మండీల వ్యవస్థను, కనీస మద్ధతు ధరనూ డిమాండు చేస్తూ ప్రతిఘటన పెరుగుతోంది. ఆరకంగా కుట్రపూరిత పద్ధతుల్లో వ్యవసాయిక పెట్టుబడిదారులను బంధించటానికీ, బంధించబడిన వారిని బయటకు తీసుకురావటానికీ మధ్య ఒక పోరాటం అభివృద్ధి చెందుతోంది.

అందువలన, అదనపు విలువను ఉపయోగించుకొని "పెట్టుబడి యొక్క స్వయం విస్తరణ" అన్న విషయం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని నిర్వచించే లక్షణం అన్న విషయం పట్ల శ్రద్ద పెట్టకుండా (పట్టించుకోకుండా) ఉత్పత్తి విధానాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా నిర్వచించటానికి చేసే ఏ ప్రయత్నమైనా ఒక తప్పు మార్గిస్టు నిర్వచనం అవుతుంది. ఉత్పత్తిని అమ్మకపు సరకుగా మార్చటం, యంత్రాలను ఉపయోగించటం, వున్న వ్యవసాయ కూలీల సంఖ్య పెరిగిపోవటం, దానిని ఉపయోగించుకొన్న సామ్రాజ్యవాదులు దాని సహచరులు వ్యవసాయంపై వచ్చే అదనపు విలువలో ఒక భాగం అన్న లక్షణాలను, పెట్టుబడిదారీ విధానానికి రుజువులు అని చెప్పటం తప్పు అవుతుంది. అటువంటి తప్పులను తీవ్రంగా (గట్టిగా) కమ్యూనిస్టు విప్లవకారులు అనుసరించితే, అది వారిని షేక్స్పియర్ మేక్‌బెత్ నాటకంలో పాత్ర అయిన హేక్‌బెత్, మేక్‌డాఫ్ యొక్క సైనికదళాలు చెట్టు కొమ్మలను తమను కప్పుకొని దాచుకోవటానికి ఉపయోగించుకొని కదులుతూ వుండటాన్ని చూసి అడవి కదిలి వస్తోందని తప్పుగా అర్థం చేసుకొన్నట్లు, తప్పుచేయిస్తుంది.

## అటువంటప్పుడు ప్రస్తుత వ్యవసాయిక పరిస్థితి లక్షణాలను ఏవిధంగా మనం నిర్వచించాలి?

భూస్వామ్య విధానం గణనీయంగా బలహీనపడిందనీ మనుగడ కోసం అది సామ్రాజ్యవాద మరియు నిరంకుశ బడా పెట్టుబడితో మైత్రిని నెరపాల్సి వచ్చిందని స్పష్టమయింది. ఇది యిరువురికి అవసరమైన రెండు మార్గాల ప్రక్రియ. ఇప్పటి వరకూ మనం దీనిని, అర్ధ ఫ్యూడలిజంగా పిలుస్తున్నాము. సామ్రాజ్యవాద దశకంలో ఫ్యూడలిజం సామ్రాజ్యవాదంతో జత కట్టినందువలన అన్న అర్థంలో ఆ విధంగా పిలిచాము. ఇప్పుడు కూడా మనం అర్ధ ఫ్యూడలిజం అనే పిలువవచ్చును. ఈ పెట్టుబడిదారీ విధానానికి ముందటి నిర్మాణం, ఫ్యూడల్ సామాజిక సంబంధాలు ఖచ్చితమైన ఫ్యూడల్ ప్రత్యేకతలకు భిన్నమైనవైనప్పటికీ, సామ్రాజ్యవాదానికీ, దాని సహచర బృందానికీ గ్రామీణ వ్యవసాయరంగంలో ప్రధాన, ముఖ్య ఆధారంగా వున్నాయనే అర్థంలో అర్ధ ఫ్యూడలిజం అని పిలుస్తాము. దీని ద్వారానే సామ్రాజ్యవాదం, బడా పెట్టుబడులు, వ్యవసాయిక అదనపు విలువలో ఒక భాగాన్ని పిండుకోవటంతోపాటు, వారిని (ఫ్యూడల్ సామాజిక సంబంధాలను, ఫ్యూడల్ నిర్మాణాన్నీ) తమ మార్కెట్లకు దళారీలుగా (మధ్యవర్తులుగా) వాడుకొంటున్నారు. కానీ అర్ధ ఫ్యూడలిజం ఒక ఉత్పత్తి విధానమూ కాలేదు, పెట్టుబడిదారీ విధానానికి ముందుగా వుండే నిర్మాణమూ కాలేదు. అందువలన మనం, ఫ్యూడలిజం, సామ్రాజ్యవాద బడాపెట్టుబడులు రెండు కలసి సంయుక్తంగా అదనపు విలువను ఒక ప్రత్యేక కాలంలో పిండుకోవటం కొనసాగించటాన్ని ఫ్యూడల్ పద్ధతి ఉత్పత్తి విధానం అని పిలుస్తాం.

ఇది ప్రధాన వైరుధ్యానికి చెందిన మన యొక్క అభిప్రాయ అవగాహనకు, యిటీవలి కాలంలో రైతు పోరాట అనుభవానికి అనుగుణంగానే వుంది. భూమి కోసం గానీ, అడవి హక్కుల కోసం జరిగే పోరాటాలు యీ కలయికలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినదే. ఆఖరికి రైతుల అభివృద్ధి పేరిట జరిపే బలవంతపు తొలగింపులకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు కూడా, సాధారణంగా యీ ఫ్యూడల్ సెక్షన్ శతృవుల పక్షమే తీసుకొంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయిక విప్లవం యీ విషయాన్ని కూడా చేర్చుకోవాలి.

వ్యవసాయంలో సామ్రాజ్యవాద బడా పెట్టుబడి బంధనాలు అన్నింటినీ ధ్వంసం చేయాలి. దీనితోపాటు భూమిని, వ్యవసాయ యంత్రాలను స్వాధీనపరచుకొని రైతులకు పంపిణీ చేయాలి. ★

# 'అడవులనుండి ఆదివాసులను తరిమేసే 'విధ్వంసక అభివృద్ధిని' వ్యతిరేకిద్దాం'

## అఖిలభారత ఆదివాసీ సదస్సులో శ్రీకాంత్ మొహంతి ఉద్ఘాటన

**2023** మే 21న విశాఖపట్నంలో ఏఐకెఎమ్ఎస్ ఆధ్వర్యంలో అఖిలభారత ఆదివాసీ సదస్సు జరిగింది. 11 రాష్ట్రాల నుండి ఆదివాసీ ఉద్యమాలకు చెందిన 600 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

జార్ఖండ్‌కు చెందిన ప్రఖ్యాత ఆదివాసీ రచయిత, కార్యకర్త డా॥వాసవి కిరో ముఖ్యఅతిథిగా ఉపన్యసించటంతో సదస్సు ప్రారంభమైంది. భారతదేశంలో ఆదివాసులు, ప్రభుత్వాల ఆదివాసీ వ్యతిరేక విధానాలతో సమస్యలనెదుర్కొంటున్నారని వివరించారు. 'విస్థాపనతో కూడిన అభివృద్ధి', అటవీ సహజ సంపదల లూటీ, భూపరాయీకరణ, ప్రకృతి క్షీణించటం, 'శర్న' వంటి స్థానిక ఆదివాసుల మతాలను గుర్తించటంలో వైఫల్యం, బలవంతంగా ఆదివాసులను హిందూమతంలోకి మళ్ళించే ప్రయత్నాలు, ఆదివాసుల రాజ్యాంగబద్ధ, చట్టపరమైన హక్కుల అమలులో వైఫల్యం వంటి అనేక ప్రభుత్వ విధానాలను ఆదివాసులు ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. భారతదేశంలో విస్థాపనకు గురైన 10 కోట్ల మందిలో 80శాతం ఆదివాసులు, స్థానిక మూలవాసులేనని ఆమె పేర్కొన్నారు.

భారత ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఇఏఎస్ శర్మ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసులను అణగద్రొక్కుతూ ముందుకెళ్తోందని, వారి హక్కులపై దాడి చేస్తోందని చెప్పారు. ఆదివాసులకు సంబంధించిన అన్ని విషయాలలోనూ గ్రామసభల, ఆదివాసీ మండళ్ళ అనుమతి తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైనదని, కనీసం జాతీయ ఆదివాసీ కమిషన్‌ను కూడా సంప్రదించదని ఆయన పేర్కొన్నారు.

ఆదివాసుల రాజ్యాంగబద్ధ హక్కుల అంశాన్ని ముందుకు తెచ్చినందుకుగానూ, దేశవ్యాపితంగా ఆదివాసీ ఉద్యమాలను ఐక్యంచేసే ప్రయత్నాలు చేస్తున్నందుకుగాను సీనియర్ జర్నలిస్టు రమణమూర్తి సదస్సు నిర్వాహకులను అభినందించారు.

ఏఐకెఎమ్ఎస్ అధ్యక్షులు కా॥వి.వెంకట రామయ్య మాట్లాడుతూ అన్ని ఆదివాసీ సమూహాలు సాధ్యమైనంత విస్తార ఐక్యత ద్వారా ఆదివాసీ హక్కుల కోసం ఒక బలమైన పోరాటం చేయగలుగుతాయన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఏర్పాటు, మూడు నల్ల సాగు చట్టాలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం నుండి అందరం నేర్చుకోవాలన్నారు. అంశాల ప్రాతిపదికపై మనం ఐక్యపోరాటాలు నిర్మిద్దామని ఆయన పేర్కొన్నారు.

ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత నాయకులు, ఛాసీమూలియా ఆదివాసీసంఘం ఒడిషా రాష్ట్ర కార్యదర్శి కా॥శ్రీకాంత్ మొహంతి ఈ సదస్సుకు హాజరై ఈ సదస్సులో ఒక పత్రాన్ని ప్రవేశ పెట్టారు. ఆ పత్రం ఇలా వుంది:

ఒక సంక్లిష్ట సమయంలో అఖిలభారత ఆదివాసీ సదస్సు నిర్వహిస్తున్నందుకు ఏఐకెఎమ్‌కెఎస్ తరపున నిర్వాహకులకు నేను అభినందనలు తెలుపుతున్నాను. మొదటగా, బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాడుతూ తమ ప్రాణాలను కోల్పోయిన బాబా తిలిక మాఘీ, సిధో-కాను-ఛాంద్-భైరవ్, బిర్సాముండా, కొమరంభీం, అల్లూరి సీతా రామరాజు, లక్ష్మణ్‌నాయక్, దొర మరియు చకర బిసోయ్ వంటి వేలాదిమంది అమరయోధులకు విప్లవ జోహార్లర్పిస్తున్నాను. వీరంతా అన్యాయానికి, దోపిడీకి, లూటీకి వ్యతిరేకంగా పోరాడుతూ తమ జీవితాలను త్యాగం చేశారు. అడవిపై మన హక్కులుగానీ, భూమిగానీ, లేదా స్వయం ప్రతిపత్తి ప్రాంతంగానీ లేదా మరేవిధమైన హక్కులుగానీ వారి అనన్య సామాన్య త్యాగాల ఫలితంగానే మనమీనాడు వాటిని అనుభవించ గలుగుతున్నాము. 1947 తదనంతర కాలంలో పోరాటాలలో మరణించిన అమరులందరికీ కూడా నేను జోహార్లర్పిస్తున్నాను. ప్రత్యేకించి తెలంగాణా సాయుధ పోరాటం, నక్సల్బరీ పోరాటం, శ్రీకాకుళ పోరాటం, మరియు రాజ్యం, పాలక వర్గాల నిర్బంధం, దోపిడీలకు వ్యతిరేకంగా సాగిన ఇతర పోరాటాలలో అమరులైన వారందరికీ జోహార్లర్పిస్తున్నాను.

అలాగే కళింగనగర్, కాశీపూర్, కోయెల్‌కరో వంటి ప్రాంతాల్లో భూమికోసం, బలవంతపు విస్థాపనకు, హక్కుల గుంజివేతకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో ప్రాణాలొడ్డిన వారందరికీ ప్రత్యేకించి మన ఆదివాసీ సోదరీ సోదరులైన అమరులందరికీ నివాళులర్పిస్తున్నాను.

ఆదివాసులను, అడవులలో నివాసముండే ప్రజాసమూహాల హక్కులను కుదించివేస్తూ, అటవీ సంరక్షణ(సవరణ) బిల్లు-2023ను ముందుకు తెచ్చేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో ఈ సదస్సు జరుగుతోంది. గ్రామసభల అధికారాన్ని ఈ బిల్లు సంపూర్ణంగా హరించి వేస్తోంది. అటవీ హక్కుల చట్టం, పెసా, ఎల్ఏఆర్ఆర్ చట్టం-2013 వంటి చట్టాలలోని నిబంధనలన్నింటినీ, ఈనాడు ఆదివాసులకున్న కనీసపాటి హక్కులను కూడా ఈ బిల్లు తొలగిస్తోంది. ఆదివాసులను, స్థానిక మూలవాసీ ప్రజానీకాన్ని మరింతగా హక్కులనుండి దూరం చేస్తుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే, అడవుల నిర్మూలనాక్రమాన్ని, జీవనాధారాల తొలగింపును, జీవవైవిధ్యాలను ధ్వంసం చేయటాన్ని అది వేగవంతం చేస్తుంది. అలాగే అది భారీస్థాయి విస్థాపనలకు, ఆకలికి, ఆదివాసుల ఇతర అటవీవాసుల ఆకలి చావులకు దోవతీస్తుంది. అటవీ భూమిని అటవీయేతర ప్రయోజనాలకు అనగా-గనుల తవ్వకం, పరిశ్రమల ఏర్పాటు పేరిట, మౌలిక వసతుల కల్పనపేరిట మళ్ళించే ప్రక్రియ ప్రమాదకర వేగంతో ముందుకు సాగుతుంది. కేవలం 2008-19 మధ్యకాలం లోనే ప్రాజెక్టుల అభివృద్ధిపేరిట నాలుగు లక్షల హెక్టార్ల అటవీ భూమిని ప్రక్కకు మళ్ళించటం జరిగింది. (ఇ-గ్రీన్‌వాచ్)

సిఏఎమ్‌పిఏ(క్యాంపా) నిధి క్రింద అటవీ భూముల తొలగింపునకు పరిహారంగా తిరిగి వనమహోత్సవాల పేరిట, ఉమ్మడి భూములతో సహా లక్షలాది ఎకరాల భూములను సేకరిస్తున్నారు. తరతరాలుగా ఈ భూములన్నీ మన ఆదివాసీ సోదరీసోదరులు, సమాజంలోని ఇతర పేదవర్గాలు సాగుచేసుకుంటున్నవేనని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరంలేదు. నష్టపరిహారం క్రింద వనమహోత్సవం పేరిట అటవీ భూములను మళ్ళించేందుకు గ్రామసభ యొక్క ముందస్తు అనుమతి అవసరం వుండదు. వనమహోత్సవం పేర నష్టపరిహారం అనేది ఓ మిధ్య. సహజంగా పెరిగిన అటవీ భూములకు, ప్రాజెక్టు కారణంగా జరిగిన నష్టాన్ని ఎన్ని వనాలు పెంచినా దానిని పునస్థాపితం చేయలేవు.

అదేవిధంగా అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు భూబ్యాంకు ద్వారా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు అటవీ భూములు, ఉమ్మడి యాజమాన్య భూములతోసహా లక్షలాది హెక్టార్ల భూములను సేకరిస్తున్నాయి, మన అడవులను, సహజవనరులను, గనులను విదేశీ మరియు దళారీ పెట్టుబడిదారులకు దాసోహం చేసేందుకు పాలకులకు ఒక నిర్దిష్టమైన పథకం వుంది. ఇది ఫ్యూడల్ కాలపు భూముల సమీకరణ మినహా, హక్కులను గుంజివేసుకొని మరొకరికి

కట్టబెట్టటం మినహా వేరుకాదు. ఈ ప్రజా వ్యతిరేక, పర్యావరణ వ్యతిరేక పథకాల దుష్ఫలితాలను మన ఆదివాసీ సోదరీసోదరులు అనుభవిస్తున్నారు.

బహుళజాతి పెట్టుబడిదారుల, దళారీ పెట్టుబడిదారుల లాభదాహాన్ని సంతృప్తి పరిచేందుకు మోడీ నాయకత్వంలోని నేటి ప్రభుత్వం మన అడవులను, మన జీవనా ధారాలను, మన జీవావరణాన్ని ధారాదత్తం చేసేందుకు త్వరపడుతోంది. ప్రాజెక్టులకు ఎంతవేగంగా పర్యావరణ అనుమతులు లభిస్తున్నాయో మనం చూడవచ్చు. కేవలం 2022 సంIIలోనే 12 వేల ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇచ్చివేశారు. 2018 సంIIలో కంటే ఇది 20 రెట్లు ఎక్కువ. దట్టమైన అడవులు, కోస్తాతీరప్రాంత పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యాలు వేగంగా విధ్వంసమవుతూ అతి త్వరలోనే పర్యావరణ, జీవావరణాలకు ఒక పెద్ద విపత్కరపరిస్థితిని కల్పిస్తున్నాయి. విచక్షణా రహితంగా గనులను, సహజ వనరులను కొల్లగొట్టటమనే ఈ అభివృద్ధి క్రమాన్ని సామ్రాజ్యవాద ప్రభువులు రూపొందించగా, మన దేశీయ పాలకులు అమలుచేస్తున్నారు. ఇది ప్రజల జీవితాలను, జీవనాధారాల్ని నాశనం చేస్తుంది. ఆర్థిపరంగానూ, పర్యావరణపరం గాను ఈ తరహా అభివృద్ధి మనగడ సాగించగలిగినది కాదు. దేశవ్యాపితంగా ఈ తరహా విధానాలను వ్యతిరేకించటంలో ఆదివాసీ ప్రజానీకం ముందున్నారు.

ఐదవ షెడ్యూలులో భాగమైన అధిక సంఖ్యలోని ఆదివాసులకు ఈనాటికీ స్వంత భూమిలేదు. భూహక్కులు లేవు. బ్రిటీష్ పాలనా కాలంలోనే కండగలిగిన అత్యధిక భూములు గిరిజనేతర దోపిడీదారులకు బదలాయింపు జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 1/70 చట్టం, ఒడిషాలో 2/56 రెగ్యులేషన్, ఝూర్ఖండ్‌లో సిఎన్‌టి/ఎస్‌పిటి చట్టం మొదలైనవన్నీ అసలైన గిరిజన యజమానికి చెందిన అతికొద్ది భూములను మాత్రమే పునరుద్ధరించాయని ప్రకటించుకున్నాయి. చట్టపరమైన నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఈనాటికీ షెడ్యూలు ప్రాంతంలో భూపరాయీకరణ జరుగుతూనే వుంది. పరాయీకరించిన ఈ భూమిపై తమ హక్కును తిరిగి పొందటంకోసం అనేక ప్రాంతాల్లో ఆదివాసీ సమూహాలు పోరాటం సాగిస్తున్నారు. ఆదివాసీ ప్రజానీకపు పరిరక్షణకోసం ప్రత్యేకించి రాజ్యాంగంలోని 5,6 షెడ్యూళ్ళలో పేర్కొన్న చర్యలను కూడా ఈ ప్రభుత్వాలు బలహీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

నిరసనగళాలను అణచివేయటంకోసం ఈ ప్రభుత్వం అన్నిరకాల ఫాశిస్టు పద్ధతులను ప్రయోగిస్తోంది. పాలకవర్గ రాజకీయాలను వ్యతిరేకించినందుకుగానూ అనేకమంది ఆదివాసీ సోదరీసోదరులు, అనేక మంది కార్యకర్తలు ఈనాడు జైళ్ళలో మగ్గుతున్నారు.

మన మాతృభూమికి చెందిన ఆదివాసీ, స్థానిక తెగల ప్రజానీకానికి జరిగిన చారిత్రక అన్యాయం-యుపిఏ లేదా ఎన్‌డిఏ అయినప్పటికీ -ఈనాటికీ మన దేశీయ పాలకుల పాలనలోనూ కొనసాగుతూ వుంది.

మన అడవులను, మన భూములను, మన సహజవనరులను కాపాడుకునేందుకు సమష్టిగా పోరాడుదాం. అటవీ పరిరక్షణ(సవరణ) బిల్లు-2023ను సమైక్యంగా వ్యతిరేకిద్దాం. మన సంస్కృతిని, సాంప్రదాయాలను, భాషలను బ్రాహ్మణీయ, సామ్రాజ్యవాద సాంస్కృతిక దురాక్రమణ నుండి కాపాడుకునేందుకు పోరాడుదాం.

ఆదివాసీ స్వయంప్రతిపత్తి ప్రాంతంకోసం, స్థానిక తెగల ప్రజానీకానికి సంపూర్ణ స్వయం ప్రతిపత్తికోసం, స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన దోపిడీరహిత సమాజం కోసం మనందరం గొంతెత్తుదాం. ✶

## మహారాష్ట్ర — ద్రోణగిరిలో కాంకర్ కార్మికుల ఆందోళన

**కంటైనర్** కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(కాంకర్)అనేది రైల్వేశాఖకు చెందిన ప్రభుత్వరంగ కంపెనీ. భారీ కంటైనర్లద్వారా ఎగుమతులు, దిగుమతులను ఈ కంపెనీ నిర్వహిస్తుంది. మహారాష్ట్ర రాయఘర్ జిల్లా-ద్రోణగిరిలో దీని స్థావరం వుంది. ఆ కారణంచేత దీనిని ద్రోణగిరి రైల్ టెర్మినల్(డిఆర్‌టి) అని కూడా పిలుస్తారు. ఈ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు వివిధ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిరంతరాయంగా పనిచేస్తూ వస్తున్నారు. ఇప్పటికి అనేకమంది కాంట్రాక్టర్లు మారారు. అయినా కార్మికులను మార్చకుండా కొనసాగించటమనేది కార్మికుల దృఢమైన ఐక్యతతోనే సాధ్యమైంది. కాంట్రాక్టరు మారినప్పుడల్లా, పాత కార్మికులను తొల గించేందుకు, నూతన కార్మికులను తక్కువ వేతనంపై నియమించుకునేందుకు అతను ప్రయత్నం చేస్తాడు. అందువలన, దానిని అడ్డుకునేందుకు ప్రతిసారీ సంఘర్షణ, ఆందోళన అవసరమౌతుంది.

2023 ఏప్రిల్ 4వ తేదీన కాంకర్ సంస్థ తమ అధీనంలో ఓ యంత్రాన్ని తొలగించి, అద్దె ప్రాతిపదికన మరో యంత్రాన్ని తెచ్చిపెట్టు కోవాలని చూసింది. ఈ కొత్తయంత్రంపై తమకు పని లభిస్తుందనే గ్యారంటీ నివ్వవలసిందిగా కార్మికులు ప్రశ్నించినపుడు, కాంకర్ యాజమాన్యం స్పందించలేదు. కనుక, కార్మికులు తాము పనిచేసే పాత యంత్రాన్ని పని ప్రదేశం నుండి తరలించటానికి అంగీకరించలేదు. దీనితో నూతనంగా తీసుకొచ్చే యంత్రంపై కార్మికులకు పని కల్పిస్తామని కాంకర్ యాజమాన్యం కార్మికులకు హామీ నివ్వటంతో, కార్మికులు తమ పాత యంత్రాన్ని బయటకు పంపేందుకు అంగీకరించారు. యాజమాన్యం తమ హామీపై నిలబడకుండా కొత్తగా తెచ్చిన యంత్రంపై పాత కార్మికులను పనిచేయ నీయకుండా, ప్రత్యేకించి ఆ యంత్రం కోసం ఇద్దరు కార్మికులను పనిలోకి తీసుకొచ్చారు.

ఈ చర్యతో, తమ ఉద్యోగాలు క్రమంగా ప్రమాదంలో పడబోతున్నాయని కార్మికులకు స్పష్టమైంది. కార్మికులంతా ఈ సమస్యపై సమావేశమై, మిగిలిన అన్ని యంత్రాలను పనిచేయకుండా ఆపివేసి తమ నిరసన తెలియ జేశారు. ఫలితంగా, మొత్తం పనిఅంతా ఆగిపోయింది. అరగంట సమయం మాత్రమే యంత్రాలన్నింటినీ నిలిపి వుంచారు. దీనితో దిగివచ్చిన కాంకర్ యాజమాన్యం కార్మికులతో చర్చలు జరిపింది. నూతనంగా తీసుకొచ్చిన యంత్రాన్ని పనిచేయకుండా నిలిపివుంచే షరతుపై, మిగిలిన యంత్రాలను పనిచేయించ టానికి కార్మికులు అంగీకారం తెలిపారు. నూతన యంత్రాన్ని నూతన కార్మికులచేత ప్రారంభించే ప్రయత్నంచేస్తే, మరల పనులు అన్నింటినీ స్థంభింపజేయాలని కార్మికులు నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల సంఘర్షణ, ఉద్రిక్త పరిస్థితుల తర్వాత, అంతిమంగా గత 12 సంIIలుగా సంస్థలో పనిచేస్తున్న కార్మికులే, ఈ నూతన యంత్రంపై కూడా పనిచేసేవిధంగా యాజమాన్యం అంగీకరించింది. ఒక వారం రోజుల తర్వాత ఇప్పుడు కార్మికులంతా ఉపశమనం పొందామని సంతోషంగా వున్నారు. ఈ సంఘర్షణ, సంభాషణలు జరిపే క్రమం వంటివన్నీ కార్మికుల ఐక్యతా బలంపై ఆధారపడే సాధ్యమయ్యాయి. విద్వేషం, మతతత్వాలు దేశంలో ఎల్లెడలా వ్యాప్తి జరుగుతున్న నేటి దేశ పరిస్థితుల్లో కేవలం కార్మికుల ఐక్యత మాత్రమే దానిని నిరోధించగలుగుతుంది. ✶

**Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24**
No.of pages : 24 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించండి

## వామపక్షాల రాష్ట్రసదస్సు పిలుపు

**(2023 జూన్, 18** విజయవాడ బాలోత్సవ్ భవనంలో సిపిఐ(యం), సిపిఐ, సిపిఐ(యం-యల్)న్యూడెమొక్రసీ, సిపిఐ(యం-యల్), యంసిపిఐ(యు), సిపిఐ(యం-ఎల్)లిబరేషన్, సిపిఐ(యం-యల్)న్యూడెమొక్రసీ, యస్‌యుసిఐ(సి), ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్‌ఎస్‌పిల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రసదస్సులో విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించాలని పిలుపునిస్తూ తీర్మానించారు. ఈ క్రింది డిమాండ్లపై వివిధ అంచెలుగా ఐక్య ఆందోళనోద్యమాన్ని నిర్మించే దానిలో భాగంగా జిల్లాలలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సంతకాల సేకరణ, శాసనసభ్యులకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని, జూన్ 30న రాష్ట్రవ్యాపితంగా విద్యుత్తు కార్యాలయాలు లేదా సబ్‌స్టేషన్‌ల వద్ద ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.)

**డిమాండ్స్:** ❖ సర్దుబాటు ఛార్జీల విధానమే రద్దుచేయాలి. ❖ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల వసూళ్లు నిలిపివేయాలి. ❖ స్మార్ట్ మీటర్లు పెట్టరాదు. ❖ విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను ప్రభుత్వాలు విరమించాలి. ❖ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు పెట్టొద్దు. ❖ ప్రభుత్వ హామీ ఇచ్చినవిధంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, వృత్తిదారులకు అన్ని రాయితీలు సంపూర్ణంగా అమలుచేయాలి. ❖ గృహ వినియోగదారులందరికీ 100 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి. ❖ విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభుత్వం ఇవ్వవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలి. ❖ అదానీతో సహా వివిధ కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి.❖ కేంద్రప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించాలి. ❖ కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2022 ప్రతిపాదనలను ఉపసంహరించాలి. ✶

# ఢిల్లీ కార్మికుల, రైతుల, రైతుకూలీల, వివిధ సెక్షన్ల శ్రామికుల ఆందోళన

**న్యూఢిల్లీలోని** రామ్‌లీలామైదానంలో 2023 ఏప్రిల్ 6న కార్మికులు, రైతులు, రైతుకూలీలతోసహా అంగన్‌వాడీ సహాయకులు, ఆషా కార్మికులు, మధ్యాహ్న భోజన తయారీ కార్మికులు మరియు వివిధ రంగాల శ్రామికులు హాజరైన భారీ ప్రదర్శన, సభ జరిగింది. ఏఐకెఎస్. సిఐటియు, ఏఐఎడబ్ల్యుయుల ఆధ్వర్యంలో పదుల వేలసంఖ్యలో ఈ కార్యక్రమంలో రైతులు, కార్మికులు పాల్గొని తామెదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎలుగెత్తి చాటారు.

1. నాలుగు లేబర్‌కోడ్‌లను, విద్యుత్(సవరణ)బిల్లును రద్దుచేయాలి. 2. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం క్రింద పనిదినాలను 200 రోజులకు పెంచాలి. 3.నెలకు పదివేల రూ॥ల సార్వత్రిక పింఛను, నెలకు 26 వేల రూ॥ల కనీసవేతనాన్ని కల్పించాలి. 4. ఉద్యోగ, ఉపాధి కల్పనలలో కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేయాలి. 5. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సూత్రానికనుగుణంగా 'సి2ప్లస్50'పై ఆధారపడి కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీ కల్పించాలి. 6. ప్రజాపంపిణీ వ్యవస్థను సార్వత్రీకరించాలి. 7. అటవీ(పరిరక్షణ) చట్టానికి చేసిన వివాదాస్పద సవరణలను ఉపసంహరించుకోవాలి. నిరసన ప్రదర్శన సందర్భంగా ప్రదర్శకులు ప్రధానంగా ఈ డిమాండ్లను ముందుంచారు.

అధిక సంఖ్యలో మహిళలూ వ్యవసాయ కార్మికులతోసహా, దాదాపు 20వేల మంది వ్యవసాయ కార్మికులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పని పరిస్థితుల దుస్థితి కారణంగా కుటుంబాలలో మగవారు వలసపోతుంటే, మహిళలు వ్యవసాయ పనులపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ప్రదర్శకులు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాలన్నీ ప్రైవేటీకరించబడటంతో దళితులు మరింత వెనుకకు నెట్టబడి, వ్యవస్థనుండే వాస్తవికంగా గెంటివేయబడుతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు చట్టబద్ధంగా ప్రకటించిన కనీస వేతనం లేదని, రాష్ట్రప్రభుత్వాలు వారి స్వీయ ధరలను వారు ప్రకటిస్తున్నారని, అవి కూడా అమలుకాని పరిస్థితినెలకొందన్నారు. వీటిని అమలుచేసే వ్యవస్థే లేదన్నారు. అందువలన వ్యవసాయ కార్మికుల వేతనాలపై కేంద్రప్రభుత్వం చట్టంచేయాలని డిమాండ్‌చేశారు. రైతులు మాట్లాడుతూ కనీస మద్దతు ధరను గ్యారంటీ చేస్తూ చట్టం తేకుంటే రైతులు వ్యవసాయాన్ని వదలివేయటం మినహా మరో గత్యంతరం లేదన్నారు. ✶

# హర్యానా గిట్టుబాటు ధరకోసం రైతాంగ ఆందోళన

**హర్యానా** రాష్ట్రరైతులు మరోసారి భారీసంఖ్యలో రోడ్లపైకొచ్చారు. తాము పండించిన పొద్దుతిరుగుడు పంటకు మద్దతుధర పెంచాలని డిమాండ్‌చేస్తూ 2023 జూన్ రెండోవారంలో రోజుల తరబడి ఆందోళన చేశారు. ఢిల్లీ-చండీఘడ్ జాతీయ రహదారిని జూన్ 12న దిగ్బంధం చేశారు. దీనిలో పంజాబ్, ఉత్తరప్రదేశ్ రైతులు కూడా పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటా 6,400 రూ॥ల కనీస మద్దతుధరకు కురుక్షేత్ర జిల్లాలోని పిప్లీ వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులెవరూ కొనుగోలు చేయటంలేదు. దీనితో రైతాంగం ఆగ్రహించి, ఆందోళనకు దిగారు. ఆందోళనకారులపై పోలీసులు తీవ్రంగా లాఠీఛార్జీ చేశారు. అనేకమందిని అరెస్ట్‌చేసి కేసు బనాయించారు. కనీస మద్దతుధరకోసం ప్రత్యేకచట్టం చేయాలన్న డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రభుత్వం ప్రకటించిన ధరకంటే తక్కువకు పంటను కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలేమీ తీసుకోకుండా, రైతుల నష్టం పూడ్చటానికి ప్రతి క్వింటాకు వెయ్యి రూపాయలు చొప్పున ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. అయినా రైతులకు గిట్టుబాటు కాకపోవటంతో వారంతా ఉద్యమబాట పట్టారు. ✶

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010